Dwaraka

fb/prajasakti, www.prajasakti.com

సిటీ


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 14 | విజయవాడ, ఆదివారం 14 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 5.00







బడ్జెట్‌పై భారీ కోర్కెలతో...



కేంద్రానికి రాష్ట్రం వినతుల చిట్టా

ఆర్థిక మంత్రులతో 18న ఢిల్లీలో భేటీ

రాజధాని, ద్రవ్య లోటుపై వినతులు

పారిశ్రామిక ప్రోత్సాహకాలపైనా విజ్ఞప్తి

2

హైలెస్సో.. హైలెస్సా

దివిసీమ సంప్రదాయ సంబరాల్లో భాగంగా కృష్ణా జిల్లా నాగాయలంకలో శనివారం నిర్వహించిన పడవ పోటీల్లో సెయిలర్ల జోరు

7





పల్లెకు పోదాం చలో..చలో

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ పల్లెబాట పట్టింది. శనివారం సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

12

పరామర్శపై పాశవికం

పెత్తందార్ల దాడికి గురైన దళితులను కలవడానికి వెళ్తున్న సిపిఎం నాయకులపై పోలీసుల నిర్బంధం



గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడులో పెత్తందార్ల దాడిలో గాయపడిన దళితులను పరామర్శించడానికి వెళ్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధును, ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు వి కృష్ణయ్యను అరెస్టు చేస్తున్న పోలీసులు

2

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు సహా నాయకులు, కార్యకర్తలు అరెస్టు, పలు పోలీస్ స్టేషన్లకు తరలింపు

గుంటూరు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న వైఎస్ఆర్, బాబూరావు ప్రభృతుల అరెస్టు

సుప్రీం వివాదంలో బార్ కౌన్సిల్ రంగ ప్రవేశం

నేడు న్యాయమూర్తులతో భేటీ

బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగింది. శనివారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సమావేశమయింది. సంక్షోభాన్ని పరిష్కరించడానికి బార్ కౌన్సిల్‌కు చెందిన ఏడుగురు ప్రతినిధుల బృందం ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సమావేశం కావాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఈ వివాదం పరిష్కారానికి సుప్రీంకోర్టు బార్ అసోషియేషన్ కూడా తన వంతు ప్రయత్నం చేయడానికి నడుం బిగించింది. సుప్రీంకోర్టు విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు ఈ వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలని బార్ అసోషియేషన్ తీర్మానించింది. బార్ కౌన్సిల్ సమావేశం అనంతరం కౌన్సిల్ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా మీడియాతో మాట్లాడారు. 'మనలో మురికిని బహిరంగంగా శుభ్రం చేసుకోవాల్సిన అవసరం లేదు. కెమెరాల ముందుకు వెళ్లడం మన వ్యవస్థను బలహీన పరుస్తుంది' అని అన్నారు. కాగా, సుప్రీంకోర్టుల జడ్జీల వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ శనివారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమయింది. సమావేశంలో రెండు తీర్మానాలను ఆమోదించారు. వీటిలో ఈ వివాదాన్ని వెంటనే పరిష్కరించాలనే తీర్మానం ఒకటి. ఈ సమావేశం నేపథ్యంలో మిగతా 9లో

చీఫ్ జస్టిస్ ఇంటి ముందు ప్రధాని ముఖ్య కార్యదర్శి..!

8



ఆంధ్రావ్యాలీకి అంకురార్పణ

8 కంపెనీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి

సిలికాన్ వ్యాలీ తరహాలో అభివృద్ధి

లక్ష ఉద్యోగాలే లక్ష్యమంటూ ప్రకటన



జోహో ఐటి కంపెనీని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

తిరుపతిని ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చెప్పారు. సిలికాన్ వ్యాలీ తరహాలో ఆంధ్రా వ్యాలీగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన నారావారిపల్లెలో మూడు రోజులపాటు ముఖ్యమంత్రి బస చేయనున్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్న ఆయన ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. రేణిగుంట, తిరుపతిలో ఏర్పాటు చేసిన 8 ఐటి కంపెనీలను శనివారం ప్రారంభించారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రముఖ ఐటి కంపెనీ 'జోహో'ను తొలుత ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మిగతా 9లో





రాజకీయ దుమారం

నిట్‌కు స్థల కేటాయింపుపై టిడిపి × బిజెపి

గూడెం మున్సిపల్ ఛైర్మన్‌కు సిఎం హెచ్చరిక

విచారణకు త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి, బిజెపి నాయకత్వం మధ్య ఇప్పటికీ పొసగడం లేదు. పైకి నవ్వుతూ కనిపించినా లోన మాత్రం ఎవరికి వారు గోతులు తవ్వుకుంటున్నారు. నీ సంగతి చూస్తానంటే నీ సంగతి చూస్తానంటూ హెచ్చరికలు చేసుకుంటున్నారు. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లాలో మంత్రి మాణిక్యాలరావు, తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మధ్య రేగిన వివాదం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపింది. బిజెపి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిని ఆఫ్టాల్ ఆనడంపై ఆ పార్టీ తీవ్రస్థాయిలో ఆగ్రహంతో ఉంది. పైకి వ్యక్తిగత దూషణగా కనిపిస్తున్నా లోపల మాత్రం రాజకీయ వ్యవహారం ఉంది. తాడేపల్లిగూడేనికి కేంద్రం నిట్‌ను మంజూరు చేసింది. దీనికి స్థల కేటాయింపు వ్యవహారం మిగతా 9లో

సంక్రాంతికి ఇళ్లు భ్రాంతే

ప్రకటించింది 2.50 లక్షల గృహాలు

పట్టణ ప్రాంతాల్లో చేపట్టింది 61 వేలే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతికి కొత్త ఇళ్లు భ్రాంతిగానే మిగిలింది. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ప్రకటించిన విధంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం పదేపదే సంక్రాంతి నాటికి పట్టణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు పూర్తి చేసి ఇచ్చేస్తామని ప్రకటిస్తూ వచ్చింది. ఆచరణలో పండగొచ్చినా ఒక్క ఇల్లూ పూర్తి కాలేదు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 110 పట్టణ ప్రాంతాల్లో నిర్మాణం చేపడుతున్నామని, లబ్ధిదారులకు సంక్రాంతికి కొత్త లోగిలి కల్పిస్తామని చెప్పారు. దీనికోసం అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో ఉన్న ఇళ్లనూ కూలగొట్టారు. వాటి నిర్మాణం పూర్తికాలేదు. విజయవాడ లాంటి నగరాల్లో జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం వాటిని కూడా లెక్కల్లో కలిపి చెబుతోంది. వాస్తవంగా పట్టణ ప్రాంతాల అభివృద్ధి పేరుతో మురికివాడలను తొలగిస్తున్నారు. తొలగించిన వారికి ఊరికి దూరంగా ఇళ్లు నిర్మించి కేటాయిస్తున్నారు. అటువంటివారే రెండు లక్షల మందికి పైగా ఉంటారు. ఇప్పుడు వారందరికీ ఇళు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మించి ఇస్తున్నట్లు ప్రకటనలు చేస్తోంది. కొత్తగా నిర్మించి ఇచ్చే ఇళ్లను కాకుండా తొలగించిన ఇళ్లు నిర్మించి ఇవ్వడాన్ని కూడా ప్రభుత్వం ఉదారంగా ఇస్తున్నట్లు ప్రకటనలు ఇవ్వడం గమనార్హం. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనుల పేరుతో వివిధ పట్టణాలు ప్రాంతాల్లో 1.20 లక్షల మందిని తొలగించారు. కుటుంబాల వారీగా చూస్తే వారికి కేటాయించాల్సిన ఇళ్లు రెండు లక్షలకు పైగానే ఉన్నాయి. మరో 50 వేల వరకూ మున్సిపాలిటీల్లో అదనంగా కేటాయింపులు చేశారు. వీటిల్లో ఇప్పటి వరకూ పూర్తయినవి పెద్దగా లేవు. అలాగే బలహీనవర్గాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద నిర్మించే ఇళ్లను కూడా వాటిల్లో కలిపేశారు. అంతకుమించి కేటాయింపులు లేవు. దీన్ని కూడా తామే సొంతంగా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటి వరకూ 2.41 లక్షల వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. అలాగే మొత్తం 110 మున్సిపాలిటీల్లో 12630 ఇళ్లు రూఫ్ లెవల్‌కు చేరుకున్నాయి. అలాగే లింటల్ లెవల్స్‌లో 2934 ఉన్నాయి. బేస్‌మెంట్ లెవల్లో 31593 ఇళ్లు, పిల్లర్ల దశలో 14258 ఇళ్లు మొత్తం 61415 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కేటాయించిన వాటిల్లో 4352 ఇళ్ల మిగతా 9లో



ట్రంప్‌పై ఆఫ్రికా ఆగ్రహం

క్షమాపణ చెప్పాలని డిమాండ్

54 దేశాల ఏకగ్రీవ తీర్మానం

న్యూయార్క్ : ఇమ్మిగ్రేషన్‌పై వర్ణవివక్షతో కూడిన వ్యాఖ్యలు చేసినందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్షమాపణ చెప్పాలని 54 దేశాలు డిమాండ్ చేశాయి. ఈ విషయంలో ఆఫ్రికన్ దేశాలన్నీ ఒకే తాటిపై నిలిచాయి. తన వ్యాఖ్యలను ట్రంప్ వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని ఏకగ్రీవంగా డిమాండ్ చేశాయి. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మీడియాలో విస్తృతంగా ప్రచారమైన నేపథ్యంలో ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ ఐక్యరాజ్య సమితిలో ఆఫ్రికన్ దేశాల రాయబారుల గ్రూపు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలపై చర్చించేందుకు అత్యవసరంగా సమావేశమైన ఆ గ్రూపు, ఆఫ్రికా దేశాల పట్ల, ఆఫ్రికన్ల పట్ల అమెరికా ప్రభుత్వ ధోరణి చాలా ఆందోళనకరంగా వుందని పేర్కొంది. రంగును బట్టి ప్రజలను అవమానించే ధోరణి సరికాదని పేర్కొంది. ఈ వ్యాఖ్యలను ఖండించిన మిగతా 9లో



గజల్ శ్రీనివాస్‌కు రిమాండ్ పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైంగిక వేధింపుల కేసులో అరెస్టయి చంచల్ గూడ జైల్లోఉన్న గజల్ గాయకుడు శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు మరో 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. గతంలో కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో పంజాగుట్ట పోలీసులు శ్రీనివాస్‌ను శనివారం కోర్టులో హాజరు పరిచారు. రిమాండ్ నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి ఈ నెల 25 వరకు రిమాండ్ పొడిగించారు. మరోవైపు గజల్ శ్రీనివాస్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ ఈ నెల 18న విచారణకు రానుంది. లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు ఈనెల 2న గజల్ శ్రీనివాస్‌ను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

ఆన్‌లైన్ బంధం

అలీబాబా కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, భూమా అఖిలప్రియ



ఇ-కామర్స్‌లో మరో ముందడుగు

- అలీబాబా డాట్ కామ్‌తో త్వరలో ఒప్పందం
- లోకేశ్, అఖిలప్రియ సమక్షంలో చర్చలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇ-కామర్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అలీబాబా డాట్ కామ్ కంపెనీ సహకారంతో ఎపిలోని నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు త్వరలో ఒక ఒప్పందం చేసుకోబోతోంది. అలీబాబా కంపెనీ ప్రతినిధులతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ శనివారం ఉదయం హైదరాబాదులో సమావేశమై చర్చించారు. మరో వారం పది రోజుల్లో విజయవాడలో అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఎంఒయు కుదుర్చుకోనున్నామని అఖిలప్రియ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలో ఉపాధి శిక్షణ కోసం తొలుత అలీబాబా కంపెనీ చైనా ప్రతినిధులతో చర్చలు సాగించామన్నారు. అయితే ఇది కేవలం తమ శాఖకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ వర్తింపజేయాలని చైనా ప్రతినిధులను నారా లోకేష్ వద్దకు తీసుకెళ్ళామని తెలిపారు. అలీబాబా కంపెనీ ఇండియా బిజినెస్ డెవలప్ మెంట్ హెడ్ వందర్ ఛాన్, టిడిఐ గ్లోబల్ హెడ్ సంజయ్ శర్మలతో చర్చించిన లోకేష్, ఎపిలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఇది సదవకాశమని పేర్కొన్నారు. ఈ కంపెనీ ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు టెక్నికల్, ఇ-కామర్స్, మార్కెటింగ్‌లో శిక్షణ అందించి, ఉపాధి కల్పిస్తామని అలీబాబా కంపెనీ ఇండియా బిజినెస్ డెవలప్ మెంట్ హెడ్ వందర్ ఛాన్ తెలిపారు. త్వరలో నవ్యాంధ్ర రాజధానిలో అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఎంఒయు కుదుర్చుకోవడం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందని పర్యాటక శాఖ మంత్రి అఖిలప్రియ వివరించారు.



ఈశాన్యం, తూర్పు నుంచి చలి గాలులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంపైకి ఈశాన్యం, తూర్పు నుంచి సముద్రం మీదుగా చలి గాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఆకాశం నిర్మలంగా ఉండటంతో మంచు కురిసే అవకాశముందని తెలిపింది. నాలుగు రోజులపాటు కోస్తా, రాయలసీమల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుందని పేర్కొంది. భూమధ్య రేఖా ప్రాంతంపై ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు వాయువ్య భారతదేశంలో పశ్చిమ ఆటంకాలు ఏర్పడినట్లు తెలిపింది.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. ఇస్రో ఇటీవల ప్రయోగించిన 100వ ఉపగ్రహం?
2. బెటా పిక్టోరిస్ నక్షత్ర కుటుంబంపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఉపగ్రహం?
3. జాతీయ యువజన దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
4. 'ఒపియన్ ఆఫ్ గ్లోబల్ లీడర్స్' జాబితాలో తొలిస్థానం పొందిన నాయకుడు?
5. 2018 వింటర్ ఒలింపిక్స్ ఎక్కడ జరగనున్నాయి?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పరామర్శపై పాశవికం

గుంటూరులో పోలీసు నిర్బంధం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దళితులపై ఆధిపత్య కులాల వారు దాడికి పాల్పడిన నేపథ్యంలో.. బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న సిపిఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధుతోపాటు ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దసంఖ్యలో పోలీసులు శనివారం గుంటూరులో అరెస్టు చేసి తీవ్ర ఉద్రిక్తతకు కారణమయ్యారు. అరెస్టు చేసిన వారిని జిల్లాలోని వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. పెదగొట్టిపాడును సందర్శించేందుకు మధుతోపాటు పార్టీ నాయకులు వస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో.. శుక్రవారమే పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావుతోపాటు పలువురు నాయకులను అరెస్టు చేయడమేకాకుండా పార్టీ నాయకుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఉదయం 7 గంటల నుంచి పోలీసులు బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయాన్ని దిగ్బదించారు. పరిసర వీధుల్లో పోలీసులను మొహరించారు. నగరంలోని పోలీసు అధికారులను బస్టాండ్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించి మధు ఏ మార్గం నుంచి వస్తున్నారో తెలుసుకునేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఉదయం 10 గంటల సమయంలో పోలీసుల నిఘాను ఛేధించుకుని మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 70 మంది వరకూ బ్రాడీపేట సిపిఎం కార్యాలయానికి చేరుకున్నారు. వెంటనే పోలీసులు ఒక్క ఉదుటున సిపిఎం నాయకులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్రంగా పెనుగులాట జరిగింది. ఒక అదనపు ఎస్‌పి,. ఒక డిఎస్‌పి,. నలుగురు సిఐలు, 10 మంది ఎస్‌ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు కార్యకర్తలను వాహనాల్లోకి లాగివేశారు. బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్.. రావెల కిషోర్‌బాబు డౌన్ డౌన్.. పోలీసు జులుం నశించాలి.. దళితులపై దాడి చేసిన అగ్రకులాల వారిని అరెస్టు చేయాలి.. అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెనుగులాటలో సిపిఎం గుంటూరు జిల్లా (పశ్చిమ) కమిటీ కార్యదర్శి గద్దె చలమయ్య స్పృహ తప్పి పడిపోవటంతో జిజిహెచ్‌కు తరలించారు. అనంతరం జిజిహెచ్ నుండి తిరిగి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధు, వి.కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు సహా, జిల్లా నాయకులతో కలిపి మొత్తం 58 మందిని అరెస్ట్ చేసి, తాడికొండ, నల్లపాడు, పట్టాభిపురం పోలీసు స్టేషన్లకు తరలించారు. మధు, కృష్ణయ్యతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన జిల్లానాయకులను అరెస్టు చేసిన నేపథ్యంలో సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని కమిటీ కన్వీనర్ సిహెచ్ బాబురావు, న్యాయవాది వై.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గుంటూరు అంబేద్కర్ సెంటర్‌లో దళితాగ్రహం పేరుతో ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. వీరిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే శుక్ర, శనివారాల్లో అరెస్టు చేసిన వారందరీని శనివారం సాయంత్రం విడుదల చేశారు. ఈ అక్రమ అరెస్టులపై జిల్లా వ్యాపితంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు జరిగాయి.



గుంటూరు జిల్లా తాటికొండ పోలీస్‌స్టేషన్ వద్ద సిపిఎం నాయకులకు మద్దతు తెలిజేస్తున్న దళిత సంఘాల నాయకులు

పెదగొట్టిపాడు వెళ్లి తీరుతాం..

దళితులు, బలహీన వర్గాలపై దాడులు చేస్తూ, రాజీల పేరుతో మభ్య పెట్టి నిందితులను కేసుల నుంచి తప్పిస్తున్నారని సిపియం రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేర్కొన్నారు. నీరు చెట్టు పేరుతో పేదల భూముల్లో మట్టిని అమ్ముకుని కోట్లు గడిస్తున్న టిడిపి నేతల ఆటలను సాగవనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని గ్రామాల్లో నేతలు పెత్తనం చేస్తున్నారని అన్నారు. తాము దళితులకు అండగా ఉండి వారికి సానుభూతి తెలిపేందుకు వెళ్తుంటే తమ పార్టీ కార్యాలయంలోకి పోలీసులు చొరబడి తమ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార మదంతో అగ్రకుల పెత్తం దారులు దళితులపై దాడులు చేస్తుంటే ప్రభుత్వం నింది తులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం ఎంత నిర్బంధం అమలు చేసినా పెదగొట్టిపాడు వెళ్లి తీరుతామని, త్వరలో చలో పెదగొట్టిపాడుకు పిలుపునిస్తామన్నారు. బాధితులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ,, ఇటీవల రాష్ట్రంలో దళితులపై దాడులు తీవ్రమయ్యాయని, ఆయా కేసుల్లో బాధితులైన దళితులపైనే తిరిగి కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. గొట్టిపాడులో ఇప్పటికే దళితులపై దాడి చేసి వారిపై కేసు నమోదు చేశారన్నారు. ధనికులను వదిలి పేదలపై కేసులు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వం పోలీసులపై ఆధారపడటం తప్ప ప్రజాస్వామ్యం, ప్రజలపై నమ్మకం లేకుండా పోయిందన్నారు. బూటకపు రాజీ లతో నిందితులను మభ్య పెడుతున్నారని అన్నారు. బయటి వ్యక్తులు బాధితుల్ని పరామర్శిస్తే వాస్తవాలు వెలుగు చూస్తా యనే భయంతోనే ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు అందరూ ఎవ్వర్నీ సందర్శించనీకుండా అడ్డుకుంటున్నారన్నారు.

పోరాటం ఆగదు

డిఎస్ఎంఎం కన్వీనర్ వి.శ్రీనివాసరావు

ప్రజశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

పెదగొట్టిపాడు బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ కన్వీనర్ వి.శ్రీనివాసరావు ప్రకటించారు. నగరంలోని లాడ్జిసెంటర్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర గొట్టిపాడు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్, పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ, భీమసేన సేవాదళ్ తదితర దళిత సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది. గొట్టిపాడుకు వెడుతున్న సిపిఎం నేతలను అరెస్ట్ చేయడాన్ని కూడా ఈ సందర్భంగా ఖండించారు. పోలీసులు ఈ కార్యక్రమాన్ని కూడా అడ్డుకుని పాల్గొన్న వారిని అరెస్ట్‌లు చేశారు. అరెస్ట్‌లకు ముందు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిసెంబరు 31 రాత్రి జరిగిన ఘటనలో అసలు దోషులను వదిలేసి దళితులను వేధిస్తున్నారని తెలిపారు. ఆ రాత్రి పెత్తందార్లు ట్రాక్టర్లపై వెళ్లి దళితవాడపై దాడులు చేయటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పోలీసులు ప్రశాంతంగా ఉందని పదేపదే చెబుతున్నారని, ప్రశాంతంగా ఉన్నప్పుడు తమను ఎందుకు దళితులను పరామర్శించకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. న్యాయం కావాలన్నవారి నోరు మూయిస్తున్నారని, ఈ జిల్లాకు చెందిన మంత్రులకు, అధికార పార్టీ నాయకులకు పెదగొట్టిపాడు గ్రామాన్ని సందర్శించేందుకు నేటి వరకు తీరిక దొరకలేదని, అధికార పార్టీ నేతల నిజస్వరూపం బయటపడిందన్నారు. దళితులకు న్యాయం జరిగేంతవరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని, కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ స్పందించాలని కోరారు. సిపిఎం సిఆర్‌డిఎ కన్వీనర్ బాబూరావు మాట్లాడుతూ పేదలపైనా, దళితులపైనా దాడులు జరుగుతున్న ప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదన్నారు. సీఎం దళితులపైన దాడితో నూతన సంవత్సరాన్ని ప్రారంభించారని విమర్శించారు. ఏ నేరం చేశారని సిపిఎం నాయకులను రాష్ట్ర ప్రభుత్వం ఆరెస్టులు చేయిస్తోందని ప్రశ్నించారు.

మహిళల వివరాలు తీసుకోండి : డిఎస్పీ

నిరసన కార్యక్రమం ముగిసి వెనుదిరిగి వెళుతున్న మహిళా కార్యకర్తల ఫోన్ నెంబర్లు, అడ్రస్‌లు సేకరించాలంటూ డిఎస్పీ సరిత ఆదేశించారు. దీనికి సిపిఎం నాయకులు తీవ్ర నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వ్యక్తిగత వివరాలు తీసుకోకూడదని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, దీనిని ఆమె ఖాతరు చేయలేదు. తనకు అంతా తెలుసని ఆమె అన్నారు. దీంతో వాగ్వివాదం జరిగింది. పోలీసుల వైఖరికి నిరసనగా రోడ్డుమీద బైఠాయించారు. నిరసనను కవర్ చేయటానికి వచ్చిన మీడియాపై డిఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు.



పోలీసు స్టేషన్‌లో వి శ్రీనివాసరావు, సిహెచ్ బాబురావు ప్రభృతులు

పది వామపక్షాల ఖండన

పెత్తందార్ల దాడికి గురైన దళితులను పరామర్శించడానికి వెళ్తున్న సిపిఎం నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని పది వామ పక్షాలు ఉమ్మడిగా ఖండించాయి. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అగ్రకుల పెత్తందార్ల ప్రాంతంలో ఓ ప్రమాదాన్ని సాకుగా చూపి దళిత పేటలపై దాడులు చేసి కొందరిని గాయాలపాల్జేయడంతో పాటు దళిత కుటుంబాలన్నిటిపై అప్రకటిత సాంఘిక బహిష్కరణ కొనసాగించడాన్ని ఖండించారు. దళితులపై దాడి చేసిన పెత్తందార్లను తక్షణమే అరెస్టు చేయాలని, దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెత్తందార్లకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ చర్యలను ప్రజాతంత్రవాదులంతా ఖండించాలని వామపక్షాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సంయుక్త ప్రకటనపై కె రామకృష్ణ (సిపిఐ), వై వెంకటేశ్వరరావు(సిపిఎం),వై సాంబశివరావు (సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ), గుర్రం విజయ్‌కుమార్ (సిపిఐ(ఎంఎల్), ఎం వెంకటరెడ్డి (ఎంసిపిఐ(యు), బి. బంగార్‌రావ్ (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్వర్లు (సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ) బిఎస్ అమర్‌నాథ్ (ఎస్‌యుసిఐ(సి), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్) జానకి రాములు (ఆర్ఎస్‌పి) సంతకాలు చేశారు.

విజయవాడ బస్ స్టేషన్‌లో మాలకొండయ్య ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి ఎండి, డిజిపి మాలకొండయ్య శనివారం తెల్లవారుజామున విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరికీ ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా ఆయనొక్కరే నేరుగా బస్‌స్టేషన్ ఇన్‌గేట్, బస్‌స్టేషన్ పరిసరాలను, ప్రయాణికుల రద్దీని పరిశీలించారు. నిద్రిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని మందలించారు. పార్సిల్ కార్యాలయం దగ్గర చిందర వందరగా పడి ఉన్న పార్సిళ్లను ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం లేకుండా సరి చేయాలని ఆదేశించారు. మంచి నీటి కుళాయిల ద్వారా నిరంతరం తాగునీరు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రయాణికులు బస్సులు దిగే సమయంలో మహిళలకు, వృద్ధులకు, పిల్లలకు సాయం అందేలా చూడాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఎండి తనిఖీ విషయం తెలుసుకున్న ఆర్ఎం పివి రామారావు, డిప్యూటీ సిటిఎం నాగేంద్ర కుమార్, ఎటిఎం బషీర్, వెంకటేశ్వరరావు తరలిరాగా, వారితో వసతుల గురించి చర్చించారు.

అధ్యాపక పోస్టులు భర్తీకి లైన్ క్లియర్

త్వరలో పరీక్ష షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీకి మార్గం సుగమయింది. చాలా ఏళ్ల నుంచి యూనివర్సిటీల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1,385 పోస్టులను పదోన్నతుల ద్వారా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తుండగా, మిగిలిన 1,110 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ బాధ్యతను ఎపిపిఎస్‌సికి అప్పగిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో బిల్లు ఆమోదించింది. ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో త్వరలో ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

ఎసిబి కేసులో స్టేట్ టాక్స్ అదనపు కమిషనర్ సహా నలుగురికి రిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వాణిజ్య పన్నుల (స్టేట్ టాక్స్) అధికారి యు ఏడుకొండలు లంచం కేసులో ఎసిబి అధికారులు శనివారం నలుగురిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు కమర్షియల్ టాక్స్ రాష్ట్ర అదనపు కమిషనర్ ఏడుకొండలు సహా అతనికి సహాయం చేసిన ఆఫీస్ సూపరింటెండెంట్ కె అనంతరెడ్డి, ఐటిడి సిమెంటేషన్ కంపెనీతో డీల్ కుదర్చిన ఆ కంపెనీ లీగల్ అడ్వైజర్, అడ్వకేట్ ఐ గోపాల్‌శర్మ, కంపెనీ ఎకౌంట్స్ విభాగం డిప్యూటీ మేనేజర్ కె సత్యనారాయణలను విజయవాడ ఎసిబి కోర్టులో హాజరు పరచగా, నిందితులకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఐటిడి కంపెనీ ప్రతినిధులు బస చేసిన హోటల్లోనూ ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మరో రూ.2.50 లక్షల నగదును గుర్తించారు. దీనితో స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.25.70 లక్షలకు పెరిగింది. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో పనులు దక్కించు కున్న బహుళ జాతి కంపెనీ ఐటిడి ప్రతినిధులపై లంచం కేసు నమోదవ్వడంతో కార్పొరేట్ వర్గాల్లో సంచలనం రేగింది.

వారిపై అంత ప్రేమెందుకు..? : రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ కొనుగోళ్లపై ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరోసారి తెలంగాణ సర్కారును ప్రశ్నించారు. లగడపాటి రాజగోపాల్, మైహోం రామేశ్వరరావు పట్లా ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అంత ప్రేమెందుకని ప్రశ్నించారు. వాళ్లకు సంబంధించిన సంస్థలతో ఒప్పందాలు చేసుకొని విద్యుత్ ఎందుకు కొనుగోలు చేశారని నిలదీశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్కువ ధరకే విద్యుత్ ఇస్తామని ఆంధ్రప్రదేశ్ నుంచి ఆహ్వానం వచ్చినా, ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం వెనుక అవినీతి దాగుందన్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్ల ద్వారా ప్రతిరోజు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్లలో అవినీతిపై చర్చకు వస్తామని చెప్పిన టిఆర్ఎస్ వారు రాలేదని ఎద్దేవా చేశారు. ఉద్దేశపూర్వకంగా జెన్‌కోలో ఉత్పత్తిని తగ్గించి, బయట ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. తద్వారా వినియోగదారులపై భారం వేస్తోందని తెలిపారు. ధర తగ్గించాలంటూ సర్కారుకు దక్షిణ మధ్య రైల్వే అధికారి లేఖ రాసిన సంగతిని ప్రస్తావించారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిని జైల్లో పెడతానం టున్న కెసిఆర్‌కు దమ్ముంటే.. తనను అరెస్ట్ చేయించాలని సవాల్ విసిరారు.

ప్రత్యేకం

భారీ చిట్టాతో కేంద్రానికి ప్రతిపాదనలు

- రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కేంద్ర బడ్జెట్‌పై 18న ఢిల్లీలో భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అప్పుల పాలైపోతున్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సాయం కోసం అర్రులు చాస్తోంది. రానున్న కేంద్ర బడ్జెట్‌లో వీలయినంత ఎక్కువ నిధులు రాబట్టుకోవాలని భావిస్తోంది. అందుకు భారీ ప్రతిపాదనలతో ఢిల్లీకి వెళ్లాలని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు యోచిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, ఆర్థిక సంఘం నిధులు, ద్రవ్య లోటు నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు అధికంగా కావాలంటూ కేంద్రాన్ని కోరనున్నారు. ఈ నెల 18వ తేదీన ఢిల్లీలో జరిగే ఆర్థిక మంత్రుల బడ్జెట్ కసరత్తులో తమ అవసరాలపై నివేదించాలని నిర్ణయించారు. బడ్జెట్‌లో వివిధ రాష్ట్రాలకు కావాల్సిన నిధుల అవసరాలపై చర్చించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి అధ్వర్యంలో ఈ కీలక భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఆహ్వానంతో రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు, కోర్కెల చిట్టాను సిద్ధం చేశారు.

రాజధాని నిర్మాణానికి..

రాజధాని నిర్మాణానికి తాజా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరుతున్నారు. రాజధానిలో అత్యవసర మౌలిక సౌకర్యాల కోసం రాజ్‌భవన్, సచివాలయం, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాలు, శాసనసభ, ఇతర నిర్మాణాలకు రూ. 3,500 కోట్లు ఇస్తామని చట్టంలోనే చెప్పిన కేంద్రం ఇప్పటివరకు రూ.2500 కోట్లు విడుదల చేసింది. మిగిలిన నిధులను ఈ బడ్జెట్‌లో ఇవ్వాలని రాష్ట్రం కోరుతోంది. అమరావతి నుంచి అన్ని ప్రాంతాలను రోడ్డు రవాణా సౌకర్యం కల్పించేం దుకు విశాఖ నుంచి అమరావతిని కలుపుతూ చెన్నై వరకు హై స్పీడ్ రైలు మార్గాన్ని నిర్మించేం దుకు, విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేం దుకు కూడా కేంద్రం హామీని చ్చిందని పేర్కొంటూ, అందుకుగాను 2018-19 బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని ప్రతిపాదనల్లో కోరారు.

ఆదాయ లోటు..

2014-15 మధ్య కాలంలో రూ.16 వేల కోట్లు ఆదాయ లోటు ఉందని, పిఆర్‌సి అమలులో భాగంగా ఉద్యోగుల పింఛన్ల కోసం మరో రూ. 5325 కోట్లు ఇవ్వాలని గతంలోనే కేంద్రాన్ని కోరారు. అయితే వివిధ పథకాలకు ఇచ్చే మొత్తం మినహాయించగా, కేవలం రూ. 4117 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వస్తుందని కేంద్రం చెబుతోంది. అయితే తరువాత రూ. 7500 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారు. అయితే దీనిని అంగీకరించని ప్రభుత్వం మిగిలిన రూ. 13 వేల కోట్లను ఒకే విడతగా విడుదల చేయాలని, లేనిపక్షంలో కేంద్రం చెబుతున్న మొత్తంలో ఇంకా రావాల్సిన రూ.3520 కోట్లనైనా బడ్జెట్‌లో పొందుపరచాలని రాష్ట్ర ఆర్థిక శాఖ కోరుతోంది.

పారిశ్రామికాభివృద్ధికి..

రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు గాను రాయితీలు, ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. దీనికోసం రూ. 1500 కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించాలని రాష్ట్రం డిమాండ్ చేస్తోంది. అమరావతిలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేకంగా సహాయం చేయాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా అమరావతి నగర ప్రాంతానికి వచ్చే అన్ని పరిశ్రమలకు వాటి ఉత్పత్తులపై పదేళ్లపాటు వంద శాతం ఎక్సయిజ్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలని, ఐదేళ్లపాటు వందశాతం ఆదాయపు పన్ను మినహాయింపులు, తదుపరి ఐదేళ్లపాటు 30 శాతం మినహాయింపును ఇవ్వాలని కోరుతోంది. ప్లాంట్, మిషనరీ వంటి వాటిపై 15 శాతం పెట్టుబడి వ్యయంపై సబ్సిడీ ఇవ్వాలని, దీనిని కూడా బడ్జెట్‌లో అధికారికంగా ప్రకటించాలని కోరుతున్నారు.

ప్రత్యేక ప్యాకేజీకి..

ప్రత్యేక ప్యాకేజి ప్రకటనలో భాగంగా 2015-16 నుంచి 2019-20 వరకు ఆర్థిక సహాయం పెంచాలని కోరుతున్నారు. ఇప్పటికే తొలి రెండేళ్లకు 2951, 2516 కోట్లు ఇచ్చారని, మిగిలిన మూడేళ్లకు కూడా అదే వృద్ధి సగటుతో వరుసగా 3238 కోట్లు, 3673 కోట్లు, 4166 కోట్లు ఇవ్వాలని కోరారు. జిఎస్‌డిపి ద్వారా తీసుకునే మూడు శాతం రుణ పరిమితిని మరో 0.5 శాతం పెంచాలని కోరారు. ఈ ప్రతిపాదనల్లోనే ఇతర మరికొన్ని అంశాలను కూడా ప్రస్తావించి, కేంద్రానికి నివేదిక ఇవ్వనున్నారు.

సంక్షిప్తం

సిఎం సహా ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు లోగిళ్లలో ఆనందం వెల్లివిరియాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ పండుగ చేసుకోవలన్న ఉద్దేశంతోనే 'చంద్రన్న సంక్రాంతి కానుక ' ను పంపిణీ చేశామని తెలిపారు. సాగు వ్యయాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు పండించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు, పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభృతులు కూడా సంక్రాంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

నారావారి పల్లెలో ముఖ్యమంత్రి

ప్రతి సంవత్సరం మాదిరే ఈ సారి కూడా సంక్రాంతి పండుగను ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం ఆయన స్వగ్రామమైన నారా వారి పల్లెలో జరుపుకోనున్నారు. శనివారం సాయంత్రమే ఆయన నారావారి పల్లె చేరుకున్నారు. 16న తిరిగి సిఎం అమరావతి చేరుకుంటారు.

శ్రీకాంత్ మృతికి ఎపిడబ్ల్యుజెఫ్, ఎన్ఎజె సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత గుర్రంకొండ శ్రీకాంత్ (78) మృతిపట్ల ఎపి వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (ఎపిడబ్ల్యుజెఎఫ్) ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్ఎజె) కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, కోశాధికారి కొండయ్య తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శ్రీకాంత్ మృతి జర్నలిజానికి తీరని లోటని, ఎంతోమందిని జర్నలిస్టులుగా ఆయన రూపుదిద్దారన్నారు. హైదరాబాద్ జర్నలిస్టుల యూనియన్ కార్యకలాపాలు, సమావేశాల్లో క్రమం తప్పకుండా పాల్గొనేవారన్నారు. కవిత్వం, నవల, జర్నలిజం రంగాల్లో కృషి చేయన ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరని ఆవేదన వ్యక్తం చేశారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా గతేడాది మార్చిలో విజయనగరం జిల్లాలో చేపట్టిన వంద గంటల్లో పదివేల మరుగుదొడ్ల నిర్మాణం కార్యక్రమానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటుదక్కింది. జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ నేతత్వంలో జిల్లా యంత్రాంగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవలం వంద గంటల్లోనే పదివేల మరుగుదొడ్లను నిర్మించి రికార్డు సష్టించారు. ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రజలతో ఆకాశవాణి ద్వారా నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించారు. 2018వ సంవత్సరానికి సంబంధించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ తాజా సంచికను జనవరి 8న విడుదల చేయగా అందులో విజయనగరం జిల్లాలో చేపట్టిన వినూత్న స్వచ్ఛ కార్యక్రమానికి చోటు కల్పించారు.



ఏలూరులో సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్నషార్ట్ ఫిల్మ్ పోటీలను శనివారం ప్రారంభిస్తున్న అంబికా కృష్ణ

హార్ట్ ఫిల్మ్‌లుగా అభివృద్ధి చెందిన షార్ట్‌ఫిల్మ్‌లు

ఎపి ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అంబికా కృష్ణ

ప్రజాశక్తి-ఏలూరు అర్బన్

'షార్ట్‌ఫిల్మ్‌లు హార్ట్ ఫిల్మ్‌లుగా అభివృద్ధి చెందాయి. వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది నుంచి షార్ట్‌ఫిల్మ్‌లకు నంది అవార్డులు ఇచ్చే ఆలోచన చేస్తాం' అని ఎపి ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అంబికా కృష్ణ ప్రకటించారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న షార్ట్‌ఫిల్మ్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంఘాలు యువతలోని నైపుణ్యాన్ని వెలికి తీసేలా షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచమంతా వేగంగా పరుగెడుతోందని, ఆ వేగానికి తగ్గట్టు ఇప్పుడు షార్ట్‌ఫిల్మ్‌లు వస్తున్నాయని చెప్పారు. రానున్న కాలంలో షార్ట్‌ఫిల్మ్‌లకు ప్రేక్షకుల ఆదరణ పెరుగుతుందన్నారు. ఒకప్పుడు నాటకాలకు క్రేజ్ ఉండేదని, తర్వాత సినిమాలు వచ్చాయని, అందులో బ్లాక్ అండ్ వైట్, కలర్, స్కోప్, 70 ఎంఎం ఇలా సినిమా రంగం అభివృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. రెండున్నర గంటల సినిమాలో చెప్పే సారాంశాన్ని 10, 15 నిమిషాల్లో చెప్పడమే షార్ట్ ఫిల్మ్ గొప్పతనమని పేర్కొన్నారు. షార్ట్‌ఫిల్మ్‌లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, వచ్చే ఏడాది నుంచి షార్ట్‌ఫిల్మ్‌లకు నంది అవార్డులు ఇచ్చే ఆలోచన చేస్తామని ప్రకటించారు. పోటీలకు కృషి చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాలను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలకు నిరంతరం ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

పన్నెండేళ్ల పరిహాసం

- 30 వేల ఎకరాల ఆయ'కట్'
- రూ.52 కోట్ల విడుదలకు నిరీక్షణ
- రెవెన్యూ, ఇరిగేషన్ మధ్య సమన్వయలేమి
- తెలుగుగంగ నిర్వాసితుల గోడు ఇదీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవితాలతో పరిహాసమాడుతోంది. 12 ఏళ్లుగా బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల పరిధిలో భూ నిర్వాసితులతో చెలగాటమాడుతోంది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, కాంట్రాక్టర్ మధ్య సమన్వయం కొరవడడంతోనే సమస్య తలెత్తింది. దీంతో 30 ఎకరాల ఆయకట్టుకు నీరందడం లేదు. కేవలం రూ.52.38 కోట్ల పరిహారం చెల్లింపులు చేయకుండా దశాబ్దాలుగా వేధింపులకు గురి చేయడమే కారణమని తెలుస్తోంది. 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాల్సిన పరిస్థితుల నేపథ్యంలో తాజాగా తెలుగుగంగ ఉన్నతాధికారులు మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దశాబ్దాల నిర్లక్ష్యం ఫలితంగా రూ.కోట్ల విలువైన రైతు ఆదాయాల్ని ప్రభుత్వాలు బలి తీసుకోవడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది.



బ్రిడ్జికి నోచని తెలుగుగంగ ఎడమ కాల్వ

నిర్వాసిత గ్రామాలివే...

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ పరిధిలో బ్రహ్మంగారి మఠం, బద్వేల్, కాశినాయన, కలసపాడు, గోపవరం, బి.కోడూరు అట్లూరు మండలాల్లో నిర్వాసిత గ్రామాలు ఉన్నాయి. ఎడమ కాల్వ పరిధిలోని పాలుగారిపల్లి, ముదామల, కాశినాయన మండలం సావిశెట్టిపల్లి, నరసాపురం, కత్తిరగండ్ల, కలసపాడు మండలంలోని కొండపేట, ఓబులాపురం, పెండ్లిమర్రి, మహానందిపల్లి, చింతలపల్లి, పోరుమామిళ్ల మండలంలోని దమ్మనపల్లి, రంగసముద్రం, కుడి కాల్వ పరిధిలో రాజుపాలెం వెంకటశెట్టిపల్లి, గొడుగు నూరు, కొండూరు, రెడ్డిపల్లి, అట్లూరు, కమలకూరు, కామసముద్రం, వేమలూరు, మోత్కూరు గ్రామాలు ఉన్నాయి.

రూ.52 కోట్ల విడుదలకు నిరీక్షణ

బ్రహ్మం సాగర్ కుడి, ఎడమ కాల్వలకు భూములు కోల్పోయిన రైతులు పరిహారం కోసం నిరీక్షిస్తున్నారు. 2005లో రైతులకు ఎకరాకు రూ.4.50 లక్షల చొప్పున 132 ఎకరాలకు మొత్తం రూ.52.38 కోట్లు పరిహారం చెల్లించాలి. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలంటే గత పరిహారానికి మూడు రెట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపత్యంలో పరిహారం మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోందనే ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు పరిహారం చెల్లింపుల అంశాన్ని మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ, ఆర్‌అండ్‌ఆర్ పరిశీలన శాఖల మధ్య అవగాహన లేకపోవడం వల్లే సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. నిర్వాసితుల్లో పట్టాలు మరొకరి పేర్లతో ఉండడం, డికెటి పట్టాదారులు ఉండడం వంటి కారణాలను సాకులుగా చూపిస్తోంది. 30 ఏళ్లకు ఒకసారి భూములను రీ సర్వే చేసి క్షేత్రస్థాయిలో తప్పిదాలను సరిదిద్దాల్సిన రెవెన్యూ శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. నిర్వాసితుల సమస్యల్ని పరిష్కరించాలి. నీటిపారుదల శాఖ పనులు వేగవంతం చేయాలని చెబితే కాంట్రాక్టర్ ఆర్‌అండ్‌ఆర్‌ను చెల్లిస్తే రైతుల నుంచి అడ్డంకులు ఉండవనే సాకుతో కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది.

30 వేల ఎకరాల ఆయ'కట్'

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ నిర్వాసితుల వెతలు తీరడం లేదు. 2004లో ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జలయజ్ఞంలో భాగంగా రూ.450 కోట్ల వ్యయంతో నిర్మాణ పనుల్ని చేపట్టారు. 2005లో ఐవిఆర్‌సిఎల్ ప్రసాద్ జాయింట్ వెంచర్ ఆధ్వర్యంలో ష్యూ కంపెనీ.. బ్రహ్మం సాగర్ కుడి, ఎడమ కాల్వల పనుల్ని చేపట్టింది. ప్యాకేజ్-1, 2 దశల కింద కాల్వల మట్టి పనుల్ని చేపట్టింది. కుడికాల్వ రిజర్వాయర్ నుంచి పోరుమామిళ్ల వరకు 52 కిలోమీటర్లు వ్యాపించి ఉంది. 35 కిలోమీటర్ల మేర కాల్వ పనుల్ని పూర్తి చేసింది. 17 కిలోమీటర్ల పనుల్ని నిలిపేసింది. ఎడమ కాల్వ 45 కిలోమీటర్లలో వ్యాపించి ఉంది. కుడికాల్వ పరిధిలో 25 వేల ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలో 10 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందడం లేదు.



సంక్రాంతి వచ్చినా ఇళ్లకు చేరని 'సిరులు'

పొలాల్లోనే వరి కుప్పలు - ధరల్లేక అల్లాడుతున్న రైతులు
కొనుగోలు కేంద్రాల్లో మొక్కుబడిగా కొనుగోళ్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి. గత ఖరీఫ్‌లో ఉత్పత్తయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తొలుత 43 కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రస్తుతం 10 మాత్రమే పని చేస్తున్నాయి. వీటి నుంచి ఇప్పటివరకూ కేవలం 6,017 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా ధాన్య సేకరణ అధికారి దివాకర్ తెలిపారు. ఈ మేరకు రైతులకు రూ.ఏడు కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. తూర్పు బాపట్ల, నగరం, బాపట్ల, భట్టిప్రోలు, చెరుకుపల్లి, కాకుమాను, బుద్ధాం, నిజాంపట్నం, రేపల్లె పెద్దగొల్లపల్లి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయి. రేషన్ సరఫరాకు పౌరసరఫరాల శాఖ మిల్లర్ల ద్వారా ధాన్యాన్ని బియ్యంగా మార్చుచేసి జిల్లాలకు సరఫరా చేస్తోంది. ఏడాదికి రేషన్ సరఫరా కోసం జిల్లాలో 2.24 లక్షల టన్నుల బియ్యం అవసరం కాగా ఇప్పటి వరకూ 6 వేల టన్నులే కొనుగోలు చేశారు. జిల్లా నుంచి మిల్లర్ల ద్వారా 1.50 లక్షల టన్నుల బియ్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా ఆ మేరకు కొనుగోలు చేయలేదు.

గత ఖరీఫ్‌లో జిల్లాలో 4.60 లక్షల ఎకరాల్లో ధాన్యం సాగవగా 10 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. మార్కెట్‌లో ఈ ఏడాది కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడం వల్ల కొనుగోలు కేంద్రాలకు ఎవ్వరూ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.1500 నుంచి రూ.1600 మధ్య కొనుగోలు చేస్తున్నారు. 'ఎ' గ్రేడు ధాన్యం కనీస మద్దతు ధర రూ.1590గా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. ఇళ్లలో వినియోగానికి, స్థానికంగా అత్యవసర అవసరాల కోసం 30 శాతం మంది ధాన్యం విక్రయించుకుంటున్నారు. భవిష్యత్తులో మంచి ధరలు వస్తాయనే భావనతో రైతులు పొలాల్లోనే ధాన్యం కుప్పలు వేసి ఉంచారు. ఇప్పటికీ 70 శాతం ధాన్యం పొల్లాల్లోనే కుప్పలు వేసి ఉంది. గుంటూరు నుంచి చీరాల వరకూ, మంగళగిరి నుంచి రేపల్లె వరకూ, పొన్నూరు నుంచి నగరం వరకూ ఎటు చూసినా పొలాల్లో వరి కుప్పలు కన్పిస్తున్నాయి. రెండో పంటగా మినుము, పెసర, మొక్కజొన్న సాగు చేశారు. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఈ ఏడాది క్వింటా రూ.1800 నుంచి రూ.2 వేలకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తేమ శాతం అధికంగా ఉందనే కారణంతో తిరస్కరించడం, ధరలు తగ్గించడం తదితర కారణాలతో రైతులు పొలాల్లోనే కుప్పలను ఉంచారు.

పాఠశాల ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందదాయకం

కేంద్ర మంత్రి అశోకగజపతిరాజు

ప్రజాశక్తి-ఉండి

స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ కాలంలో తన ముత్తాత నిర్మించిన పాఠశాల ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం దక్కడం చాలా ఆనందంగా ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి పి.అశోకగజపతిరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండిలోని జెడ్‌పి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉండి ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్కూల్లో ఎంతోమంది విద్యనభ్యసించి ఉన్నతస్థానాల్లో స్థిరపడటం గర్వకారణమని అన్నారు. గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా సంప్రదాయాలను పాటించి ఆనందంగా గడపాలని సూచించారు. అనంతరం ఏలూరు ఎంపీ మాగంటి బాబు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ సాగిరాజు సాంబరాజు, వైస్ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ఎటిఎంల చుట్టూ ప్రజలు

మందుల కోసం అప్పులు
ఇబ్బంది పడుతున్న రోగులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిది

గుంటూరు నగరంలోని ఎటిఎం సెంటర్లు నిత్యం నగదు డ్రా చేసుకునేవారితో, డిపాజిట్ చేసేవారితో కళకళలాడుతుండేవి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి నగదు లేక వెలవెలబోతున్నాయి. సంక్రాంతి పండుగ వేళ చేతిలో చిల్లిగవ్వ లేక నగర ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, లాడ్జిసెంటరు, అమరావతి రోడ్డు, కొత్తపేట, బస్టాండ్, రైల్వే స్టేషన్ తదిరత ప్రాంతాల్లో ఎటిఎం సెంటర్లు నగదు లేక మూతపడ్డాయి. వరుసగా నాలుగు రోజులు సెలవులు రావటంతో పరిస్థితి మరీ క్లిష్టంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వందలాదిగా ప్రయాణీకులు తరలివస్తున్నారు. చేతిలో ఎటిఎం కార్డులు పెట్టుకుని నగదు కోసం ప్రతి ఎటిఎం సెంటర్ల దగ్గరకు పరుగులు పెట్టారు. ఒక్కో ఎటిఎంలో కొంత నగదును పెట్టినా కొద్దిసేపటికే అయిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే ఎటిఎం సెంటర్లలో నగదు లభ్యం కాకా ఇతర ఎటిఎం సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం ఉండటం లేదు. ప్రైవేట్ బ్యాంకుల ఎటిఎం సెంటర్లలలో కూడా నగదుకు కటకటలాడాల్సి వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఎటిఎంల వద్ద క్యూలో నిలబడిన వారు ఉసూరు మంటూ వెనుదిరగాల్సి వచ్చింది. అత్యవసర వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన వారు బ్యాంక్ ఖాతాలో నగదు, చేతిలో ఎటిఎం కార్డులున్నా ఎటిఎం నుంచి నగదు రాకపోవటంతో వైద్యపరీక్షలను వాయిదా వేసుకోవటమే గాక మందులు కొనేందుకు తెలిసిన వారిని అప్పు అడగాల్సినపరిస్థితులు తలెత్తుతున్నాయి. ఆసుపత్రికి చెల్లించాల్సిన నగదు చేతిలో లేకపోవటంతో చాలమంది తమవారి కోసం ఎదురుచూస్తున్నారు. పెన్షన్‌దారులు పండుగకు నగదు డ్రా చేసేందుకు ఎటిఎం సెంటర్ల దగ్గరకు వెళ్లి నో క్యాష్ అని చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. పేటిఎంకు అలవాటుపడ్డవారు మాత్రం పేటిఎం ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగుండాలి

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-వెంకటాచలం

ప్రతి ఒక్కరూ సేవాభావం కల్గి సమాజసేవ కోసం ముందుకు రావాలని భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో కొంత సమయం సమాజ సేవకు, సంపాదనలో కొంత సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలన్నారు. తద్వారా దేశం బాగుపడుతుందన్నారు. దేశం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలని తెలిపారు. ఏమతం సారాంశమైన ఒక్కటే అదే మానవ సేవే మాదవ సేవ అన్నారు. తాను పది మందికి ఉపయోగపడే పనిచేయాలనే తపనతో కష్టపడి పని చేసే మనస్థత్వం ప్రతి ఒక్కరిలో ఉండలన్నారు. అబ్దుల్‌కలామ్ పేపర్ బాయ్ నుంచి శాస్త్రవేత్త, రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు. టీ అమ్మిన మోడీ ప్రధాని అయ్యారన్నారు. నేటి యువత మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.మన పూర్వికులు మంచి ఆలోచనతో మనకు నేర్పిన సంస్కృతి సంప్రదాయాలు, కళలను ప్రోత్సహించాలన్నారు. ప్రకృతిని మనం కాపాడితే మనలను పకృతి కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఆర్‌డిఒ హరిత, వైద్య బృందం ట్రస్టీ దీపావెంకట్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య

పర్యాటక కేంద్రంగా శిల్పారామం

మంత్రి కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా కేంద్రానికి మణిహారంగా ఉన్న శిల్పారామాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. శిల్పారామంలో రూ.40 లక్షల విలువతో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను శాసన మండలి విప్ మహమ్మద్ షఫీ, ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మేయర్ మదమంచి స్వరూపలతో కలిసి శనివారం ప్రారంభించారు. శిల్పారామంలోని పలు ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. అక్కడే కళ్యాణ మండపంలో మహిళలు వేసిన సంక్రాంతి ముగ్గులను వీక్షించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ శిల్పారామం జిల్లా వాసులకు మంచి ఆహ్లాదాన్ని పంచే ప్రదేశమని అన్నారు. పండుగలు, ఆనంద సమయాల్లో ఇక్కడ గడిపేందుకు వీలుగా మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. శిల్పారామం నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కృషి అమోఘమన్నారు.



అనంతపురం శిల్పారామంలో బోటింగ్ చేస్తున్న మంత్రి కాలవ, ఎమ్మెల్యే ప్రభాకర్

డ్రగ్స్ ముఠా అరెస్టు

నిందితులంతా కడప, అనంతపురం జిల్లాల వారే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కడప నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కడప, అనంతరపురం జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. నిందితుల నుంచి రూ. 20 లక్షలు విలువ చేసే కిలో జిహెచ్‌బి డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన దాసరి బాబు డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడని శంషాబాద్ డిసిపి పద్మజ వెల్లడించారు. దాసరి బాబుపై గతంలో తాడిపత్రిలో ఓ వర్గంపై బాంబులు వేసిన కేసు, కడపలో ఎర్ర చందనం స్మగ్లింగ్, రద్దయిన నోట్ల చెలామణి, దొంగతనం కేసులు ఉన్నాయని ఆమె చెప్పారు. నిందితుడు ఎక్కువగా కడప నుంచి ఈ మాదకద్రవ్యాలను బెంగళూరుకు సరఫరా చేసే వాడని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కొన్ని క్లబ్‌లకు మాదక ద్రవ్యాలను సరఫరా చేయడానికి యత్నిస్తుంటే పక్కా సమాచారంతో అరెస్టు చేశామని డిసిపి తెలిపారు. వీరి వెనుక ఎవరున్నారనే దానిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు.

ప్రత్యేకం

పండుగ వేళ స్కీం వర్కర్ల పస్తులు

ఏడాదిగా అందని వేతనాలు, టిఎ, డిఎలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సంక్రాంతి అంటే అందరికీ సంబరాల పండుగ. రైతులు, వృత్తిదారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా ప్రతి కుటుంబం బంధుమిత్రులతో సంతోషంగా గడిపే పండుగ. ప్రభుత్వ పథకాలలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేసే స్కీం వర్కర్లు మాత్రం పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలే వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం ఆ ఇచ్చే కొద్దిపాటి కూడా నేటికీ ఇవ్వలేదు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ఆశా, అంగన్‌వాడీలు, కంటెజెన్సీ నిధులతో పనిచేసే వర్కర్లకు వేతనాలను ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గౌరవ వేతనాలకు కూడా నోచని ఆశావర్కర్లకు ఏడాది కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. నెలకు ఒక్కో ఆశావర్కర్‌కు కేవలం రూ.2 నుంచి 3 వేలు మాత్రమే వస్తుంది. వీటితోపాటు వారికి యూనిఫామ్ అలవెన్సు, ప్రభుత్వ పనులపై సర్వేలు చేస్తే అదనంగా కొంత మొత్తం మాత్రమే వస్తుంది. 2012 నుంచి యూనిఫామ్ అలవెన్సు ఇవ్వలేదు. సరికదా.. ప్రభుత్వం రోజుకు రూ.75 లు ఇస్తామని నెల రోజుల పాటు కుష్టువ్యాధిగ్రస్తుల సర్వేను చేయించింది. ఆశావర్కర్లతో ఇన్ని పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం ఇప్పటిదాకా వేతన బకాయిలు ఇవ్వలేదు. అంగన్‌వాడీలదీ అదే పరిస్థితి. అంగన్‌వాడీలకు ఏడాది కాలంగా టిఎ, డిఎ బకాయిలు, మూడు నెలల వేతన బకాయిలు రావాల్సిం ఉంది. వీటితోపాటు అంగన్‌వాడీల భవనాల అద్దెలు ఏడాది కాలంగా రావాలి. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో అంగన్‌వాడీలతో వెట్టిచాకిరి చేయిస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల కేవలం అంగన్‌వాడీల నెలసరి వేతనం రూ.7 వేలు కాగా ప్రభుత్వం కంటితుడుపు చర్యగా మూడు రోజుల క్రితం రూ.4,500 వేసి చేతులు దులుపుకుంది. టిఎ, డిఎలు వేతనాలు, అంగన్‌వాడీ భవనాల అద్దెలు, గ్యాస్ బిల్లులు కలిపి ఒక్కో అంగన్‌వాడికి కనీసంగా రూ.30 నుంచి 50 వేల దాకా బకాయిలు రావాల్సి ఉండగా ప్రభుత్వ రూ.4,500 మాత్రమే ఇచ్చింది. కాంట్రాక్టు , అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులది కూడా అదే పరిస్థితి వారికి కూడా 4,5 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. కనీసం పండుగ సమయాల్లో అయినా వేతనాలు పడితే కుటుంబంతో సంతోషంగా గడిపే వారమని అంటున్నారు.

ఏడాది కాలంగా వేతనం అందడం లేదు



ప్రభుత్వ కార్యాలయంలో కంటెజెంటి నిధుల కింద స్వీపర్‌గా పనిచేస్తున్నా. ఇచ్చేది మూడు వేల రూపాయలైనా అది నెల నెల ఇవ్వని పరిస్థితి ఉంది. ఏడాది కాలంగా మాకు బకాయి రావాల్సి ఉంది.

\- మద్దమ్మ

బకాయిలు చెల్లించాలి

కనీసం వేతనం కాదు కదా గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదు. నెలంతా కష్టపడితే మాకు వచ్చేది వెయ్యి, రెండువేల రూపాయలు మాత్రమే. అదికూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతూనే పనిచేస్తున్నాయిం. తక్షణం ఆశావర్కర్లకు రావాల్సిన బకాయిలన్ని చెల్లించాలి.

\-ఆశా వర్కర్ రమీజాబి

సంక్షిప్తం

సంప్రదాయాలను మరిచిపోతున్నారు: భువనేశ్వరి

తిరుపతి :కొంతమంది మన సంప్రదాయాలను మరిచిపోతున్నారు. మన పండుగల గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నారా భువనేశ్వరి అన్నారు. నారావారి పల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలన్నారు. సొంత గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ చేసుకుంటే ఆ ఆనందం మాటల్లో చెప్పలేనిదని గత స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు.

కర్నూలు కృష్ణానగర్లో భారీ చోరీ

కర్నూలు క్రైం : కర్నూలులోని కృష్ణా నగర్లో రవీంద్ర స్కూల్ వెనుక వైపు రైల్వే ట్రాక్ ఎదురుగా ఉన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దాచి ఉంచిన నగదును దోచుకెళ్లారని బాధితురాలు శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నెల్లూరుకు వెళ్లడంతో ఘటన జరిగిందన్నారు. ఉదయం పక్కింటి వారు గుర్తించడంతో చోరీ వ్యవహారం బయటపడిందని తెలిపారు. ఈ మేరకు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శృంగవరపుకోట : విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం అమ్మపాలెంలో మంగమ్మ అనే యువతి చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోంది. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రియుని చేతిలో ప్రియురాలు హత్య

కావలి : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడి చేతిలో ప్రియురాలు హత్యకు గురైంది. కావలి రూరల్ మండలం ఆనిమడుగులో ఈ సంఘటన జరిగింది. సుబ్బారావు అనే వ్యక్తి తన ప్రియురాలిని హత్య చేశాడు. అనంతరం పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సంపాదకీయం

సం"క్రాంతి"

ప్రతి ఇల్లూ పచ్చని తోరణమై, వీధి వీధీ జన సందోహమై, ప్రతి హృదయం ఆనందాల హరివిల్లై... ఒకచోట చేరి సంతోషాల్ని కలబోసుకుని సంబరం చేసుకునే ఉత్సవం- సంక్రాంతి. సంక్రాంతి అంటే... సందళ్ల పుట్ట. సరదాల గుట్ట. జ్ఞాపకాల తుట్టె. పుష్యమి చలి పక్క దుప్పటి తీయనీదు. నిద్ర బద్ధకం కళ్ళు తెరవనీయదు. అయినా... 'బంతి పూవులు లేత నవ్వులతో సంక్రాంతి సుందరి సాగి వచ్చింది/ తెలుగు పల్లెలు నిద్రలేచాయి వెలుగులో కనువిచ్చి చూచాయి సంక్రాంతి వేళ'- అని దాశరథి పులకించి పాడిన చందంగా ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులతో స్వాగతం పలుకుతాం. 'సంక్రాంతి వచ్చిందే తుమ్మెద/ సరదాలు తెచ్చిందే తుమ్మెద/ కొత్త ధాన్యాలతో కోడి పందాలతో/ ఊరే ఉప్పొంగుతుంటే / ఇంటింటా పేరంటం ఊరంతా ఉల్లాసం' అని సరదా చేస్తాడో సినీకవి. అందుకే అంటారు సినారే... 'తెలుగువాకిళ్ల నేదెస విలోకించినను/ కలయంపిజల్లు కన్నెలు కానుపించేరు/ సిగలలో బంతులను చేమంతులను నిల్పి/ జలతారుటంచు వల్వలు సొగసుగా దాల్చిబీ/ నెలతలీ సంక్రాంతి తెలుగుపండుగ నాడు/ నడయాడు గొబ్బిదేవతలె యనిపించేరు' అని. అంతేకాదు... గొబ్బిపాటల కోలాహలము... కోడిపుంజుల ఘోరావేశము... గంగెద్దుల మెడగంటల నాదము... బాలబాలికల ప్రగాఢమోదము... తెలుగుటూళ్లలో ప్రతిఫలించెను' అంటారు. సంక్రాంతి అంటే భోగిమంటలు, పాడిపంటలు, పిండివంటలు మాత్రమే కాదు... రంగురంగుల ముగ్గులతో, పువ్వులు అలంకరించిన గొబ్బెమ్మలతో, హరిదాసు పాటలు, గంగిరెద్దుల ఆటలు, పతంగాల రెపరెపలు, కోడిపెందేలు, కోలాటాలు, పిల్లల కేరింతలు, బంధుమిత్రుల పరామర్శలతో గ్రామీణ్యమౌతుంది పంచరంగుల హరివిల్లు. ఎన్ని రకాలుగా ఎంత వేడుకగా జరుపుకున్నా... సంక్రాంతి కర్షకుల పండగ. ఆరుగాలం కష్టించిన ఫలితాన్ని నట్టింట నింపుకునే పండుగ. ఈ పంటల పండుగను దేశంలోని అనేకచోట్ల అనేక పేర్లతో, ప్రాంతాల వారీగా విభిన్నమైన రీతుల్లో వైవిధ్యభరితంగా జరుపుకుంటారు.

ఏ జాతికైనా సంస్కృతిని ప్రతిబింబించేవి పండుగలే. ఈ పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. తెలుగునాట సంక్రాంతిని ముఖ్యమైన పండుగగా చెప్పుకోవచ్చు. సంక్రాంతి పుష్యమాసంలో వచ్చే పండుగ. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారు. ఆ రోజునుంచి ఉత్తరాయణం ప్రారంభమౌతుంది. అంటే సూర్యుని ప్రయాణం ఉత్తరదిశగా సాగుతుంది. ఆంగ్ల సంవత్సరం ప్రకారం వచ్చే మొదటి పెద్ద పండుగ ఇది. తెలుగునాట సంక్రాంతి, తమిళనాడులో పొంగల్, కేరళలో 'ఓణం' ఇటువంటి పండుగే. కన్నడ, మరాఠీ ప్రజలు కూడా ఈ పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఇది పంటల పండుగ. పంట రైతు ఇంటికి చేరి ప్రతి ఇల్లు ధాన్యలక్ష్మితో కళకళలాడే సమయం ఇది. మొదటిరోజు భోగి, రెండవ రోజున సంక్రాంతి, మూడవ రోజున కనుమ పండుగ. ఈ మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ఎంతో వైభవం సంతరించుకుంటుంది. 'పసుపు కుంకుమలతో అలంకరించిన బసవన్నలను ప్రీతితో/ తమ గుండెల్లో దాచుకుంటారు రైతులు/ చిటికెల మీద తీరిపోతున్న నోటు పద్దులు చించేసి/ కొత్త ఊపిరి పీల్చుకుంటారు రైతులు' అంటాడు కుందుర్తి. అయితే కుందుర్తి చెప్పినట్టుగా రైతులు నోటు పద్దులు చించేసి ఊపిరి పీల్చుకునే పరిస్థితి నేడు లేదు.

ఏయేటికాయేడు గతవైభవం నిట్టూర్పుగా మిగులుతోంది. ఆధునిక జీవనాన్ని అలవాటు చేస్తోన్న పట్టణీకరణ... కార్పొరేటీకరణ దెబ్బకు పల్లెలు, అచ్చ తెలుగు సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. సంక్రాంతి అంటే జూదం, తాగుడు, కోడిపందేలే అన్నట్టుగా ప్రజాప్రతినిధులే దగ్గరుండి నిర్వహించడమనే సంస్కృతి ప్రబలింది. దానికి తోడు గోసంరక్షణ పేరిట మతోన్మాదుల దాడులూ రైతుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. కార్పొరేట్ సంస్కృతి, వినిమయ సంస్కృతి పండుగలను వికృత మార్గం పట్టిస్తున్నాయి. 'నిరుపేదవాడు సంక్రాంతినాడు మహారాజు' అన్నాడు దాశరథి. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆ ఒక్కనాడూ కడుపు నిండక కరువు కోరల్లో మగ్గుతున్నాడు. అప్పుల్లోకి నెట్టేస్తున్న వ్యవసాయం రైతును మరింత దివాళా తీయించడంతో... చెట్టుకొమ్మకో, పురుగుమందుకో తమ జీవితాన్ని బలి చేసుకొంటున్నాడు. దాశరథి కృష్ణమాచార్య చెప్పినట్టుగా 'సంక్రాంతిలోని క్రాంతి/ సమతా వాది కవికి సంభ్రాంతి/ ఈ క్రాంతి పల్లెలో, పట్నంలో/ ఎల్ల యెడల పంటలా పండాలి'.



ఇస్రో మకుటంలో
మరో కలికితురాయి...
సి-40 సంధించుట
భారత్ కొక మైలురాయి!

ప్రపంచాన్ని తలదన్నే
మేధ మనకు సొంతం...
శత గ్రహ ప్రయోగంతో
గగనం పై సంతకం!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

ప్యాకేజి పాచిక పరిసమాప్తం?


తెలకపల్లి రవి

సుదీర్ఘ విరామం తర్వాత ప్రధాని మోడీతో భేటీకి అవకాశం దొరికిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ చర్చల తర్వాత చేసిన వ్యాఖ్యలలో ఆశాభావాలు తప్ప ఆధార సహితమైన నిర్దిష్ట సూచనలేమీ లేవు. విగ్రహం ముందు ప్రార్థనలా వినతి పత్రాలు ఇచ్చి రావడమే గాని ప్రధాని లేదా ఆయన కార్యాలయం తరపున ఇదమిద్ధంగా ఫలానా అంశాలు ఒప్పుకున్నామని చెప్పిందీ లేదు. పరిశీలిస్తామనీ, సంబంధిత మంత్రులతో చర్చిస్తామనీ చెప్పడం పరిపాటిగా మారింది. ఎపి ఎంపిలతో మాట్లాడే సందర్భంలో ప్రధాని హామీల అమలుపై అడిగితే 'జస్ట్ మూడున్నరేళ్లు మాత్రమే కదా' అయిందని అన్నారని వారికి అనుకూలమైనవిగా పేరున్న మీడియా సంస్థలే వెల్లడించాయి. ఇదంతా కూడా కేంద్రం ఉపేక్షకూ అలక్ష్యానికి అద్దం పడుతుంది. అత్యుత్సాహంతో కేంద్రానికి ముందస్తు కృతజ్ఞతల తీర్మానం ఆమోదించి, అప్పటి మంత్రి వెంకయ్య నాయుడుకు సన్మానాలు చేసిన ప్రభుత్వానికి కూడా ఇది పరాభవమే. విభజన సమయంలో స్వయంగా ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించిన, ఎన్నికల ప్రణాళికలో బిజెపి హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా వంటి వాటిపై పట్టు పట్టే బదులు రకరకాల సన్నాయి నొక్కులతో సమర్థనలకు పాకులాడిన ముఖ్యమంత్రి ఆలస్యంగానైనా అసలు నిజాలు అంగీకరించాల్సి వచ్చింది. అయితే ఇప్పటికైనా ఈ పరిస్థితి ఆగ్రహాన్ని కాకపోయినా ఆవేదననైనా వెళ్లగక్కలేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అలా చేస్తే ఢిల్లీ పెద్దలకు కోపం వస్తుందని తుమ్మితే వూడే ముక్కులా తమ బంధం తెగిపోతుందని ఆయన ఆందోళన పడటం విపరీతం.

విభజన చట్టం హామీలను అమలు జరపకపోగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టిపోయడంతో కేంద్ర రాష్ట్ర నేతలు చాలా కాలం గడిపారు. ప్రత్యేక హోదాతో ఒరిగేది లేదని మరికొంత కాలం వెళ్లబుచ్చారు. వామపక్షాలు వైసీపీ ప్రత్యేక హోదా సాధన సమితి వంటివి ఈ విషయమై ఉద్యమిస్తే వారిపైన ఎదురు దాడి చేశారు. తాము ఎంతో కష్టపడి రాష్ట్రానికి కావలసిన ప్రయోజనాలు సాధిస్తుంటే ప్రతికూల మనస్తత్వంతో అడ్డుపడుతున్నారని ఆడిపోసుకున్నారు. అయినా ప్రజల మనసులలో బలంగా పాతుకు పోయిన ప్రత్యేక హోదా హామీపై కబుర్లతో కాలం గడవదని గ్రహించి ప్యాకేజీ నాటకానికి తెర లేపారు. పరువు కాపాడుకోవడం కోసం వెంకయ్య నాయుడు వెంటపడితే ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అయిష్టంగా అరకొరగా ప్యాకేజీ ప్రకటించారు. ప్రత్యేక హోదా వల్ల వచ్చే ప్రయోజనాలను నగదుగా లెక్క కట్టి జమ చేయడం అందులో ముఖ్యమైంది. పరిశ్రమలూ వ్యాపారాల పెట్టుబడులు వచ్చినపుడు ఇచ్చే రాయితీని ముందస్తుగా లెక్క కట్టడం కుదిరే పని కాదు గనక దీనివల్ల వచ్చేది శూన్యమని కూడా అప్పుడే చెప్పుకున్నాం. ఇక రాష్ట్రానికి నిధులు అదనంగా ఇవ్వడానికి 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోలేదనే అసత్యంతో విదేశీ రుణాల ద్వారా భర్తీ చేసుకోవాలని వాటిని తాము చెల్లిస్తామని మరో చిట్కా ప్రకటించారు.ఇదే ఇఎపి పథకం. పోలవరంకు జాతీయ ప్రాజెక్టుగా ఇచ్చే 90 శాతం ఖర్చు భరించడం గాక 100 శాతం భరిస్తామంటూ మరో వాగ్దానం చేశారు. ఇదొక్కటే మనకు చాలన్నట్టు ఆ రోజుల్లో టిడిపి నేతలు చెలరేగిపోయారు.

ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి ప్రధానిని కలవడానికి ముందు అరుణ్‌జైట్లీకి రాసిన లేఖలో చెప్పిందేమిటి? ప్రత్యేక ప్యాకేజీ ప్రకారం 2015 నుంచి 2020 వరకూ ఎపికి 16,447 కోట్లు రావాలి.విదేశీ అప్పుల పద్ధతిలో ఈ మొత్తం వాడుకోవడానికి వీలు కాదుగనక నాబార్డు ఇప్పించాలి. 2020 తర్వాత ఈ ఏర్పాటు వుండదు. కేంద్ర పథకాల వాటాను 90:10 నిష్పత్తిలో చెల్లించేట్టయితే 2015-16కు రూ. 2951 కోట్లు రావలసి వుంటే రూ. 2516గానే చూపించారు. తదుపరి ఏడాదికి రూ. 2854 కోట్లు, 2017-18కి రూ. 3238 కోట్లు రావాలి. ఆర్థిక లోటుకు సంబంధించి కేంద్రం ఇంత వరకూ రాష్ట్రంతో చర్చించి లెక్క తేల్చలేదు. కేంద్రం తనే వేసిన లెక్క ప్రకారం చూసినా ఈ అయిదేళ్ల కాలానికి రూ. 16,447 కోట్లు ఇవ్వాల్సి వుంది. దాన్ని తొమ్మిది వేలకు తగ్గించారు. తీరా ఇచ్చింది రావాల్సిన దానితో కలసి కూడా రూ. 3 వేల కోట్ల పైచిలుకు మాత్రమే. కనీసం మరో రూ. 4 వేల కోట్లయినా ఇవ్వాలని అడుగుతుంటే రూ. 138 కోట్లకు మించి పైసా ఇచ్చేది లేదని కేంద్ర పాలకులు మొండికేశారు. షెడ్యూలు 13లో 11 సంస్థలుంటే తొమ్మిది మాత్రమే ప్రారంభించారు. వాటికి రూ. 11 వేల కోట్లు నిధులు అవసరం కాగా కేవలం రూ. 400 కోట్ల పైచిలుకు మాత్రమే విదిలించారు. కాగా కీలకమైన దుగ్గరాజుపట్నం రేవు, కడప ఉక్కు కర్మాగారం ఇంకా పరిశీలనకే నోచుకోలేదు. విశాఖ రైల్వే జోన్ పగటి కలగానే వుంది.

పోలవరం విషయానికి వస్తే రాష్ట్రం రూ. 12 వేల కోట్లు ఖర్చు చేయగా కేంద్రం కేవలం రూ. 4300 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. అంటే ఇంకా రూ. 7780 కోట్లు రావాలి. వాస్తవానికి చంద్రబాబు ప్రస్తుత పర్యటనకు మూల కారణం ఈ విషయమై ఉభయుల సయోధ్యేనని అర్థమవుతుంది. ప్రస్తుత టెండరు దారు ట్రాన్స్‌ట్రాయ్ సరిగ్గా పని చేయడం లేదు గనక కొన్ని పనులు ఇతరులకు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే ఆ దశలోనే కేంద్రం అభ్యంతరాలు చెప్పింది. కాఫర్ డ్యాం పైనా విభేదాలు వచ్చాయి. ఇక లక్ష కుటుంబాలకు పైగా తరలించడం కోసం అవసరమైన సహాయ పునరావస నిధులు ఇవ్వడానికి కేంద్రం మొండి చెయ్యి చూపిస్తున్నది. భూ సేకరణ వ్యయం,



అఖిలపక్ష సమావేశానికి అందరినీ తీసుకుని ఢిల్లీ వెళ్లి ఒత్తిడి పెంచడానికి చంద్రబాబు సిద్ధం కాకపోవడం విచిత్రం. మీడియా గోష్టిలో ఆయన కాంగ్రెస్‌పైన, వైసీపీ నేత జగన్‌పైన తీవ్రమైన పదాలతో ఎదురుదాడి చేశారు గాని నిజంగా నూతన రాష్ట్ర దురవస్తకు ప్రధాన కారణమైన కేంద్రాన్ని పల్లెత్తు మాటనలేదు... వైసీపీ నేతలు కూడా తెలుగుదేశం వైఫల్యాలనే చెబుతుంటారు తప్ప కేంద్రంపై పోరాడరు... ఈ విధంగా అధికార ప్రతిపక్షాలు రాష్ట్రం పట్ల విశ్వాస ఘాతుకానికి పాల్పడిన బిజెపి చెలిమి కోసం వెంపర్లాడటాన్ని ప్రజలు హర్షించరు.

పునరావాసం కలిపి అదనంగా రూ. 16 వేల కోట్లకు పైగా కావాలని చంద్రబాబు కోరికే గాని మోడీ ఒప్పుకునే పరిస్థితి లేదు. ప్రాజెక్టులకు ఎవరెవరో అడ్డుపడ్డారని గగ్గోలు పెట్టే చంద్రబాబు ప్రభుత్వం కేంద్రమే కాలడ్డం పెడుతున్న పరిస్థితిని ఎందుకు ప్రస్తావించదు? తమకు నచ్చిన వారికి టెండర్లు ఇచ్చుకునే అవకాశం రావడంతో వారి ఆందోళన తొలగిపోయింది! ఉభయుల మధ్య అక్కడ ముంపు ప్రాంతాల ప్రజలు గ్రామాలూ ఉనికి కోసం అల్లాడుతున్నాయి.

ఈ సందర్భంగా చంద్రబాబు విభజన సమయంలో అన్యాయాల గురించి, అశాస్త్రీయత గురించి పదేపదే వల్లెవేయడం వల్ల ఉపయోగం పూజ్యం. విభజన ఒక చారిత్రిక వాస్తవం. విభజన తర్వాత ఉభయ రాష్ట్రాల మధ్య సమస్యలు ఎందుకు కొనసాగుతున్నాయి? యజ్ఞయాగాలు రాజకీయ రాయబారాలు జరుపుకొంటూనే నిజమైన సమస్యల పరిష్కారం ఎందుకు దాటవేస్తున్నారు? తను తండ్రిలాటివాడినని చెప్పుకునే గవర్నర్ నరసింహన్ కేంద్రానికి సమస్యలు లేవని చెప్పి వచ్చిన దాంట్లో నిజం లేదని చంద్రబాబు మాటలతో తేలిపోయింది. మరి ఎందుకు మోడీ ఆ విషయంలో బాధ్యత నెరవేర్చడం లేదు? ప్రాంతీయ విభేదాలు పచ్చిగా వుండాలని కోరుకుంటున్నారా?

దక్షిణాదిలోనే ఆర్థికంగా ఎపి ఆఖరున వుందని ఒప్పుకున్న చంద్రబాబు సర్వీసు రంగం ఆదాయం పరిమితం కావడం గురించీ చెప్పారు. హైదరాబాదులో రిజిస్టర్ కార్యాలయాలు వున్నా ఎపిలో పని చేసే సంస్థల ఆదాయాలు తమకే చెందేలా ఏవైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఎపికి ఢిల్లీని మించిన రాజధాని వచ్చేలా తాను బాధ్యత తీసుకుంటానన్న మోడీ అమరావతి నిర్మాణానికి ఇప్పటికి ఇచ్చింది రూ. 2000 కోట్లు మాత్రమే. గుంటూరు, విజయవాడ నిధులు కూడా దానికి కలిపి రూ. 4000 కోట్లు అంటున్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు వస్తాయని ఆశ పెడుతున్నా అవి ఎఫ్‌డిఐల రూపంలోనే వస్తాయని గుర్తు పెట్టుకోవాలి. సింగపూర్ ఇంతవరకూ పైసా తీసుకొచ్చింది లేదు. భారీ భాగస్వామ్య సదస్సులు లక్ష్య సాధనలో విఫలమవుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ సమస్యలు కాగా ప్రజల దైనందిన జీవితంలో సవాళ్లు, ఉపాధి కోత వంటివి మరింత ఎక్కువగా వున్నాయి. దేశమంతటా ఉద్యోగాలు పడిపోయిన పూర్వ రంగంలో ఈ విభజిత పరిశ్రమా రహిత వ్యవసాయిక రాష్ట్రం ఎలా వుంటుందో వూహించవలసిందే. తమ సమర్థ పాలన వల్లనే ఎపి వెలుగొందుతున్నట్టు చంద్రబాబు చేసుకునే ప్రచారం నిజం కాదని ఈ వివరాలను బట్టి తెలుస్తుంది.

ఇలాంటి పరిస్థితుల్లో కూడా అఖిలపక్ష సమావేశానికి అందరినీ తీసుకుని ఢిల్లీ వెళ్లి ఒత్తిడి పెంచడానికి చంద్రబాబు సిద్ధం కాకపోవడం విచిత్రం. మీడియా గోష్టిలో ఆయన కాంగ్రెస్‌పైన, వైసీపీ నేత జగన్‌పైన తీవ్రమైన పదాలతో ఎదురుదాడి చేశారు గాని నిజంగా నూతన రాష్ట్ర దురవస్తకు ప్రధాన కారణమైన కేంద్రాన్ని పల్లెత్తు మాటనలేదు. పైగా బిజెపితో సంబంధాల గురించి అడిగిన ప్రతిసారీ తాను రాజకీయాలు మాట్లాడుకోవాలనుకోలేదని అభివృద్ధి ముఖ్యమని దాటేశారు. కేంద్ర రాష్ట్రాలలో తాము కలిసే పాలన చేస్తున్న సంగతి నొక్కి చెబుతూ తనకూ ఇరుపక్కల మంత్రులున్నారని వ్యాఖ్యానించడం ద్వారా తమ బంధం దృఢమైందని చెప్పేశారన్నమాట. వైసీపీ నేతలు కూడా తెలుగుదేశం వైఫల్యాలనే చెబుతుంటారు తప్ప కేంద్రంపై పోరాడరు. బిజెపి తమ పట్ల సానుకూలంగా వుందని చూపించుకోవడానికి ఆ పార్టీ ఎంపి విజయసాయి రెడ్డి వంటివారు పదే పదే వెళ్లి కలుస్తుంటారు. ఈ విధంగా అధికార ప్రతిపక్షాలు రాష్ట్రం పట్ల విశ్వాస ఘాతుకానికి పాల్పడిన బిజెపి చెలిమి కోసం వెంపర్లాడటాన్ని ప్రజలు హర్షించరు. సమయం చూసి ఎవరికి చెప్పాల్సిన పాఠం వారికి చెబుతారు.

సోషల్ మీడియా

అసమానత



ధనిక-పేద అసమానతల్ని తగ్గించిన చైనా, పెంచిన భారత్

చైనా : విద్య, వైద్యం మౌలిక వసతులపై పెట్టుబడులతో అసమానత తగ్గింది.
భారత్ : సర్వం ప్రయివేటీకరణకు, స్వేచ్ఛ వాణిజ్యానికి తలుపులు తెరవడం ద్వారా అసమానత పెరిగింది.
ప్రపంచ అసమానత 2018 నివేదిక వెల్లడి.

పట్టుకునేదెవరిని?

దావూద్ బాంబ్ బ్లాస్ట్ చేసి పారిపోయాడు
మాల్యా బ్యాంకులకు రూ.9000 కోట్లు అప్ప పెట్టి పారిపోయాడు




మరి మన పోలీసులు పట్టుకునేది ఎవరిని?
హెల్మెట్ లేకుండా బండి నడిపేవారిని!!

పారదర్శకత




రాజధాని మాస్టర్ ప్లాన్, భూములిచ్చిన రైతుల విషయంలో..
రైతు, డ్వాక్రా, మహిళల రుణమాఫీ విషయంలో..
బాబు వస్తే జాబొస్తుందన్న విషయంలో..
కాపు కార్పొరేషన్, రిజర్వేషన్ విషయంలో..
చంద్రబాబు పాలనలో...
పారదర్శకత ఉందా!!??
మీకు ఎక్కడైనా కనిపిస్తుందా!!??

రాజకీయాలు



విద్యావ్యవస్థ



'పుట్టిన ప్రతి వ్యక్తీ తెలివైనవాడే, కానీ ఒక చేప సామర్థ్యం చెట్టు ఎక్కడంలో ఉందని పరీక్ష పెడితే అది జీవితాంతం తనను తాను పనికి మాలినదాన్నే అనుకుంటుంది.'

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

జన వాక్యం

థియేటర్ల బాదుడు

పండగ రోజుల్లో సినిమా థియేటర్లు జనాలతో కిక్కిరిసిపోతాయి. అయితే థియేటర్ల యాజమాన్యాలు ప్రేక్షకులకు తగిన వసతులు కల్పించకపోగా టికెట్టు ధర నుండి సైకిలు పార్కింగ్ వరకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, పరిశుభ్రత పాటించరు. తినుబండారాలు ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు అమ్ముతున్నారు. అలా అమ్మకూడదని సుప్రీం కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చినా యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. అందుకే అధికారులు థియేటర్ల టికెట్టు కౌంటర్ల వద్ద రేట్ల బోర్డులు పెట్టించాలి. హోటల్ మాల్స్ వద్ద ధర పట్టిక పెట్టించాలి. హాలులో పరిశుభ్రత పాటించే విధంగా యాజమాన్యాలకు సూచనలు ఇవ్వాలి. ఇవి పాటించని వారిపై తగు చర్యలు తీసుకోవాలి.

ఈగల త్రిమూర్తులు, మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధి, తూర్పుగోదావరి జిల్లా.

క్లాస్ 4 ఉద్యోగులకూ వర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సు 58 నుండి 60 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం విదితమే. అయితే ఈ పెంపు క్లాస్-4 ఉద్యోగులకు వర్తించదు. ఎందుకంటే మొదటి నుండి నాల్గవ తరగతి ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సు పరిమితి 60 ఏళ్లు వుండేది. అంటే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వీరికి కూడా రిటైర్‌మెంట్ వయస్సు 60 నుండి 62 ఏళ్లకు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం దీనిపై హామీ ఇచ్చినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. అందుకే ఉద్యోగ సంఘాల నాయకులు, ఎన్జీవోలు ఈ విషయమై పరిశీలించాలి.

బి తిలక్ కుమార్, శ్రీకాకుళం.

చర్చ

న్యాయవ్యవస్థ ప్రతిష్ట మసకబారుతోందా?




నర్రా శ్రీనివాసరావు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహార శైలిపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు శుక్రవారం ఆరోపణలు చేస్తూ మీడియా సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా గత సంప్రదాయాలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా కేసులను బదలాయించడం, తనకు నచ్చిన న్యాయమూర్తులకు కొన్ని ప్రత్యేక కేసులు బదలాయించడం సరైనది కాదని న్యాయమూర్తులు మీడియా పరంగా ఆక్షేపించారు. దీనితో బాటు సంతకాలతో కూడిన ఒక లేఖను పత్రికలకు అందజేశారు. తాము గతంలోనే ఈ అంశాలపై ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తెచ్చినప్పటికి ఆయన వాటిని పట్టించుకోలేదని అందుకే ప్రజల్లో చర్చకు తీసుకు వెళుతున్నామని జస్టిస్ చలమేశ్వర్, మదన్ బి లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ రంజన్ గొగోయ్ తమ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యాయపాలనలో తీవ్ర సమస్యలు

ప్రధాన న్యాయమూర్తి సహచర న్యాయ మూర్తుల్లో ప్రథముడే గాని ఆయనకు అపరిమిత అధికారాలు లేవని చెబుతూ, న్యాయ పరిపాలనలో కేసుల బదలాయింపుల్లో సీనియారిటీ పక్కన బెట్టి వ్యవహరించారని సుప్రీం న్యాయమూర్తులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో న్యాయ వ్యవస్థ పరిపాలనలో ఉన్న లొసుగులు బహిర్గతమ య్యాయి. ఇది చివరికి పెద్ద చర్చకే దారి తీసింది. న్యాయమూర్తులు ఈ విధంగా బాహాటంగా ప్రధాన న్యాయమూర్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సుప్రీంకోర్టులో ఇచ్చిన కొన్ని తీర్పులు, ఉత్తర్వులపై బాహాటంగా విమర్శలను దిగటం సబబేనా అని విస్తృత చర్చకు దారి తీసింది.

న్యాయమూర్తుల ఆరోపణలు

సుప్రీం సీనియర్ న్యాయమూర్తులు నలుగురు తమ మీడియా సమావేశంలో సుప్రీంకోర్టు ధర్మాసనం కొలీజియం వ్యవస్థపై ఇచ్చిన తీర్పును ఉదహరిస్తూ తమ ఆరోపణలు చేశారు. ఎక్కువమంది న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పును వమ్ము చేయడానికి మరో సుప్రీం బెంచ్ ఆర్.పి. లూదర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులు 27 అక్టోబర్ 2017న ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని, ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల నియామకంపై ఇది ప్రభావితం చూపిస్తుందని అన్నారు. మరొకవైపు మెడికల్ కాలేజీ సీట్ల కేటాయింపులో జరిగిన కుంభకోణానికి సిట్ ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సబబుకాదని ప్రత్యక్షంగానే ఆరోపణలకు దిగారు. అనేక ఇతర కేసుల్లో కూడా... ప్రాధాన్యత ప్రకారం కాకుండా ...సీనియర్ జడ్జిలను కాదని... తనకిష్టమైన వారికి కేసులను కేటాయించడం సబబు కాదని...ఇది ఎన్నో సంవత్సరాలగా పాటిస్తున్న సాంప్రదాయాలకు విరుద్ధమని... వ్యవస్థ రక్షణకు తమకు మరో ప్రత్యామ్నాయం లేకనే మీడియా ముందుకు వచ్చామని వివరణ ఇచ్చారు. అయితే తమ విమర్శలు మౌఖికంగా చెప్పకుండా తాము ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖ విడుదల చేశారు.

రాజ్యాంగ రక్షణకు ఏది దారి?

రాజ్యాంగం ప్రకారం శాసన, కార్య, న్యాయ నిర్వాహక వ్యవస్థలు సమతుల్యంగా పని చేయాలి. మిగతా రెండు శాఖలు తీసుకొనే చట్ట వ్యతిరేక నిర్ణయాలపై రాజ్యాంగ రక్షణకు న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకొని సరిచేసిన సందర్భాలు కోకొల్లలు. అయితే న్యాయ వ్యవస్థలో సమన్వయం లేక వ్యవస్థీకృత లోపాలతో, వ్యక్తుల లోపాలతో ఇప్పుడు చర్చ ప్రజల ముందుకు వచ్చింది. వీటిని ఎవరు సరి చేయాలనే మీమాంస వ్యక్తమౌతోంది. న్యాయ వ్యవస్థ స్థాయి అనేక అంశాల రీత్యా మసకబారుతోంది. ఉన్నవారికి ఒక న్యాయం, లేని వారికి ఒక న్యాయం చట్టబద్ధమైన పాలన శరాఘాతమవు తున్నదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కాలంలో కోర్టులు ఇచ్చిన తీర్పులు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. న్యాయ వ్యవస్థ కూడా పాలనా వ్యవస్థకు అనుగుణంగా తీర్పు ఇస్తుందని అనుమాన పడాల్సి వస్తోంది. 2జీ కేసులో రూ.లక్ష కోట్ల పైగా కుంభకోణం జరిగిందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఇవ్వగా ...సుప్రీం తీర్పు ద్వారా ప్రత్యేక విచారణ బృందం ఏర్పడి కనిమొళి, రాజా వంటి రాజకీయ నేతలపై క్రిమినల్ కేసులు దాఖలు కాగా వారిపై నేరం నిరూపితమవలేదని ఢిల్లీ కోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. మరొక వైపు శశికళ కేసులలో త్వరితగతిన విచారణ పూర్తి అయి శిక్ష ఖరారయింది. ఇలాంటి సంఘటనల వలన న్యాయ వ్యవస్థ తీరు తెన్నులపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. మరొకవైపు గుజరాత్‌లో ఒక న్యాయమూర్తి మరణంపై విచారణ జరపాలని ఆదేశించడం మరలా దానిని విచారించేందుకు సుప్రీంలో ధర్మాసనం మార్చడం జూనియర్ న్యాయమూర్తికి కేసును బదలాయిం చడం లాంటి అంశాలు వ్యవస్థపై కొన్ని అనుమానాలకు తెర లేపుతున్నాయి. న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత మరల పునరావాసం పొందేందుకు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు వెలువరిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి కొలీజియంకూ కేంద్రానికి మధ్య చాలా కాలంగా వివాదం నడుస్తున్నది. దాన్ని సాకుగా చూపించి మోడీ ప్రభుత్వం నియామకాలే నిలుపు చేయడం ప్రతిష్టంభనకు దారి తీసింది. కొలీజియంలో సభ్యుల మధ్యనా విభేదాలున్నాయి. జస్టిస్ దీపక్ మిశ్రాపై వ్యక్తిగత ఆరోపణలూ నియామక సమయంలోనే చర్చకు వచ్చాయి. తర్వాత ఆయన వ్యవహార శైలి సమస్యను ఇంకా జటిలం చేస్తున్నదని ప్రస్తుత ఉదంతంతో అర్థమవుతున్నది. ఈ మధ్యలో జస్టిస్ కర్ణన్ ఆరోపణలు, ఆయనను అరెస్టు చేయడం వంటివి కూడా సంచలనం కలిగించాయి. మోడీ ప్రభుత్వం న్యాయ వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నదనే ఆరోపణలు పదే పదే వస్తున్నాయి. అమిత్ షా నిందితుడుగా వున్న సొరాబుద్దిన్ ఎన్‌కౌంటర్ కేసు విచారిస్తున్న జస్టిస్ లోయా మృతి కేసు కూడా ఈ వివాదంలో ఒక ముఖ్యాంశం.

పరిష్కారం

ఇటువంటి వివాదాల నేపథ్యంలో న్యాయ వ్యవస్థలో పూర్తి మార్పులు తీసుకు రావాల్సిన వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి, జవాబుదారీతనం కల్పించాల్సి ఉంది. హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఒకసారి నియామకం పొందిన తరువాత వారిని తొలగించాలంటే చాలా కష్టసాధ్యమైన పని. పార్లమెంట్‌లో మూడింట రెండో వంతు మంది సభ్యులు తీర్మానం ద్వారానే తొలగించే వీలుంది. దీంతో వారికి జవాబుదారీతనం లోపించిందని దీని కోసం వ్యవస్థాపరమైన సర్దుబాట్లు అవసరమని న్యాయ నిపుణులు, ప్రజలు కోరుతున్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం కోల్పోకుండా ఉండాలంటే న్యాయమూర్తుల నియామకం జవాబుదారీతనంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వ్యవస్థ ప్రక్షాళనకు పూనుకోవాలని, పారదర్శకత పెంచాలని ప్రజల అభిమతం.

(రచయిత ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్ : 9440441488)

jeevanapageps@gmail.com



యం. వీరరాఘవులు
కానూరు
పశ్చిమగోదావరి జిల్లా


21చుక్కలు
11 వచ్చేవరకు
మధ్యచుక్క


పి. శ్రీదేవి
కానూరు
పశ్చిమగోదావరిజిల్లా


17 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు



సి. రాజ్యలక్ష్మి
ప్రశాంత్‌నగర్ కాలని
హైదరాబాద్


16 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు, సరిచుక్క


అనంత లక్ష్మి
జెట్టిపాలెం
పశ్చిమగోదావరి


15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్యచుక్క


మన ఇంటి వాకిట ముగ్గును తదేకంగా చూస్తూంటే.. మదిలో అనేకానేక ఊహలు కదలాడతాయి. రంగులమయమై కళ్ళకు కట్టకమానవు. బహుశా.. మన పెద్దలు ఇంటివాకిట విరిసిన రంగవల్లుల్ని హరివిల్లుగా అభివర్ణించడానికి కారణాలు ఇవే కావొచ్చు. అందుకే సంక్రాంతి ముగ్గును.. కేవలం పిండివన్నెలద్దిన సాదాసీదా ముగ్గుగానే చూడలేం. ఇంకా ఏదో దాగుంది. ఎంతగా అంటే ఆకాశాన వేలాడే నక్షత్రాలను సైతం నేలపైకి దించేంతలా. పదండి.. మన మనసుని... మరోసారి కళాత్మకంగా ముగ్గులోకి దించుదాం ..!!





ఎ. అశ్విని
పెద్దాపురం
తూర్పుగోదావరి జిల్లా

15 చుక్కలు
15 వరుసలు



ఎమ్. పద్మావతి
కొత్తపేట
తెనాలి

15 చుక్కలు
15 వరుసలు

అమ్మచెప్పిన గీతోపదేశం

అదిగో అమ్మ.. ఇంటి వాకిట్లో ముగ్గేస్తుంది. అవును మనకు ఊహ తెలిసినప్పటి నుంచీ ముగ్గేస్తుంది. ఇంటి వాకిట్లోనే తనకు తెలిసిన కళాత్మక లయవిన్యాసాలన్నీ కలబోసి ప్రదర్శిస్తోంది.

అమ్మ.. నువ్వే మా ముగ్గుల గుమ్మ

అదిగో.. అదిగో.. ఆ ముగ్గు చూడ్డానికి ఎంత బావుంది. ఏమని వర్ణించాలి? 'అమ్మకు ఇంతలా అద్భుతాలు చేయడం ఎలా తెలుసబ్బా?! అలా.. అమ్మ ఒక ముగ్గమ్మలా మనల్ని ఆశ్చర్యాలకు గురిచేస్తూ.. నేలపై అద్భుతాలు చేస్తున్నప్పుడే మన చేతివేళ్ళూ అలా నేలపై కదలాడి.. చుక్కల ముగ్గులు వేయడానికి ఆరాటపడ్డాయి. ఆనక ఆరితేరిన ముగ్గులయ్యాయి. సీతాలు, సుబ్బలక్ష్మి, కవిత, లలిత, లావణ్య మాత్రమే కాదు, తమ్ముడు శీను, చందు, ఉదయశంకర్, చీమిడిముక్కు ప్రభాకర్ కూడా.. అమ్మతో కలిసి ముగ్గులేయాలని పరివిధాలుగా తపించడం మరచిపోలేని గొప్ప అనుభవం.

ఇంటి వాకిట్లో అక్కోచెల్లో.. కళ్ళాపు చల్లిన అమ్మనో ముగ్గేస్తుంటే.. ఇంటిగేటుకు వేలాడే అబ్బాయిలకూ భలే సంబరం. ఆకాశాన ఉండే చుక్కలు నేల మీదకు ఎలా వాలిపడ్డాయబ్బా? ఇలా అనేకనేక డౌటులు కూడా. అదే సీక్రెట్ మరీ. బహుశా అమ్మకు బోలెడన్ని లెక్కలు వచ్చుండొచ్చు.. వందల చుక్కల్ని కలిపి.. ఒడిసిపట్టి.. గీతలన్నింటితో నాట్యం చేయించే ఏదైనా గొప్ప కళా తెలుసుండొచ్చు. ముగ్గులో తరాలనాటి కళేదో ఉండే ఉంటుంది. అది అమ్మకు మాత్రమే తెలిసుండే కళ. అమ్మ నుంచి వారసత్వంగా వస్తున్న మహిమాన్విత కళ.

రోషాలు నేర్పే ముగ్గు

"అదిగో.. ఆ పొరుగింటావిడ పెట్టిన ముగ్గు ఎంత బావుందో..చూశారూ? ఏమైనా సరే.. ఆవిడ కంటే మంచి ముగ్గు పెట్టాల్సిందే. వీధి వీధంతా.. నా ముగ్గు గురించి గొప్పగా చెప్పుకోవాల్సిందే..!" అనే పోరాటపటిమ చూస్తే.. ముగ్గులు సైతం సరదాగా.. చిక్కగా నవ్వుకుంటాయేమో? ఒకరికిమించి ఒకరు వేసిన ముగ్గు అదిరిపోవాలనే కళాత్మకమైన కసి ఉండాల్సిందే. ఆ ముగ్గుల పోటీలో ఉండే రోషమే వేరబ్బా. అది నేలపై చుక్కలు పెట్టి.. వంగి వేసిన రేఖల్ని అద్దితేనే అర్థమవుతుంది. ఇలా పొరుగింటి ఇళ్ళను.. ఆ ఇళ్ళల్లోని మనుషులను.. సరదాగా.. కొంచెం అసూయగా.. ఇంకొంచెం రోషంగా కలగలుపుతూ అల్లుకుపోయే రథం ముగ్గు గురించి ఎన్ని చెప్పినా తక్కువే.

పుడిమి కాన్వాస్

రంగవల్లులు అద్దే ఎవరైనా సరే.. చేయి తిరిగిన చిత్రకారులే. ఆ మాటకొస్తే అంతకుమించి కూడా. పిండి చుక్కల్లో ఎన్నెన్ని చిత్రాలు. పరిమళించే పూలు, పలకరించే హంసలు, కొక్కొరోకో కోడిపుంజులు.. బుజ్జి బుజ్జి బాతులు.. భారీ అంబారీలు.. పురివిప్పే మయూరాలు, ఒంపులు తిరిగే లతలు, పారిజాతాలు, మిలమిల్లాడే మీనాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. ముగ్గుల్లో ఒదిగిపోయే ప్రకృతి పరవశం అంతా ఇంతాకాదు.

అమ్మ, అక్క, చెల్లి, భార్య, వదిన, అత్తమ్మ, బామ్మ.. ఆలోచనల్లో మెరిసే.. విరిసే ముగ్గులన్నీ ప్రపంచ అద్భుతాలే. ఆముగ్గుల్నీ మలచడం కోసం ఎన్నెన్ని అద్భుతాలు చేయాలి. వందలు, వేలు.. ఇలా నేలపై అరవిరిసిన చుక్కల్ని కలిపే గీతల్లో వణుకుండదు. ఆ ఒంపుల్లో తిరిగే మెలికల్లో తడబాటుండదు. ముగ్గు కేవలం.. నేలపై విచ్చుకునే సంప్రదాయం మాత్రమేకాదు. ఊరిలో ఆ చివరి ఉంచి ఈ చివరిదాకా ఉండే మనల్ని, మన మనసుల్ని.. కలగలిపే గీతోపదేశం.



మీ కోసం


ఎండు మిరపకాయల్లో ఉప్పు, మంచినూనె కలిపి ఉంచితే ఎక్కువ రోజులు ఎర్రగా ఉంటాయి

జీవన సౌరభం

అత్తరు దుకాణానికి వెళ్తే, అక్కడ మనమేమీ కొనకపోయినా కొంత పరిమళాన్ని తప్పక ఆఘ్రాణిస్తాం. ఉత్తముల సహచర్యమూ అంతే.

గమనిక :
ముగ్గుల్లో బహుమతులు పొందిన వారికి అభినందనలు.
మీ పూర్తి చిరునామాను, ఫోన్ నంబర్‌ను మాకు వెంటనే తెలియజేయగలరు.

మళ్లీ నాణేల తయారీ

కోల్‌కతా : నాణేల తయారీని నిలిపివేయాల్సిందిగా ఈ మధ్యకాలంలోనే ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకుంది. తిరిగి నాణేల తయారీని పునరుద్ధరించాల్సిందిగా సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్‌పిఎంసిఐఎల్)కు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం కోల్‌కతా, ముంబయి, నోయిడా, హైదరబాద్‌లో ఈ తయారీ కేంద్రాలు(మింట్) ఉన్నాయి. కాగా శుక్రవారం నుంచే తిరిగి నాణేల తయారీని తిరిగి ప్రారంభించామని కోల్‌కతా మింట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బిజన్ దేవ్ తెలిపారు. కాగా రెండు షిఫ్టుల్లో కాకుండా ఒకే షిఫ్ట్‌లో పనియాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. బ్యాంకుల్లో నాణేలను భద్రపరిచేందుకు స్థలం లేదని నాణేల తయారీని నిలిపివేయాల్సిందిగా ఈనెల 9న ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసింది. దీంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.



ఏడు వారాల గరిష్టానికి బంగారం

వరుసగా మూడో రోజూ బంగారం ధర పెరిగి ఏడు వారాల గరిష్ట స్థాయికి చేరింది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.100 పెరిగి వరుసగా రూ.30,750, రూ.30,600గా పలికింది. కిలో వెండిపై కూడా రూ.100 పెరిగి రూ.39,000గా నమోదయ్యింది.

ఏకమైన ఐడిఎఫ్‌సి బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్

ముంబయి : అనేకక ఊహాగానాల మధ్య ఐడిఎఫ్‌సి బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ ఎట్టకేలకు ఒక్కటయ్యాయి. బ్యాంకింగేతర విత్త సంస్థ క్యాపిటల్ ఫస్ట్, ఐడిఎఫ్‌సి సంస్థలు విలీనం అయినట్లు శనివారం ప్రకటించాయి. వీటి ఆమోదానికి సంబంధించిన అన్ని అనుమతులు రావాల్సి ఉంది. ఆ తర్వాత సంయుక్త భాగస్వామ్యంలో ఈ సంస్థలు కొనసాగనున్నాయి. దీంతో సుమారు 64లక్షల మంది వినియోగదారులు రూ. 1.4కోట్ల ఆస్తులతో ఈ జాయింట్ వెంచర్ అమల్లోకి రానుంది. మరోవైపు ఈ కంపెనీకి బిపిల్ జెమానీ మధ్యంతర సిఇఒగా వ్యవహరించనున్నారు. ఈ క్రమలోనే ఆయన ఐడిఎఫ్‌సి సిఎఫ్‌ఒ పదవీకి రాజీనామా చేశారు. అదే విధంగా క్యాపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు వైద్య నాథన్ నూతన సంస్థలకు సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. కాగా ఐడిఎఫ్‌సికి చెందిన రాజీవ్ లాల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉంటారు. ఈ ఒప్పందం ప్రకారం 10 క్యాపిటల్ ఫస్ట్ షేర్లకు గాను, ఐడిఎఫ్‌సి 139 షేర్లు దక్కనున్నాయి. ఐడిఎఫ్‌సి ఇంతక్రితం శ్రీరామ్ సిటీ యూనియన్‌తో విలీనాన్ని రద్దు చేసుకుంది. ఆ తర్వాత కాపిటల్ ఫస్ట్‌తోనూ ఇదే జరుగనుందన్న ఊహాగానాలకు తాజాగా రెండు సంస్థల తమ ఏకీకరణతో సమాధానం చెప్పినట్లయ్యింది. విలీనం తర్వాత వీటి ఆస్తులు రూ.88,000 కోట్లకు చేరొచ్చని అంచనా. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ 194 శాఖలకు, 353 చానల్స్‌కు, 9,100 మైక్రో ఎటిఎంలకు చేరనున్నాయి. శుక్రవారం బిఎస్‌ఇలో ఐడిఎఫ్‌సి షేర్ విలువ 1.31 శాతం తగ్గి రూ.67.65 వద్ద ముగిసింది. కాపిటల్ ఫస్ట్ సూచీ 0.05 శాతం పెరిగి రూ.835.90 వద్ద ముగిసింది.

గో ఎయిర్ సంక్రాంతి ఆఫర్



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ గో ఎయిర్ అన్ని చార్జీలు కలుపుకొని రూ.1157లకే విమానయానాన్ని ఆఫర్ చేస్తోంది. ఫ్లై స్మార్ట్, సేవ్ మోర్ స్కీం కింద ఈ ఆఫర్‌ను అందిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. జనవరి 22 తో ఈ ఆఫర్ బుకింగ్స్ ముగుస్తాయి. ఇలా బుక్ చేసుకున్న టికెట్ల ద్వారా 1 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 15 దాకా ప్రయాణించవచ్చు. ముఖ్యంగా పండగసీజన్, కొత్త ఏడాది, ఎక్కువ వారాంత సెలవుల సందర్భంగా ఈ డిస్కౌంట్ ఆఫర్‌ను అందించాలని నిర్ణయించామని గో ఎయిర్ పేర్కొంది. ఈ డిస్కౌంట్ పాటు గోఎయిర్ యాప్ ద్వారా టికెట్లను బుక్ చేసుకుంటే 10శాతం అదనపు తగ్గింపుకూడా ఇస్తున్నామని తెలిపింది. ఇలా వన్ వేలో రూ.250 తగ్గింపును, రిటర్న్ టికెట్ బుకింగ్‌పై 500 ఆఫర్ చేస్తోంది. ఆ కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్-లక్నో రూ. 3002, హైదరాబాద్ -అహ్మదాబాద్ రూ.3362, లక్నో-హైదరాబాద్ టికెట్ ధరలను రూ. 3574 గాను నిర్ణయించింది. అదే విధంగా లక్నో-ఢిల్లీ, బెంగళూరు-కొచ్చి, పుణె-బెంగళూరు, గౌహతి-కోల్‌కతా, పుణె-అహ్మదాబాద్, ఢిల్లీ-పాట్నా మధ్య రాయితీ ప్రయాణాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది.

జనవరి తర్వాత మళ్లీ ధరలు పెరుగొచ్చు

ఎస్‌బిఐ అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత జనవరి నెలలో ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని ఎస్‌బిఐకి చెందిన ఎకనమిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన ఒక నివేదికలో తెలిపింది. అయితే ఈ నెల తర్వాత మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. తమ అంచనాలకు తగ్గట్టే 2017 డిసెంబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.21 శాతానికి ఎగిసి 17 నెలల గరిష్టానికి చేరిందని ఆ సంస్థ పేర్కొంది. నవంబరులో ఇది 4.88శాతంగా ఉందని, కాగా దీని గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదని పేర్కొంది. జనవరిలో కూరగాయల ధరలు తగ్గుముఖం పడుతున్నాయని తెలిపింది. దీంతో ఈ నెలలో రీటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు కంటే తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. కాగా జనవరి తర్వాత నుంచి జూన్ వరకు మాత్రం కాస్త ఎక్కువగానే ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ సమయంలో సగటున ద్రవ్యోల్బణం 5.5శాతం ఉండనున్నట్లు అంచనా వేసింది. అయితే జులై తర్వాత నుంచి డిసెంబరు వరకు మాత్రం మళ్లీ తగ్గుముఖం పట్టి 4శాతం కిందకు చేరే అవకాశం ఉందని ఆ రిపోర్టు తెలిపింది.

8వేల కోట్లకు.. దిక్కులేరెవరూ..

- వారసులెవరో కూడా తెలియదు
- బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు
- నాలుగేళ్లలో అప్రకటిత ఖాతాలు రెట్టింపు
- చిరునామా లేని 2.63 కోట్ల ఎకౌంట్లు
- ఎస్‌బిఐలో మూలుగుతున్న రూ.1,036 కోట్లు
- రిజర్వు బ్యాంకు రిపోర్టులో వెల్లడి



ప్రజాశక్తి-బిజినెస్ డెస్క్

బ్యాంకుల్లో నుంచి తిరిగి తీసుకోని, ఎవరికి చెందినవో సరైన సమాచారం లేని బ్యాంకు డిపాజిట్లు రూ.8,000 కోట్లకు చేరాయి. దాదాపుగా 2.63 కోట్ల ఖాతాలకు దిక్కెవరూ లేరన్నట్లు ఉంది. ఆ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వ్యక్తులు లేదా వారసులకు సంబంధించిన వివరాలేవీ బ్యాంకు అధికారుల వద్ద లేవు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రిపోర్టు ప్రకారం గత డిసెంబర్ 16 నాటికి రూ.8,864 కోట్ల విలువ చేసే అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. కేవలం నాలుగు సంవత్సరాల్లోనే ఇలాంటి అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు రెట్టింపు అయ్యాయి. 2012-2016 మధ్య కాలంలో ఇలాంటి డిపాజిట్ల విలువతో పాటు ఖాతాలు కూడా రెట్టింపయ్యాయి. బ్యాంకుల్లో డిపాజిట్లు చేసి ఆ తర్వాత ఏళ్ల తరబడి వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా ఆ డిపాజిట్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం లేకపోతే వాటిని అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లుగా పరిగణిస్తారు.

దేశంలో 2012 నాటికి 1.32 కోట్ల అన్‌క్లెయిమ్‌డ్ ఖాతాలు నమోదయ్యాయి. కాగా 2016 నాటికి ఈ సంఖ్య రెట్టింపై 2.63కోట్లకు చేరింది. కాగా ఇదే సమయంలో వారి డిపాజిట్లు కూడా రూ.3,598కోట్ల నుంచి రూ.8,864.6 కోట్లకు పెరిగాయి. మరోవైపు ఈ డిపాజిట్లపై బ్యాంకు ఇచ్చే వడ్డీతో ఆ నగదు మరింత పెరుగుతూ వస్తోంది.

పదేళ్ళు దాటితే అంతే..

కనీసం 10 సంవత్సరాల పాటు ఒక్క సారి కూడా లావాదేవీ జరపని ఖాతాలను అప్రకటిత డిపాజిట్లుగా పరిగణిస్తారు. పదేళ్ల పాటు ఫిక్సుడ్ డిపాజిట్లు, సేవింగ్, కరెంట్ ఎకౌంట్స్ ఖాతాలను బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు పంపిస్తారు. కాగా వ్యక్తిగత బ్యాంకుల్లో పదేళ్ల పాటు నిర్వహణలోని ఖాతాలను ఏడాది ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా ఆర్‌బిఐకి సమర్పించాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్లలో వివరాలు..

అన్‌క్లెయిమ్‌డ్ బ్యాంకు డిపాజిట్‌దారుల వివరాలను బ్యాంకు అధికారులు తమ బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచాల్సిందిగా ఆర్‌బిఐ సూచించింది. ఈ జాబితాలో తప్పకుండా ఆ డిపాజిట్ చేసిన ఖాతాదారుని పూర్తి పేరు, వివరాలు పొందుపరచాల్సిందిగా ఆర్‌బిఐ ఆదేశించింది. అలా చేయడం వల్ల వారి వారసులు వివరాలను తెలుసుకోవడం చాలా సులభమవుతోందని ఆర్‌బిఐ ఉద్దేశ్యం.

ఉచితమేమీ కాదు..

ఇలాంటి అప్రకటిత ఖాతాల్లోని నగదు బ్యాంకులకేమీ ఉచిత సొమ్ము కాదు. సేవింగ్ ఖాతాలపై వడ్డీని ఆ ఖాతాల్లోనే జమ చేయాల్సి ఉంటుంది. ఫిక్సుడ్ డిపాజిట్లు మ్యాచూర్ అయిన తర్వాత ఖాతాదారు తీసుకోకపోతే ఆ మొత్తాలపై కూడా సేవింగ్ ఖాతాలపై ఇస్తున్న వడ్డీ రేటును అమలు చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ఆ మొత్తాలపై ఆర్‌బిఐకి నగదు నిల్వల నిష్పత్తి కింద 4 శాతం సొమ్మును జమ చేయాల్సి ఉంటుంది. నిర్వహణలోని ఖాతాలపై సరైన ఆడిట్ ఉండాలని 2015లో బ్యాంకులను ఆర్‌బిఐ ఆదేశించింది. అయితే ఈ అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లను ఖాతాదారులకు చెల్లించేంత వరకు ఆ నిధులను మాత్రం ఆర్థిక అక్షరాస్యతకు ఉపయోగించుకోవడానికి వీలుంది. అదే విధంగా డిపాజిట్లపై చైతన్యం, విద్యా ఫండ్ కోసం వాడుకోవచ్చు.

స్టేట్ బ్యాంకులో 47 లక్షల ఖాతాలు..

దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థగా ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో అత్యధికంగా 47 లక్షల అన్‌క్లెయిమ్‌డ్ ఖాతాలు ఉన్నాయి. వీటి విలువ రూ.1,036 కోట్లుగా ఉంది. అదే విధంగా కెనరా బ్యాంకులో కూడా 47 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో రూ.995కోట్ల నగదు ఉంది. కాగా దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఈ తరహా 23 లక్షల ఖాతాలు నమోదయ్యాయి. వీటి విలువ రూ.829కోట్లుగా ఉన్నాయి.



వొడా-ఐడియా విలీనానికి మరో అడుగు

న్యూఢిల్లీ : వొడాఫోన్ -ఐడియా మెగా విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)నుంచి అమోదం లభించిందని ఐడియా సెల్యూలర్ ప్రకటించింది. ఇక ఫైనల్‌గా రెండు కంపెనీలకు టెలికామ్ విభాగం నుంచి తుది ఆమోదం రావాల్సి ఉంది. గత ఏడాది మార్చిలో బ్రిటన్ టెలికం దిగ్గజం వొడాఫోన్ గ్రూపునకు చెందిన వొడాఫోన్ ఇండియా.ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ఐడియా సెల్యూలార్‌తో విలీనం కాబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం విలువ 23 బిలియన్ డాలర్లుగా ఉంది. విలీనం పూర్తి అయితే భారత టెలికం సెల్యూలర్ రంగంలో 35 శాతం మార్కెట్ వాటా ఈ సంస్థలదే కానుంది.

బెజోస్ భారీ విరాళం

శాన్‌ఫ్రాన్సిస్కో : ప్రపంచ కుబేరుడు అయినా అమెజాన్ సిఇఒ జెఫ్ బెజోస్ లాభాపేక్ష లేని ఆర్గనైజేషన్ దిడ్రీమ్.యూఎస్‌కు 33 మిలియన్ డాలర్లను (సుమారు రూ.210 కోట్లు) విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని శరణార్థ విద్యార్థులకు కాలేజీ స్కాలర్‌షిప్‌లుగా అందించాలని నిర్ణయించారు. జెఫ్ బెజోస్, ఆయన భార్య మెకంజీ అతిపెద్ద విరాళం అందించారని దిడ్రీమ్.యూఎస్ వెల్లడించింది. వెయ్యి స్కాలర్‌షిప్‌లకు ఈ నిధులను వాడనున్నట్లు తెలిపింది. 105 బిలియన్ డాలర్లతో జెఫ్ బెజోస్ మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను దాటి ఇటీవలే ప్రపంచ కుబేరుడయ్యారు.

టెట్ పరీక్ష - ప్రిపరేషన్



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

పెరుగుదల, వికాసం మధ్య బేధాలు



పెరుగుదల (గ్రోత్)

✧ పెరుగుదల శారీరకమైనది. (శారీరక అంశాలలో మార్పు)
✧ ఇది బయటకు కనిపిస్తుంది.
✧ దీనిని కచ్చితంగా కొలవగలం.
✧ దీనిని సులభంగా, మాపనం చేయవచ్చు.
✧ ఇది వ్యక్తులలో జరిగే 'పరిమాణాత్మక' మార్పులనే సూచిస్తుంది.
✧ ఇది సంకుచిత భావన
✧ పెరుగుదల వికాసంలో ఒక భాగం
- పెరుగుదల : జీవితాంతం కొనసాగక, శారీరక అవయవాలు 'పరిపక్వత' చెందగానే ఆగిపోతుంది.
✧ ఇది శారీరక పెరుగుదల అనే అంశానికి మాత్రమే పరిమితం.
✧ ఇది వికాసానికి దారి తీయవచ్చు లేదా దారి తీయకపోవచ్చు.
✧ శారీరక పెరుగుదల ఉన్నా మానసికాభివృద్ధి జరగకపోవచ్చు.
ఉదా : బుద్ధిమాంద్యులు

వికాసం (డెవలప్‌మెంట్)

✧ వికాసం మానసికమైనది. (మానసిక అంశాలలో మార్పు)
✧ ఇది బయటకు కనిపించదు.
✧ దీనిని కొలవలేము. కానీ అంచనా వేయగలం.
✧ దీనిని కొన్ని పరీక్షల ద్వారా అంచనా వేయగలం
✧ ఇది వ్యక్తులలో జరిగే 'పరిమాణాత్మక/గుణాత్మక' మార్పులతో పాటు 'గుణాత్మక మార్పులను' సూచిస్తుంది.
✧ పెరుగుదల కంటే వికాసం విస్తృతమైనది.
✧ వికాసం ఒక సమగ్రమైన, సంక్లిష్టమైన - సంకీర్ణ ప్రక్రియ, కావున పెరుగుదల వికాసంలో ఒక భాగం మాత్రమే.
✧ వికాసం జీవితాంతం కొనసాగే నిరంతర ప్రక్రియ
✧ ఇది వివిధ శారీరక, మానసిక, ఉద్వేగ, సాంఘిక, నైతిక మొదలైన మార్పులను సూచిస్తుంది.
✧ పెరుగుదల లేకుండా వికాసం జరిగిపోవచ్చు.
✧ శారీరక పెరుగుదల లేకున్నా మానసికాభివృద్ధి ఉంటుంది.
ఉదా : మరుగుజ్జులు
నోట్ : పెరుగుదల 'పరిమాణాత్మక మార్పులను' సూచిస్తుంది - హర్లాక్
✧ వికాసం 'పరిమాణాత్మక, గుణాత్మక మార్పు' లను సూచిస్తుంది - హర్లాక్
ఉదా : 1. బరువు, ఎత్తు, లావు - పరిమాణాత్మకమార్పు/ గుణాత్మక మార్పు
2. నడవడం, రాయడం, చదవడం - గుణాత్మకమార్పు.
✧ సమగ్ర భావన అయిన వికాసంలో పెరుగుదల ఒక అంతర్భాగం అయినప్పటికీ వికాసంపై పెరుగుదల ప్రభావం ఉంటుంది.

పరిపక్వత/ పరిణతి

✧ జన్మతః (పుట్టుకతోనే) వ్యక్తిలో ఉన్న సహజ సామర్థ్యాలు వయస్సుతోపాటు క్రమంగా, సహజంగా వికసించడాన్ని 'పరిణతి' లేదా 'పరిపక్వత' అంటారు.
✧ అనువంశికంగా వచ్చిన శారీరక, మానసిక లక్షణాంశాల సహజాభివృద్ధే - పరిపక్వత.
✧ జీవి 'పెరుగుదల, వికాసాలకు' ఇది ప్రాథమిక కారణం.
✧ వ్యక్తిలో అంతర్గతంగా ఉన్న శక్తి, సామర్థ్యాల వివర్తనను (అన్‌ఫోల్డ్) పరిపక్వతగా పరిగణిస్తారు.
✧ వ్యక్తి అనువంశికంగా పొందిన లక్షణాంశాలలో సహజంగా సంభవించే పరిమాణాత్మక, గుణాత్మక మార్పులను పరిపక్వత సూచిస్తుంది.
✧ ఎటువంటి అనుభవం, శిక్షణపై ఆధారపడకుండా, బాహ్య కారకాలతో సంబంధం లేకుండా కేవలం సమయం, వయస్సుతోపాటు వచ్చే వికాసమే పరిపక్వత.
✧ పరిణతి అంటే అభ్యసన ప్రమేయం లేకుండా ఒక క్రమబద్ధమైన పద్ధతిలో వికసించే వికాస ప్రక్రియ - గెసెల్.
✧ శిశువు పరిణతి ఫలితంగా ఇప్పటివరకూ చేయలేని పనిని ఇప్పుడు చేయగలుగుతాడు.
ఉదా : పుట్టినప్పుడు తల నిలపలేని శిశువు నాలుగు నెలల వయస్సులో ఎలాంటి శిక్షణ లేకుండా తలను నిలపగలుగుతాడు.
✧ పరిపక్వతలో రెండు ప్రక్రియలు ఉంటాయి. అవి...
1. అవయవాలు పెద్దగా అవ్వడము - దీనినే పెరుగుదల అంటారు.
2. వివిధ శరీర భాగాలు ఐక్యపడి సామరస్యంగా కలిసి పనిచేయడం - దీనినే వికాసం అంటారు.
✧ సాధారణంగా ఈ రెండు ప్రక్రియలు ఒకటిగా సంభవిస్తాయి.
✧ వికాసంలాగానే పరిణతి కూడా గుణాత్మక ప్రక్రియ.
✧ ఒక శిశువులో అభ్యసనం జరగాలన్నా, శిక్షణ ఇవ్వాలన్నా దానికి ముందు పరిణతి జరగాలి. అంటే అభ్యసించడానికి తగిన సామర్థ్యత రావాలి. ఈ సామర్థ్యతే పరిణతి.
✧ శిశువులో పరిణతి లేకుండా అభ్యసనం జరగదు.
నోట్ : వ్యక్తి వికాసం - ఎఫ్(పరిపక్వత అభ్యసనం) డి ఎఫ్(ఎం ఎల్)
నోట్ :
1. కాళ్లు, చేతులు, గుండె ఎదగడం - పెరుగుదల
2. చదవడం, రాయడం, ఈదడం, ఆడడం - వికాసం
3. పాకడం, నడవడం, పరిగెత్తడం - పరిపక్వత

ప్రాక్టీస్ బిట్స్

1. ఎరుగుదల - వికాసంపై అవగాహన ఉపాధ్యాయుడికి ఏ విధమైన శక్తినిస్తుంది?
ఎ. బోధించేటప్పుడు విద్యార్థుల భావోద్వేగాలపై నియంత్రణనిస్తుంది.
బి. భిన్న విద్యార్థులకు బోధించే విధానాన్ని స్పష్టపరుస్తుంది.
సి. విద్యార్థులు వారి జీవితాలను ఎలా మెరుగుపరుచుకోవచ్చో తెలియజేయవచ్చు.
డి. నిష్పక్షపాతంగా బోధనావృత్తిని నిర్వహించడానికి తోడ్పడుతుంది.

2. పెరుగుదల (గ్రోత్)కు సంబంధించి సరికానిది?
ఎ. వికాసంలో పోలిస్తే పెరుగుదల పరిధి పరిమితమైనది
బి. పెరుగుదల అనగా ఎత్తు, బరువు, ఆకారంలోని మార్పులు
సి. పెరుగుదల పరిమాణాత్మకమైనది
డి. పెరుగుదల నిరంతర ప్రక్రియ

3. కిందివాటిలో చాలక వికాసానికి (మోటార్ డెవలప్‌మెంట్) ఉదాహరణ కానిది?
ఎ. ఆటసామాగ్రిని ఉపాయంగా వినియోగించడం
బి. వస్తువులను విసరడం
సి. ఒక పాదం మీద స్కిప్పింగ్ చేయడం
డి. ఎత్తు పెరగడం

4. వ్యక్తి పరిపక్వత చెందడానికి అతనిలో ఏర్పడే ప్రగతిశీలక మార్పు ఏది?
ఎ. పెరుగుదల బి. అభ్యాసం
సి. వికాసం డి. పరిపక్వత

5. కింది వానిలో పరిపక్వత లేనిదే ఏదీ జరగదు?
ఎ. వికాసం బి. పెరుగుదల
సి. ప్రేరణ డి. అభ్యసనం

6. అభివృద్ధి (వికాసం) అంటే?
ఎ. రూపంలో మార్పు
బి. సంభావనీయత విచ్చుకోవడం
సి. దేహం పెరగడం
డి. అవయవస్థితిలో మార్పు

7. ఒక వ్యక్తిలో భావోద్రేక వికాసం ఏ కారణాలపై ఆధారపడుతుంది?
ఎ. పరిపక్వత బి. అభ్యసనం
సి. ఎ, బి డి. ఏదీకాదు

8. వ్యక్తి ప్రవర్తనను?
ఎ. పెరుగుదల ప్రభావితం చేస్తుంది
బి. వికాసం ప్రభావితం చేస్తుంది
సి. పరిణతి ప్రభావితం చేస్తుంది
డి. పైవన్నీ

9. ఈ కింది వానిలో జన్యు సంబంధ అంశాలు?
ఎ. పెరుగుదల బి. వికాసం
సి. పరిణతి డి. ఎ, సి

10. పెరుగుదల లక్షణం కానిది?
ఎ. శారీరక మార్పులకు పరిమితం బి. విస్తృతమైనది
సి. పరిమాణాత్మకం డి. గుణాత్మకం

11. ఈ కింది వాటిలో పెరుగుదలకు సంబంధించిన అంశం?
ఎ. ఈత నేర్చుకోవడం బి. దంతాలు రావడం
సి. కాళ్లు, చేతులు ఎదగడం డి. భాష నేర్చుకోవడం

12. శిశువు అర్థరహిత పదాల నుంచి సాధన చేస్తూ మాటలు పలికించడం అనే ప్రక్రియ?
ఎ. పెరుగుదల బి. వికాసం
సి. పరిపక్వత డి. నిష్పాదన

13. 'పుట్టినప్పుడు తల నిలపలేని శిశువు నాలుగు నెలల వయస్సులో ఎలాంటి శిక్షణ లేకుండా తలను నిలపడం' దేనిని సూచిస్తుంది?
ఎ. పరిపక్వత బి. పెరుగుదల
సి. వికాసం డి. ఏదీకాదు

14. శిశువు చేసే పనులలో సమర్థత, క్లిష్టత, నైపుణ్యాభివృద్ధి అధికమవ్వడం?
ఎ. పెరుగుదల బి. వికాసం
సి. పరిణతి డి. పైవన్నీ

15. 'పురోగమనం', క్రమబద్ధమైన' 'పొందికైన' పదాలు ఈ కింది వానిలో దేనిని సమర్థిస్తాయి?
ఎ. పెరుగుదల బి. పరిపక్వత
సి. వికాసం డి. ఏదీకాదు

16. వ్యక్తి వికాసం, మూర్తిమత్వ నిర్మాణంలో ముఖ్యపాత్ర వహించే అంశం?
ఎ. అభ్యాసం బి. అభ్యసనం
సి. పరిపక్వత డి. ఏదీకాదు

17. వికాసానికి సంబంధించి సరికానిది?
ఎ. వికాసం జీవితాంతం జరిగే ప్రక్రియ
బి. వికాసం గుణాత్మకమైనది
సి. వికాసం సమగ్ర విస్తృతమైన భావన
డి. వికాసాన్ని కొలవవచ్చు

18. ఈ కింది వానితో పరిపక్వతకు సంబంధించి సరికానిది?
ఎ. పరిపక్వత గుణాత్మకమైనది
బి. పరిపక్వతకు శిక్షణ అవసరంలేదు
సి. పరిపక్వత ఉంటేనే సంసిద్ధత వస్తుంది
డి. పరిపక్వతను మాపనం చేయవచ్చు

19. ఈ కింది వానిలో సరైన వాక్యం?
ఎ. శిశువు చదవడం, రాయడం - వికాసం
బి. పాకడం, నడవడం, పరిగెత్తడం - పరిపక్వత
సి. కాళ్లు, చేతులు, గుండె ఎదగడం - పెరుగుదల
డి. పైవన్నీ

20. ఈ కింది వానిలో వికాసానికిఁల సూత్రం?
ఎ. వికాసం = (పరిపక్వత X అభ్యాసం)
బి. వికాసం = (పరిపక్వత X అభ్యసనం)
సి. వికాసం = (పరిపక్వత X ప్రేరణ)
డి. వికాసం = (అభ్యసనం X ప్రేరణ)

21. 'పరిణతి'ని సమర్థించే వాక్యం?
ఎ. పరిణతి జైవిక ప్రక్రియకు సంబంధించినది
బి. పరిపక్వత పరిసర సంబంధంతో అధికంగా ప్రభావితం అవుతుంది
సి. ఆహార నియమాలను అనుసరించి పరిణతి అభివృద్ధి అవుతుంది
డి. పరిపక్వతకు కొంతవరకూ బాహ్య ప్రత్యేక శిక్షణ అవసరం

22. ఈ కింది వానిలో పెరుగుదలకు సంబంధించి సరికానిది?
ఎ. ఇది పరిమాణాత్మకం, గుణాత్మకం
బి. దీనిని బహిర్గతంగా గుర్తించవచ్చు
సి. ఇది శారీరక సంబంధమైనది
డి. ఇది సమగ్రమైనది

23. ఈ కింది వానిలో సరికానిది?
ఎ. వికాసానికి పరిపక్వత, అభ్యసనం అవసరం
బి. వికాసం సమగ్రం, సమన్వయం కలిగి ఉండటం
సి. వికాసం అనువంశికత, పరిసరాలవల్ల ఏర్పడుతుంది
డి. వికాసం, పెరుగుదలవల్ల జరుగుతుంది

సమాధానాలు : 1.బి, 2.డి, 3.డి, 4.సి, 5.డి, 6.బి, 7.సి, 8.డి, 9.డి, 10.బి, 11.సి, 12.బి, 13.ఎ, 14.బి, 15.సి, 16.సి, 17.డి, 18.డి, 19.డి, 20.బి, 21.ఎ, 22.డి, 23.డి.

సంస్కృతి ఉట్టిపడే సైకత శిల్పం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేవిధంగా (సేవ్ అవర్ కల్చర్) పేరుతో కాకినాడ సముద్ర తీరంలో శనివారం ఏర్పాటు చేసిన సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంటోంది. సూర్యారావుపేట బీచ్‌లో 16 గంటలపాటు ఐదుగురు సహాయకులతో తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన దేవిన శ్రీనివాస్ ఈ శిల్పాన్ని చిత్రీకరించారు. నేటివరకు ఏ శిల్పి కూడా ఒక పండుగను పురస్కరించుకుని ఈ విధంగా వేయలేదు. తన కళ ద్వారా సమాజానికి భాష్యం చెప్పడం అభినందనీయమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



కొత్త జంట ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం

కారు డ్రైవర్ మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్న నూతన దంపతులు ప్రయాణిస్తున్న కారును వారి కుటుంబ సభ్యులు వెంటాడటంతో జరిగిన ప్రమాదంలో ఆ కారు డ్రైవర్ మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం ఖమ్మం నగర శివారు గోపాలపురం వద్ద జరిగింది. వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ రాజు అక్కడిక్కడే మృతి చెందాడు. కారు ముందు సీట్లో కుర్చున్న తరుణ్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, నవ వధూవరులు షేహేల, సుమన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లెందుకు చెందిన సుమన్, షేహేల కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి మతాలు వేరు కావటంతో షేహేల పెద్దలు వారి వివాహానికి అనుమతించలేదు. దీంతో స్నేహితుల సహాయంతో వారు శుక్రవారం మహబుబాబాద్ జిల్లా అనంతరాం ఆలయంలో వివాహం చేసుకున్నారు. ఇద్దరూ మేజర్లు కావటంతో పెళ్లి అనంతరం ఇల్లెందు సిఐ వద్దకు వెళ్లి రక్షణ కోరారు. ఆయన ఇరువర్గాల వారిని పిలిపించి మాట్లాడి పంపించారు. అయితే శనివారం ఉదయం ఇల్లెందు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు నవ దంపతులు కారులో ప్రయాణిస్తుండగా..షేహేల తరపు బంధువులు మరో కారులో వారిని ఇల్లందు నుంచి వెంబడించారు. వారినుంచి తప్పించుకునే క్రమంలో డ్రైవర్ కారును వేగంగా నడపడంతో ఖమ్మం శివారు గోపాలపురం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీ కొట్టింది. ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వధూవరులు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అవినీతిలో రాష్ట్రం మొదటిస్థానం

తిరుపతి ఎంపి వరప్రసాద్ విమర్శ

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

అవినీతిలో రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని తిరుపతి ఎంపి వరప్రసాద్ విమర్శించారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి పూర్తి కాదని, మరో మూడేళ్లు పడుతుందన్నారు. రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసపూరిత మాటలతో మభ్యపెడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కార్యకర్తల అభివృద్ధి తప్ప ప్రజలు అభివృద్ధి చెందలేదన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు ఏర్పడి యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు కోరుకునే విధంగా పాలన ఉంటుందన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎంఎల్ఎ కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి ముఖ్యమంత్రితో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు.



ఎటిఎంలలో నగదు కొరతపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

బ్యాంకుల్లోనూ, ఎటిఎంల్లోనూ డబ్బు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చర్యను నిరసిస్తూ సిపిఎం విశాఖ నగర కమిటీ ఆధ్వర్యాన శనివారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర నాయకులు బి.జగన్, వి.కృష్ణారావు మాట్లాడారు. పండగ సమయంలో బ్యాంకుల నుంచి గాని, ఎటిఎంల నుంచి గాని డబ్బులు లభించక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. ప్రజలు దాచుకున్న డబ్బును తీసుకునే అవకాశం లేకుండా ప్రభుత్వం నగదు కృత్రిమ కొరతను సృష్టించడం దారుణమన్నారు. పేటీఎమ్ సంస్థల లాభాల కోసమే ప్రభుత్వం కృత్రిమ కొరత సృష్టిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.రాజు, జివిఎస్.చలపతి, డి.అప్పలరాజు, చంద్రమౌళి, బేగం తదితరులు పాల్గొన్నారు.

రెండు కంపెనీలు రైతులను ముంచాయి

- కంపెనీ ప్రతినిధుల అడ్డగింపు
- రొయ్యల రైతుల ఆగ్రహం
- బకాయిల కోసం నిలదీత
- పోలీసుల జోక్యంతో ప్రశాంతం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రొయ్యల రైతులను నిండా ముంచేశారు. ఇటు స్టార్ ఆగ్రో మెరైన్, అటు ప్రసాద్ జెంపెక్స్ కలిసి మోసం చేశాయి. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు రైతులకు చెల్లించాల్సిన నగదు విషయంలో ఇరువురు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. తమను మేయర్ అబ్దుల్ అజీజ్ రూ.42 కోట్ల మేర మోసం చేశారని జెంపెక్స్ కంపెనీ చీటింగ్ కేసు పెట్టిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో జెంపెక్స్ కంపెనీ తమకు చెల్లించాల్సిన నగదు చెల్లించకుండా నకిలీ చెక్కులు ఇచ్చారని, రూ.12 కోట్ల మేర బకాయిలు ఇవ్వాలని రైతులు ఆందోళనకు దిగారు. మరోవైపు మైనార్టీలు తమ నేతను రాజకీయంగా దెబ్బతీయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపణలు రావడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి హోటల్ మినర్వా వేదికైంది. ఒక దశలో జెంపెక్స్ కంపెనీ ప్రతినిధులపై మేయర్ గ్రూపు దాడికి ప్రయత్నం చేసింది. పోలీసులు రంగం ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

మేయర్ అబ్దుల్ అజీజ్‌పై నమోదైన చీటింగ్ కేసు కొత్త రంగు పులుముకుంది. అజీజ్ మూడేళ్ల క్రితమే స్టార్ ఆగ్రో కంపెనీ నుంచి వెళ్లిపోయారని, ఆయన గ్రూపునకు చెందిన కొందరు నేతలు ప్రకటన చేశారు. దీనిపై వివరణ ఇవ్వడానికి శనివారం స్థానిక మినర్వా హోటల్‌లో జెంపెక్స్ కంపెనీ ప్రతినిధులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న మేయర్ అబ్దుల్ అజీజ్ అనుచరులు, రొయ్యల రైతులు పెద్ద ఎత్తున హోటల్ వద్దకు చేరుకున్నారు. సమావేశంలోకి జొరబడ్డారు. విలేకర్లు తప్పుపట్టడంతో బయటే ఉండి పోయారు. జెంపెక్స్ కంపెనీకి చెందిన ఐదుగురు వ్యక్తులు మాత్రమే అక్కడకు వచ్చారు. స్టార్ ఆగ్రో మెరైన్‌కు, అందులో భాగస్వాములైన ప్రసాద్ జెంపెక్స్‌కు రైతులు రొయ్యలు విక్రయించారు. ఇందులో రొయ్యలు కొనుగోలు చేయాల్సింది, నగదు చెల్లించాల్సింది ప్రసాద్ జెంపెక్స్ కంపెనీయే. అందుకే రైతులకు ఆ కంపెనీ పేరుపై చెక్కులు పంపిణీ చేశారు. మూడు నెలల నుంచి ఆ చెక్కులు చెల్లడం లేదని, సుమారు రూ.12 కోట్లు చెల్లించాల్సి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవ్వాల్సిన నగదు విషయాన్ని తెలపాలని కంపెనీ ప్రతినిధులను రైతులు నిలదీశారు. ఇదే సమయంలో మేయర్ అజీజ్ అనుచరులు పెద్ద సంఖ్యలో అక్కడకు వచ్చారు. రైతులు ఎవరు? మేయర్ అనుచరులు ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది. బయటకు వెళ్లడానికి ప్రయత్నించిన కంపెనీ ప్రతినిధులను నిర్బంధించారు. వెళ్లకుండా అడ్డుకున్నారు. చెల్లించాల్సిన బకాయిల విషయం తేల్చిన తరువాత ఇక్కడ నుంచి వెళ్లాలని డిమాండ్ చేశారు. హోటల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నాలుగో నగర సిఐ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున పోలీసులు హోటల్ వద్దకు చేరుకున్నారు. కంపెనీ ప్రతినిధులకు రక్షణ కల్పించి, అక్కడ నుంచి పోలీసు వాహనంలో తీసుకెళ్లారు. అనంతరం రైతులు అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి ఎస్‌పికి వినతి పత్రం అందజేశారు.


ప్రసాద్ జెంపెక్స్ కంపెనీ ప్రతినిధులతో వాగ్వివాదానికి దిగిన రైతులు, మేయర్ అనుచరులు


వినూత్న రీతిలో భిక్షాటన చుస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

రోడ్డుపై బైఠాయింపు - వినూత్న నిరసన

ప్రజాశక్తి-టెక్కలి

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి మేజర్ పంచాయతీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు శనివారం భిక్షాటన చేపట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభమైన భిక్షాటన పట్టణ ప్రధాన రహదారుల మీదుగా సాగింది. అనంతరం అంబేద్కర్ కూడలి, ఇందిరాగాంధీ కూడళ్ల వద్ద కార్మికులు మానవహారం నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి వేతనాలు చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేక పండగ చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికులు గతేడాది డిసెంబరు నెలాఖరులో సమ్మె చేపట్టామని తెలిపారు. పండగ ముందు జీతాలు చెల్లిస్తామని పంచాయతీ కార్యదర్శి వాణికుమారి బెహరా హామీనిచ్చినా, ఇప్పుడు చేతులెత్తేశారని విమర్శించారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

30న జైల్ భరోను జయప్రదం చేయండి

అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్ల పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్, విశాఖ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 30న దేశ వ్యాపితంగా చేపట్టే జైల్‌భరోను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్లు పిలుపునిచ్చాయి. శనివారం విశాఖలోని నండూరి ప్రసాదరావు భవనంలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్ల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పరిధిలో 10, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 12 ప్రధాన డిమాండ్లపై దేశ వ్యాపితంగా కార్మిక సంఘాలు జాతీయ సమ్మెను నిర్వహించాయని చెప్పారు. న్యూఢిల్లీలో నవంబర్ 9, 10, 11 తేదీలలో లక్షలాది మందితో 'మహాపడావ్' నిర్వహించారని తెలిపారు. కార్మికులు, ప్రజలు, దేశ ప్రయోజనాలను స్వదేశీ, విదేశీ బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం ఫణంగా పెడుతుందని విమర్శించారు. ఎయిర్ ఇండియాలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించిందని తెలిపారు. చిల్లర వర్తకంలో 49 శాతం నుంచి 100 శాతం ఎఫ్‌డిఐలకు అనుమతించిందన్నారు. విశాఖలో కార్మికులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నా డిసిఐ ప్రయివేటీకరణను ఆపడం లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం వాటాలు విక్రయానికి సిద్ధపడిందని చెప్పారు. 44 కార్మిక చట్టాలను 5 లేబర్ కోడ్స్‌గా మార్చి యజమానుల దోపిడీకి ఆటంకం లేకుండా చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పోరాటం చేయాలని కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్లు నిర్ణయించాయని తెలిపారు. ఈ సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ ఫెడరేషన్ల నాయకులు పాల్గొన్నారు. .

నల్ల రిబ్బన్లతో ఫొటోగ్రాఫర్ల ధర్నా

చైర్మన్ బొలిశెట్టి వ్యాఖ్యలకు నిరసనగా నినాదాలు

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

ఫొటోగ్రాఫర్లపై తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఫొటోగ్రాఫర్లు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ జెఎసి అధ్యక్షుడు మాదాల రమేశ్, ఏపి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.అప్పారావు మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌లో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ అభివృద్ధిపై లైవ్‌షో జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావును ఉద్దేశించి మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి రాకముందు "ఆఫ్‌ట్రాల్ నువ్వు ఒక ఫొటోగ్రాఫర్" అనే పదం తమను ఎంతగానో బాధించిందన్నారు. ఈ విధమైన అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. మంత్రికి, ఫొటోగ్రాఫర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపిచంద్, డివి శ్రీనివాసరావు, జమలయ్య, పైలా శివ, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

వచ్చే ఎన్నికల్లో బిజెపితోనే పొత్తు

కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి- కైకలూరు (కృష్ణాజిల్లా)

రానున్న సాధారణ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి, టిడిపిలు కలిసి పోటీ చేస్తాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. కృష్ణాజిల్లా కైకలూరులో ఏలూరు ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. టిడిపి, బిజెపిలు ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తాయని, ఈ విషయంలో ఎటువంటి సందేహమూ లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం సుముఖంగా ఉందని, దశలవారీగా అన్ని రంగాలకు సహకారం అందిస్తుందని చెప్పారు. రాష్ట్ర విభజనతో ఎపి ఆర్థికంగా కష్టాల్లో ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిక మేరకు ప్రధాని మోడీ రాష్ట్రాభివృద్ధికి సహకరించేందుకు సముఖత వ్యక్తం చేశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు లేకపోయినప్పటికీ వ్యవసాయ రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందని, తలసరి ఆదాయంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని అన్నారు. ఈ సమావేశంలో ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, జెడ్‌పిటిసి బొమ్మనబోయిన విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

న్యాయ వ్యవస్థ సంక్షోభానికి మోడీ వికృత చేష్టలే హేతువు

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ వికృత చేష్టలే న్యాయ వ్యవస్థలో సంక్షోభానికి కారణమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ఈ వ్యవహారానికి మోడీ బాధ్యత వహించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక అవినీతి కుంభకోణాలు వెలికితీస్తున్నందున న్యాయవ్యవస్థపై ప్రత్యేక గౌరవం, గురుత్వం ప్రజల్లో ఉందన్నారు. ఒడిశాలో వేలకోట్ల మెడికల్ కుంభకోణం కేసును కూడా చీఫ్ జస్టిస్ చొరవతో మొత్తం మార్పించేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును చేపట్టిన సిబిఐ స్పెషల్ జడ్జి లోయా మరణం మిస్టరీగా మారిందని, ఆ కేసులో నిందితుడైన బిజెపి అధ్యక్షుడు అమిత్ షా హస్తం దీని వెనుక ఉందని వివరించారు. అమిత్‌షాపై నమోదు చేసిన కేసును కూడా మాయం చేశారని వ్యాఖ్యానించారు. కొలీజియం స్వతంత్రంగా వ్యవహరించాలా లేదా అనే విషయాలపై కూడా కేంద్ర జోక్యంతో వివాదాలు నెలకొని ఉన్నాయని తెలిపారు. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి మెమోరాండం ఆఫ్ ప్రొసెస్ (ఎంపీవో)ను ప్రధాని కార్యాలయం కావాలనే ఏడాది కాలంగా తొక్కిపెట్టి ఉంచిందన్నారు. ప్రధాని కార్యాలయం చీఫ్ జస్టిస్‌పై, సుప్రీంకోర్టుపై ఆధిపత్యాన్ని చెలాయిస్తోందనేది నిరూపణ అవుతోందని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్ సిఎం కలిఖో పుల్ ఆత్మహత్య కేసు, సిబిఐ స్పెషల్ జడ్జి లోయా కేసు, మెడికల్ కుంభకోణం కేసులను మళ్లీ తిరగతోడి ఉన్నత న్యాయ స్థానానికి అప్పగించాలని నారాయణ డిమాండ్ చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏడాది ప్రధాని మోడీ-చంద్రబాబు భేటీ వివరాలను ప్రధాని కార్యాలయం (పీఎంఓ) వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఏయే అంశాలను కోరారో చంద్రబాబు మీడియాకు చెప్పారే కానీ, ప్రధాని వేటిని అంగీకరించారు, ఏమిస్తామన్నారో వెల్లడించలేదని చెప్పారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కూడా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.


రామచంద్రాపురం మండలి కూడలిలో ప్రసంగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

ప్రతి పేద కుటుంబాన్నీ ఆదుకుంటా

ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చిత్తూరు)

ప్రతి పేద కుటుంబాన్నీ ఆదుకుంటానని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం 61వ రోజు ప్రజాసంకల్ప యాత్ర చిత్తూరు జిల్లా కుప్పంబాదూరు నుంచి ప్రారంభమయ్యింది. రాయల్‌చెరువు కట్ట, సంజీవరాయపురం, బలిజపల్లి, సివిపురం, రామిరెడ్డిపురం, గంగిరెడ్డిపల్లి, కమ్మకండ్రిగ, మిట్టూరు, రామచంద్రాపురం, నడవలూరు, పాతకందులవారిపల్లె పంచాయతీల్లో కొనసాగింది. అభిమానుల వేషధారణల మధ్య, డప్పు వాయిద్యాల మధ్య, మహిళల హారతులతో జగన్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. రామచంద్రాపురం కూడలి వద్ద ప్రజలతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ధర్మాన 1978లో చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి 2,500 ఓట్లతో గెలుపొందారన్నారు. అనంతరం 1983లో జరిగిన ఎన్నికలలో బాబు పరిపాలనను చూసిన చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు 17,500 ఓట్ల తేడాతో ఓడించారన్నారు. చంద్రబాబు నారావారిపల్లికి చెందిన శేషాపురం పాఠశాలలో విద్యాభ్యాసం చేశారన్నారు. నేడు ఆ పాఠశాల తుమ్మితే కూలిపోయే పరిస్థితికి చేరిందన్నారు. తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి పరచని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి పరుస్తారని ప్రశ్నించారు. గత ఎన్నికలలో వంద పడకల ఆస్పత్రిని చంద్రగిరిలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నేడు దానిని పట్టించుకోవడం లేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో 138 పంచాయతీలు ఉన్నా వాటిలో 70 శాతం పంచాయతీల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలు పొలాల వైపు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటుంటే వారి ఆవేదనలు, ఆర్తనాదాలు చంద్రబాబుకు కనపడటం లేదా అని దుయ్యబట్టారు. ఇదే నియోజకవర్గంలో ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాలలో రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తే ఏనుగులు ఆ పంటలను ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడం లేదని వాపోయారు. రాబోవు ఎన్నికలలో చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దన్నారు. ఒకవేళ బాబు ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారు ఇస్తామని చెప్పినా మోసపోవద్దని హితవు పలికారు. ఇచ్చిన మాట తప్పిన చంద్రబాబు ఇంటికి వెళ్లాల్సిందేనన్నారు. ఈ యాత్రలో స్థానిక ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గంగాధర నెల్లూరు ఎంఎల్ఎ నారాయణస్వామి, జంగాలపల్లి శ్రీనివాసులు, ఎంపి మిథున్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దామోదర రెడ్డి, భానుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. పిఎస్ఎల్‌వి-సి40
2. పిక్‌శాట్
3. జనవరి 12
4. ఇమ్మాన్యూల్ మాక్రోన్ (ఫ్రాన్స్ అధ్యక్షులు)
5. దక్షిణకొరియా (ఫిబ్రవరి 9 నుంచి)

సంక్రాంతి సంబరాలు

ఉత్సాహభరితంగా సంక్రాంతి ఆటల పోటీలు


విజయవాడ భవానీపురం పున్నమి ఘాట్‌లో జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సంప్రదాయ క్రీడాపోటీలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో శనివారం ఉత్సాహభరితంగా నిర్వహించారు.

విజయనగరం పట్టణంలోని 31వ వార్డు బొగ్గులదిబ్బ ప్రాంతంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చెయిర్స్, ఉండమ్మ బొట్టు పెడతా తదితర ఆటలను ఆడించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు పి.రమణమ్మ జి.పుణ్యవతి, వి.లక్ష్మి, యుటిఎఫ్ నాయకులు జి.నిర్మల పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో క్రికెట్, చెస్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఏలూరులో షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్ పోటీలను ఎపి ఫిల్మ్, టెలివిజన్, థియేటర్స్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ అంబికాకృష్ణ ప్రారంభించారు. ఏలూరు ఆర్ఆర్ పేట కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో జిల్లా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఆకివీడులో నాలుగు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, అమలాపురం, కరపలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. కాకినాడ కచేరిపేట, అమలాపురం, కరపలోనూ మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. 17న బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు విజయవాడ సెంట్రల్ కమిటీల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. 19వ డివిజన్ నిమ్మతోట, పుష్పాహోటల్ సెంటర్‌లలో, 43 డివిజన్ దుర్గాపురం, సుందర నగర్ కాలనీ, 55వ డివిజన్ టిఎన్‌టి కాలనీ, 45వ డివిజన్ మధురానగర్, నేతాజీ కాలనీ, 59వ డివిజన్ కుందావారి కండ్రికలో మ్యూజికల్ చైర్స్, స్లో సైక్లింగ్, లెమన్ అండ్ స్పూన్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. 45వ డివిజన్ మధురానగర్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో డివైఎఫ్ఐ , ఐద్వా, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కొత్త సుగాలికాలనీలో సంక్రాంతి ఆటల పోటీలను నిర్వహించారు. సిపిఎం నాయకులు అనుముల వీరబ్రహ్మం ప్రారంభించారు. రన్నింగ్, స్లో సైక్లింగ్, షాట్‌పుట్, మ్యూజికల్ ఛైర్స్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. మండల కేంద్రమైన శావల్యాపురంలో సిపిఎం, సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోటీలను సిపిఎం డివిజన్ కార్యదర్శి కె.హనుమంతరెడ్డి ప్రారంభించారు.


నాగాయలంకలో పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు

దివిసీమ పడవ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

దివిసీమ సంప్రదాయ పడవ పోటీలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని రాష్ట్ర క్రీడలు, యువజన సంక్షేమం, న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ పడవ పోటీలను అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. తొలి రోజు నిర్వహించిన కోల పడవల పోటీల్లో 27 టీంలు పాల్గొన్నాయి. నాగాయలంక మండలం ఈతచెట్లదిబ్బకు చెందిన టిఎల్ఆర్ టీమ్‌కు ప్రథమ బహుమతి రూ.25 వేలు, కోడూరు మండలం విశ్వనాథపల్లికి చెందిన అద్దంకి నాంచారమ్మ తల్లి టీమ్ ద్వితీయ బహుమతి రూ.15 వేలు, నాగాయలంకకు చెందిన తుమ్మల నరేంద్ర టీమ్ తృతీయ బహుమతి రూ.10 వేలు సాధించాయి. మిగిలిన అన్ని టీమ్‌లకు ప్రోత్సాహక బహుమతిగా రూ.4000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన కోడూరు మండలం మాచవరానికి చెందిన దాసరి సీతామహాలక్ష్మి, కర్నూలు జిల్లాకు చెందిన కె.తేజేశ్వరరెడ్డిని మెమెంటోలతో సత్కరించారు. జలవనరుల శాఖ మంత్రి దేవినేని మాట్లాడుతూ.. విజయవాడకు దిగువన, నాగాయలంకకు ఎగువన కృష్ణానదిపై రెండు చెక్‌డ్యామ్‌లను నిర్మించబోతున్నామన్నారు.

భోగి వేడుకలతో విమానాలు రద్దు

చెన్నై : భోగి వేడుకల వలన వెలువడిన దట్టమైన పొగతో విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని విమానయాన సంస్థ అధికారులు వెల్లడించారు. తమిళనాడులో పొంగల్‌కు ముందు రోజును భోగిగా జరుపుకుంటారు. ఆ రోజున ఇంటిలోని పాత వాటిని మంటలలో వేసి కొత్త వాటికి స్వాగతం పలుకుతారు. కాగా దీనివలన వెలువడిన పొగతో శనివారం ఉదయం 4 గంటల నుండి 8 గంటల వరకు విమాన సర్వీసులను నిలిపివేశామని, 9గంటల అనంతరం పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. 18 విమానాలను బెంగుళూరు, హైదరాబాదులకు విమానాశ్రయాలకు మళ్లించామని అన్నారు. కాగా, ఆ విమానాలు కువైట్, షార్జా, ఢిల్లీలకు వెళ్లాల్సినవిగా పేర్కొన్నారు. విమానాలు రద్దవడంతో ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ఈ దట్టమై పొగతో వాహనదారులు కూడా పలు ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చిందని పేర్కొన్నారు. కాగా, ప్రతి సంవత్సరం ప్రభుత్వం భోగి రోజు మంటలు వెలిగించకుండా పండుగను జరుపుకోవాలని హెచ్చరికలను జారీ చేస్తున్న సంగతి తెలిసిందే.



శిరోముండనం

సమాన వేతనంతో పాటు ఇతర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించనందుకు నిరసనగా భోపాల్‌లోగుండు గీయించుకుంటున్న ఉపాధ్యాయులు

విద్యా విధాన నిర్వహణ మాకు తెలుసు

ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలకు కాశ్మీర్ విద్యా మంత్రి 'కౌంటర్'

జమ్మూ : రాష్ట్రంలో విద్యా విధానాన్ని ఎలా నిర్వహించుకోవాలో తమకు తెలుసని , ఈ విషయంలో తమకు సలహాలిచ్చేందుకు ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ గొప్ప విద్యావేత్తేమీ కాదని, జమ్మూకాశ్మీర్ మంత్రి అల్తాఫ్ బుఖరి వ్యాఖ్యానించారు.. విద్య రాష్ట్రానికి సంబంధించిన అంశమని, పాఠశాలలను ఎలా నడపాలో తమ ప్రభుత్వానికి తెలుసునని ఆయన అన్నారు. కాశ్మీర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థ అవినీతిమయంగా ఉందని, మతపరమైన భావాలను ప్రోత్సహిస్తున్నారని, ప్రతీ తరగతి గదిలోనూ రెండు మ్యాపులు ఉన్నాయని, ఒకటి భారత్ మ్యాప్, రెండోది జమ్మూకాశ్మీర్ మ్యాప్ అనిశుక్రవారం ఆర్మీ డే సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన శనివారం ఈ విధంగా 'కౌంటర్' ఇచ్చారు. అంతేగాకుండా జమ్మూకాశ్మీర్‌కు రెండు రాజ్యాంగాలు ఉన్నాయని, ఒకటి జమ్మూకాశ్మీర్ రాజ్యాంగం, రెండోది భారత రాజ్యాంగమని బుఖరి పేర్కొన్నారు. రాష్ట్రం గురించి విద్యార్థులకు బోధించడానికి రాష్ట్రం మ్యాప్ అవసరమని, రాష్ట్రానికి రెండు జెండాలు ఉన్నాయని కూడా అన్నారు.

న్యాయమూర్తులు విల్లు ఎక్కుపెట్టండి

సీనియర్ నటుడు ప్రకాష్‌రాజ్



చెన్నై : సుప్రీం కోర్టు నిర్వహణ సరిగా లేదని చెప్పిన నలుగురు న్యాయమూర్తులు ఇక ముందు విల్లును ఎక్కువపెట్టాలని ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ సూచించారు. న్యాయవస్థ సరిగా నడవటం లేదని నలుగురు న్యాయమూర్తులు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రకాష్‌రాజ్ ట్విటర్ ద్వారా స్పందించారు. దేశంలో మనస్సాక్షిని అమ్ముకోలేని వ్యక్తులున్నారని, నలుగురు న్యాయమూర్తులు స్పష్టం చేశారని అన్నారు. జస్టిస్ లోయా, అధార్ కేసుల్లో కేంద్రాన్ని ఎవరూ తప్పించలేరని ఆయన వ్యాఖ్యానించారు.

గుజరాత్‌లోని ఓ ఆధ్యాత్మిక శిబిరంలో భారీ అగ్ని ప్రమాదం

ముగ్గురు యువతులు మృతి, 15 మందికి గాయాలు

రాజ్‌కోట్ : గుజరాత్‌లోని ప్రన్సలా గ్రామంలోని స్వామి ధర్మబంధు నిర్వహిస్తున్న ఒక ఆధ్యాత్మిక శిబిరంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో ముగ్గురు యువతులు మృతి చెందగా, 15 మంది గాయపడినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక దళాలు తీవ్రంగా కృషి చేశాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. మంటలు మహిళల శిబిరంలోకి వ్యాపించడంతో వారు మృతి చెందారని జిల్లా కలెక్టర్ విక్రాంత్ పాండే అన్నారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం కావచ్చునని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఈ శిబిరాన్ని స్వామి ధర్మబంధు గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ నెలలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ కూడా ఈ శిబిరానికి వచ్చారు. ఈ ఘటనపై విచారణ జరిపి, వెంటనే నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి విజయ్‌రూపాని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం ప్రకటించారు.

రైల్వే వెబ్‌సైట్ నాట్ అవైలబుల్ : ప్రయాణికుల విమర్శలు

న్యూఢిల్లీ : ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ మరోసారి మొరాయించింది. ఇండియన్ రైల్వే కాటరింగ్, టూరిజమ్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేసుకుందామని ఓపెన్ చేస్తే "డ్యూ టూ మెయింటెనెన్స్ యాక్టివిటీ- ఈ టికెటింగ్ సర్వీస్ నాట్ అవైలబుల్" అని వచ్చింది. సంక్రాంతి సెలవుల సందడి మొదలవడంతో సొంత ఊళ్లకు వెళ్లడానికి, టూరిజమ్‌కు ప్లాన్ చేసుకునే ప్రయాణికులకు శుక్రవారం సాయంత్రం దాదాపు 30 నిమిషాలపాటు వెబ్‌సైట్ సేవలు నిలిచిపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారు. దీంతో రైల్వేశాఖ పనితీరుపై ట్విట్టర్‌లో విమర్శలు గుప్పించారు.

కార్తితోపాటు మరో ఇద్దరికి ఇడి నోటీసులు

చెన్నై : కేంద్రమాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరానికి చెందిన చెన్నై, ఢిల్లీ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎయిర్‌సెల్ మాక్సిస్ మనీలాండరింగ్ కేసులు కార్తి చిదంబరంపై నమోదు చేశారు. 2009లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న చిదంబరం ఐఎన్‌ఎక్స్ మీడియా అనే సంస్థ విదేశీ పెట్టుబడులు పొందేందుకు అనుమతిచ్చినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం కార్తీ చిదంబరానికి ఈడి అధికారులు నోటీసులు జారీచేశారు. 16వ తేదీన హాజరు కావాలని కోరారు. శనివారం నాడు తనిఖీలు మొదలుపెట్టారు. ఇదే కేసులో ఐఎన్‌ఎక్స్ మీడియాకు చెందిన పీటర్, ఇంద్రాణి ముఖర్జీలకు నోటీసులు జారీచేశారు. అయితే గతంలోనే కార్తి చిదంబరంపై లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు.

'చంద్రయాన్-2'కు ఇస్రో కసరత్తు

శ్రీహరికోట : పీఎస్‌ఎల్‌వీ-సీ40 ప్రయోగం సక్సెస్ నింపిన ఉత్సాహంతో మరో భారీ ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సిద్ధమవుతున్నది. తదుపరి ప్రయోగంలో భాగంగా చంద్రయాన్-2ను నింగిలోకి పంపించేందుకు కసరత్తు చేస్తున్నది. ప్రయోగ పరికరాలు పరీక్షల దశలో ఉన్నాయని ఇస్రో శనివారం తెలిపింది. చంద్రుని పైకి ఇదివరకే చంద్రయాన్-1ను పంపించారు. ఇది రెండో ప్రయోగం. చంద్రయాన్-2లో చంద్రుని ఉపరితలాన్ని అన్వేషించడానికి రోవర్‌ను ఇస్రో సిద్ధం చేస్తున్నది. కాగా దీనిని మార్చిలో ప్రవేశపెట్టేది, లేనిది ఇంకా నిర్ణయించలేదని ఇస్రో మాజీ చైర్మెన్ ఎఎస్ కిరణ్‌కుమార్ శుక్రవారం(ఈయన పదవీకాలం ఇదే రోజుతో ముగిసింది) తెలిపారు. పీఎస్‌ఎల్‌వీ-సీ40 రాకెట్‌ను నిర్ణీత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రయాన్-2 నిర్ణీత కక్ష్యను, లాండర్, ఆరు చక్రాలున్న రోవర్‌ను కలిగి ల్యాండ్ సైట్ చుట్టూ తిరిగి చంద్రుని మట్టిని విశ్లేషించడానికి తగిన సమాచారాన్ని పంపుతుందని అన్నారు.

భార్యకు ఓటు వేయలేదని దారుణం..

మైనరుపై సామూహిక లైంగికదాడి, హత్య

రాంచీ : అమ్మాయిలపై అఘాయిత్యం జరగని రోజు లేదంటే ఆశ్చర్యపోనక్కరలేదు. రోజురోజుకూ దారుణాలు పెరుగుతూనే ఉన్నాయి. జార్ఖండ్‌లో జరిగిన ఈ దుర్మార్గ ఘటనకు గల కారణం మరీ విచిత్రంగా ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన భార్యకు ఓటువేయలేదని.. ఆ కుటుంబంపై కక్షగట్టాడా దుర్మార్గుడు. అంతే.. ఆ కుటుంబంలోని 13 ఏండ్ల బాలికను కిడ్నాప్‌చేసి లైంగికదాడి చేయడమేకాక.. అతి కిరాతకంగా ఆమెను హత్య చేశారు. జార్ఖండ్‌లో వెలుగుచూసిన ఈ దాష్టీకానికి సంబంధించి నిందితులు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8 నుంచి బాలిక కనిపించకుండా పోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు అదే ఫిర్యాదు చేశారు. కాగా, సమీపంలోని అటవీ ప్రాంతంలో మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రేమ్‌లాల్‌ను ప్రశ్నించగా.. అసలు విషయం బయటకువచ్చింది. పాకూరు జిల్లా లిట్టిపారా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రేమ్‌లాల్ హంసద భార్య పోటీ చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఆమెకు ఓటు వేయలేదు. ఆ కుటుంబంవల్లే తన భార్య ఓడిపోయిందన్న కోపంతో ప్రేమ్‌లాల్ ఆ కుటుంబంపై కక్షకట్టాడు. జనవరి 8న బహిర్భూమికి వెళ్లిన బాలికను తన సోదరుల సహకారంతో అపహరించాడు. ఆపై వారంతా కలిసి లైంగికదాడికి పాల్పడి.. అనంతరం హత్య చేశారు.

తీవ్ర విమర్శలు...


నిందితులు రాజకీయంగా కాస్త పలుకుబడి ఉన్నవారు కావటంతో తొలుత కేసు నమోదు చేసుకునేందుకు పోలీసులు వెనక్కితగ్గారు. అయితే ప్రతిపక్షాల ఆందోళన, తల్లిదండ్రుల నిరసన ప్రదర్శనతో పోలీసులపై విమర్శలు గుప్పించారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి.. తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు.

చీఫ్ జస్టిస్ ఇంటి ముందు ప్రధాని ముఖ్య కార్యదర్శి..!

- వైరల్ అయిన ఫోటో..!!
- న్యూ ఇయర్ గ్రీటింగ్స్ ఇచ్చేందుకు వెళ్లానంటూ వివరణ
- ప్రత్యేక దూతను ఎందుకు పంపారో చెప్పాలంటూ కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా పట్ల నలుగురు సీనియర్ జడ్జిలు బహిరంగ విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ వివాదంలో ప్రధాని కార్యాలయం జోక్యం చేసుకుంటున్నదా..? అన్న అనుమానాలకు తావిచ్చే సంఘటన శనివారం ఉదయం జరిగింది. ప్రధాని మోడీకి ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నృపేంద్రమిశ్రా ఢిల్లీలోని జస్టిస్ దీపక్‌మిశ్రా ఇంటిముందు కారులో కూర్చుంటున్న ఫోటోను వార్తా సంస్థ ఏఎన్‌ఐ పోస్ట్ చేసింది. ఈ ఫోటో వైరల్ అయింది. దీనిపై ఓ జాతీయ ఛానల్ నృపేంద్రమిశ్రాను ప్రశ్నించగా..తన కార్యాలయానికి వెళుతూ చీఫ్ జస్టిస్ ఇంటిముందు ఆగానని, గేట్‌ముందు హ్యాపీ న్యూ ఇయర్ గ్రీటింగ్స్ ఇచ్చానే తప్ప లోనికి వెళ్లలేదని అన్నారు.



నృపేంద్రమిశ్రా

న్యాయ వ్యవస్థ సూత్రాలకు అనుగుణంగా వ్యవహరిండంలేదంటూ ఇప్పటికే నలుగురు సీనియర్ జడ్జిల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా ప్రధాని కార్యాలయ అధికారితో సమావేశానికి నిరాకరించినట్టుగా తెలుస్తోంది. భేటీకి అంగీకరించి ఉంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావించినట్టుగా పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు న్యాయ వ్యవస్థ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. కేంద్ర న్యాయశాఖమంత్రి రవిశంకర్‌ప్రసాద్, ఆ శాఖ సహాయమంత్రి పిపి చౌదరితో శుక్రవారం ప్రధాని మోడీ అత్యవసర భేటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రధానితో భేటీ అనంతరం పిపి చౌదరి మాట్లాడుతూ..మన న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యుత్తమమైనది, స్వతంత్రమైనది, అంతర్గతంగానే పరిష్కరించుకుంటారని అన్నారు. అయితే,శనివారం ఉదయం చీఫ్ జస్టిస్ ఇంటి దగ్గరికి నృపేంద్రమిశ్రా ఎందుకు వెళ్లారో ప్రధాని స్పష్టం చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. చీఫ్ జస్టిస్ దగ్గరికి ప్రత్యేక దూతను ఎందుకు పంపారో ప్రధాని సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్‌సూర్జేవాలా ట్వీట్ చేశారు.

కొన్నిసార్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం పాలనాతీరు సరీగ్గా లేదంటూ నలుగురు సీనియర్ జడ్జిలు ఆరోపించిన విషయం తెలిసిందే. శుక్రవారం నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకు వచ్చి చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రాను ఉద్దేశిస్తూ బహిరంగంగానే విమర్శలు చేయడంతో తదనంతర పరిణామాల పట్ల ఆసక్తి నెలకొన్నది. కొన్ని నెలలుగా అవాంఛనీయ పరిణామాలు జరిగాయని సీనియర్ జడ్జి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మీడియా ముందే స్పష్టం చేయడం గమనార్హం. చీఫ్ జస్టిస్ తనకున్న అధికారంతో ధర్మాసనాలకు కేసుల విచారణ బాధ్యత అప్పగించడంలో హేతుబద్ధత లోపించిందని, రోస్టర్‌ను పాటించడంలేదని ఆయనతోసహా నలుగురు జడ్జిలు ఆరోపించారు.

బస్సు ప్రమాదంలో ఏడుగురి మృతి

హసన్ : కర్నాటకలోని హసన్ తాలుకాలోని కరెకేరా జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, పదిమంది గాయాలపాలైనట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.కె. శహపుర్‌వాద్ పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెఎస్‌ఆర్‌టిసికి చెందిన బస్సు కరెకెరా జాతీయ రహదారిలో గల బ్రిడ్జిపై నుండి శనివారం తెల్లవారుజామున 3:30 గంటలకు పడిపోయిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వీరిలో బస్సు డ్రైవర్, కండెక్టర్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని హసన్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, డ్రైవర్ నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగి వుండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

చిదంబరం ఇంట్లో ఐటి సోదాలు

చెన్నై : కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం నివాసంలో శనివారం అదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన కుమారుడు కార్తి చిదంబరానికి సంబంధించిన ఆరు చోట్ల సోదాలు జరిగాయి. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ డీల్‌లో మనీలాండరింగ్ జరిగినట్లు నమోదైన ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలను ఐటీ శాఖ నిర్వహించింది.శనివారం ఉదయం 7.30 గంటల నుంచి చిదంబరం నివాసంలో ఐదుగురు అధికారులు సోదాలు నిర్వహించా రని పేర్కొన్నారు. న్యాయవాది అరుణ్ నటరాజన్ మాట్లాడుతూ ఈ సోదాల్లో ఎటువంటి డాక్యుమెంట్లను ఐటీ శాఖ స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. కేసు విచారణలో ఉన్నందువల్ల ఏమీ చెప్పలేమని పేర్కొన్నారు. కాగా, సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఆయన చెన్నైలో లేరని సమాచారం. ఇదే కేసులో గత డిసెంబరు 1న కార్తి చిదంబరం సమీప బంధువు నివాసంలో సోదాలు జరిపిన సంగతి తెలిసిందే.



వీడియో చిత్రాలను విడుదల చేసిన ఇస్రో

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి విజయవంతంగా రాకెట్లను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన అనంతరం పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) పంపిన వీడియోను ఇస్రో శనివారం విడుదల చేసింది. పిఎస్ఎల్వి గంటకు 27 వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి, అంతరిక్షంలో 31 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రవేశపెట్టింది. 23 సెకన్ల పాటు ఉన్న వీడియోలో ఉష్ణ కవచం విభజన దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాకెట్ అంతరిక్షంలో ప్రవేశపెట్టిన వాటిలో 'కారోస్టాట్ 2' భారీ ఉపగ్రహం కూడా వుంది. 710 కిలో గ్రాముల బరువున్న ఈ నిఘా ఉపగ్రహం భారతదేశ సరిహద్దులను పర్యవేక్షిస్తుంది.

గుజరాత్‌లో తీవ్రంగా నిరుద్యోగ సమస్య

- అసంతృప్తిలో యువత
- గవర్నర్ సంచలన వ్యాఖ్యలు
- 'అభివృద్ధి నమూనా'పైనా విమర్శలు



గాంధీనగర్ : గుజరాత్‌లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో యువత పూర్తి అసంతృప్తితో ఉన్నారని ఆ రాష్ట్ర గవర్నర్ ఓ.పి. కోహ్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఏ సమాజానికైనా ప్రమాద హెచ్చరిక వంటిందని కోహ్లి అన్నారు. అలాగే బిజెపి అభివృద్ధి నమూనా ప్రచారంపైనా గవర్నర్ విమర్శలు చేశారు. ఇక్కడ జరిగిన గుజరాత్ సాంకేతిక విశ్వవిద్యాలయం (జిటియు) ఏడవ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో అదే వేదికపై ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు.కాగా, ఈ ప్రసంగంలో గవర్నర్ బిజెపి అభివృద్ధి నమూనా ప్రచారంపై విమర్శలు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బిజెపి ప్రచారం చేసిన అభివృద్ధి నమూనా ప్రజలను ఆకట్టుకోలేకపోయిందని, అందుకే కాంగ్రెస్‌పై స్వల్ప తేడాతో గట్టెక్కిందని వ్యాఖ్యానించారు.. 'కొన్ని నగరాలు అభివృద్ధి చెందినంత మాత్రాన దేశం మొత్తం అభివృద్ధి చెందినట్లు కాదు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి. ముఖ్యంగా అట్టడుగున ఉన్న వారికి అవి చేరాలి' అని గవర్నర్ తెలిపారు.'నిరుద్యోగం కారణంగా ప్రస్తుత రోజుల్లో యువత అసంతృప్తిగా ఉండడాన్ని మేము చూస్తున్నాం. చదువులకు తగిన ఉద్యోగం రాకపోయినా అలాంటి భావన సహజంగా వుంటుంది. యువతలో ఇలాంటి అసంతృప్తి వుండటం ఏ సమాజానికైనా హెచ్చరిక వంటిది' అని కోహ్లి అన్నారు. గవర్నర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న విజయ్ రూపానీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ నిరుద్యోగ సమస్యను కాంగ్రెస్ ప్రస్తావించింది. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యసించిన యువతలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉన్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. కాగా, గవర్నర్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని గుజరాత్ విద్యాశాఖ మంత్రి భూపేంద్రసిన్హా అన్నారు. అయినా ఆయన వ్యాఖ్యలను సానుకూలంగా తీసుకుంటామని అన్నారు.

ముంబయి తీరప్రాంతంలో కూలిన హెలికాప్టర్

ముంబయి : పవన్ హాన్స్ సంస్థకు చెందిన హెలికాప్టర్ ముంబయిలోని దహను తీరానికి సమీపంలో శనివారం ఉదయం కూలిపోయింది. ఈ హెలికాప్టర్‌లో ఐదుగురు ఒఎన్‌జిసి ఉద్యోగులతో పాటు ఇద్దరు పైలెట్లు ఉన్నారు. ఈ ఘటనలో ఐదుగురు మరణించగా, ఒకరి మృతదేహాన్ని సహాయక సిబ్బంది కనుగొన్నారు. మిగిలిన వారి ఆచూకి కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. జుహు విమానాశ్రయం నుండి ఉదయం 10.20 నిమిషాలకు బయలు దేరిన హెలికాప్టర్ అరేబియా సముద్రంలోని ఒఎన్‌జిసికి క్షేత్రానికి 10.58గంటలకు చేరుకోవాల్సి ఉంది. కాని 10.35 సమయంలో ఎయిర్‌క్రాఫ్ట్ కంట్రోల్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఈ ఘటన వివరాలను భారత తీరరక్షణదళం ట్విట్టర్‌లో పేర్కొంది. కాగా శరవణన్, వి.కె.బాబు, జోస్ ఆంథోనీ, పంకజ్ గార్గ్, పి.శ్రీనివా సన్ ఒఎన్‌జిసిలో డిప్యూటీ జనరల్ మేనేజర్లుగా పనిచేస్తు న్నారు. జాడ తెలియని వారి కోసం భారత నావికా దళం, తీరరక్షణ దళ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టనున్నా రని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి ధరేంద్ర ప్రధాన్ కూడా స్పందించారు. పైలెట్లు, ఒఎన్ జిసి అధికారులు సురక్షితం గా బయటపడాలని ప్రార్థిస్తున్నానని ట్వీట్ చేశారు.

ప్రత్యేకం

నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానకు

ప్రభుత్వాస్పత్రులకు వెళ్లటానికి.. సగానికి పైగా జనం నిరాకరణ

న్యూఢిల్లీ : 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు..' అంటూ అలనాటి ఓ సినీ కవి రాసిన పాట నేటికీ అక్షర సత్యంగానే మిగిలిపోతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి మన ప్రభుత్వాస్పత్రులు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు.. సర్కారు దవాఖానాలను నిర్వీర్యం చేసుకుందుకు కంకణం కట్టుకుంటే.. రోగులు మాత్రం ఏం చేస్తారు.. ప్రయివేటు ఆస్పత్రులకు మొగ్గుచూపుతున్నారు.

అటు ప్రయివేటు, ఇటు ప్రభుత్వ ఆస్పతుల్లో పేలవమైన ప్రమాణాలతోపాటు, షరా మామూలుగానే ఆరోగ్యం అధిక భారమన్న విషయాన్ని మరోసారి రుజువుచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ మెడికల్ కళాశాలలో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి పసికందులు ప్రాణాలు గాల్లో కలిసిపోయిన ఘటన ప్రభుత్వాస్పపత్రులపై బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలిచింది. మరోకేసును పరిశీలిస్తే.. తన ఏడేండ్ల చిన్నారికి చికిత్స కోసం రూ. 15 లక్షల బిల్లును వేసిన ఫార్టీస్ ప్రయివేటు ఆస్పత్రి ఉదంతం వెలుగులోకి వచ్చింది. హర్యానాలో గర్భిణీ మహిళకు.. జ్వరం వస్తే ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె ఆరోగ్యం బాగుపడలేదు. చికిత్స చేస్తుండగానే చనిపోతే... బిల్లు మాత్రం రూ. 18 లక్షలు వేసి నిర్వాహకులు దండుకున్నారు. ఇలా అడ్డదిడ్డంగా దోచేస్తున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో ధరలను నియంత్రించాల్సిన అవశ్యకతను ఈ ఉదం తాలు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేసి.. కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుంటే.. ప్రజలు మాత్రం ఏం చేస్తారు. ఆ సర్కారు దవాఖానకు వెళ్ళాలంటే భయపడుతున్నా రు. నేషనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్) ఇటీవల జరిపిన సర్వే ఇది నిజమే అంటోంది. దేశంలో సగం మందికిపైగా జనం ప్రభుత్వాస్పత్రులను నిరాకరిస్తున్నారని ఆ సర్వే తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో 42 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 46శాతం మంది ప్రభుత్వ ఆరోగ్య సేవలకు మొగ్గుచూపుతున్నారు. పట్టణ భారతంలో 56 శాతం మంది ప్రయివేటు వైద్య సేవలను ఎంచుకుంటుండగా, గ్రామీణ భారతం లో 49 శాతం మంది అదే బాట పడుతున్నారు. పట్టణ ప్రజలతో పోలిస్తే.. గ్రామీణ ప్రజలు ఎక్కువగా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్నారు. గత బడ్జెట్లో, సబ్ సెంటర్లను "వెల్నెస్ సెంటర్స్" గా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించింది, అయితే ఆ దిశగా తీసుకున్న చర్యలేమీ లేవు. ఆయుర్వేద, యోగా, న్యాచురోపతి, యునానీ, సిద్ధా, హోమియోపతి (ఆయుష్) వంటి సాంప్రదాయ వైద్యంపై కేవలం ఒక్క శాతం మంది మాత్రమే మొగ్గుచూపుతున్నట్టు ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్ తెలిపింది. పట్టణ ప్రజల్లో 0.5 శాతం ఈ సంప్రదా య వైద్యాన్ని ఎంపిక చేసుకుంటుండగా.. గ్రామీణ ప్రజల్లో ఈ సంఖ్య 1.2 శాతంగా ఉంది.

తిరస్కరణ ఎందుకు?

ప్రభుత్వ వైద్యాన్ని ఎందుకు తిరస్కరిస్తున్నారో తెలుసుకునేందుకు ప్రభుత్వ ఆరోగ్య సౌకర్యాలను ఉపయోగించని కుటుంబాల్లో ఎన్‌హెచ్‌ఎఫ్ఎస్ ప్రత్యేకంగా సర్వే నిర్వహించింది. ఆస్పత్రి సమీపంలో ఉండకపోవడం, ఆస్పత్రి వేళలు అసౌకర్యంగా ఉండటం, ఆరోగ్య సిబ్బంది గైర్హాజరు, సుదీర్ఘకాలం క్యూ లైన్లో వేచి వుండాల్సి రావడం, ఇక చివరిగా మెరుగైన సంరక్షణ లేకపోవడం కారణాలుగా తెలుస్తోంది. మొత్తం మీద 55.1 శాతం కుటుంబాలు ప్రభుత్వ ఆరోగ్య సౌకర్యాలను ఉపయోగించుకోవడంలేదు.

సంక్షిప్తం

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

ముంబయి : మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు రెజ్లర్లతో పాటు ఒక డ్రైవర్ మృతి చెందారు. వారు సతారాలోని కుస్తీ పోటీలకు హాజరయ్యి తిరిగి వస్తుండగా, వారి వాహనాన్ని చెరుకు ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రెజ్లర్లతో సహా ఐదుగురిని ఆసుపత్రులకు తరలించారు.

పడవ ప్రయాణంలో అపశృతి

ముంబయి : ముంబైలోని దహనులోని తీరప్రాంతంలో పర్ణక బీచ్ సమీపంలో శనివారం ఉదయం పడవ మునిగిపోవడంతో ఇద్దరు పాఠశాల విద్యార్థులు మృతి చెందారు. మృతులను సోనాల్ భగవాన్ సుర్తె, జాహ్నవి హరీష్ సూరాతిగా గుర్తించారు. ఈ పడవలో 40 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు 32 మంది విద్యార్థులను రక్షించారు. మిగిలిన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఉదయం 11.30 గంటలకు నలభై మంది విద్యార్థులు పడవలో సముద్రంలోకి బయలుదేరారని, ఇంతలో పడవ మునిగిపోయిందని, కొంత మందిని రక్షించామని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

ఆధార్ లేకపోతే యుపిలో నిరాశ్రయులే

లక్నో : హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన రిక్షా కార్మికుడు ఉత్తరప్రదేశ్ లక్నోలో ఆధార్ లేక నిరాశ్రయుడయ్యాడు. వివరాల్లోకి వెళితే, ఆధార్ లేని కారణంగానే రాయ్‌బరేలీకి చెందిన ఆయన శుక్రవారం రాత్రంతా చలిలో గడపలసి వచ్చింది. కేవలం ఆధార్ లేనందునే ప్రైవేటు సంస్థ ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరించింది. తనకు ఆధార్ కార్డు వుందనీ, అయితే దాన్ని ఎలుకలు తినేశాయనీ, మరొకటి ఎలా పొందాలో తనకు తెలియదని, తన వద్ద ఏ ఇతర గుర్తింపు కార్డు లేదని చెప్పానని రిక్షా కార్మికుడు పేర్కొన్నారు. ఆశ్రయం కోసం ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు వెళ్తే, వారు తన ఆధార్‌ను చూపించాలని డిమాండ్ చేస్తున్నారని, లేని పక్షంలో ఫుట్‌పాత్‌పై పడుకోవాలని చెప్పారని ఆయన పేర్కొన్నారు.

సౌదీలో ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించిన మహిళలు

జెడ్డా : పురుషుల ఫుట్‌బాల్ క్రీడ తిలకించడానికి మొట్టమొదటి సారిగా సౌదీ అరేబియాలోని మహిళలను అనుమతించారు. దీంతో నలుపు రంగు వస్త్రధారణ, ఫ్లోరసెంట్ నారింజ దుస్తులు ధరించిన మహిళలు శనివారం రాజు అబ్దుల్లా స్టేడియంలోని గేట్లు వద్ద నిలబడి మ్యాచ్‌ను వీక్షించారు. అల్-అహ్లీ, అల్-బాటిన్ జట్ల మధ్య జరుగుతున్న ఈ పోటీలకు మహిళలు వారి భర్తలతో, పిల్లలతో, మిత్రులతో కలిసి వీక్షించారు. జెడ్డాలోని డమ్మామ్, రియాద్ స్టేడియాలను 2018 లో ప్రారంభించి కుటుంబాలను ఆహ్వానిస్తామని గత అక్టోబర్‌లోనే జనరల్ స్పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. ఈ నిర్ణయం చాలా కాలం క్రితమే జరిగిఉండాల్సిందని ఈ క్రీడకు హాజరైన వారిలో ఒకరు పేర్కొన్నారు. బహిరంగ క్రీడా కార్యక్రమంలో మహిళలు పాల్గొనడానికి అనుమతించే నిర్ణయంతో దేశంలో మంచి మార్పును తెస్తుందని ఆశిస్తున్నారు. కొన్ని నెలల క్రితం మహిళలు కారు నడిపే హక్కును సౌదీ అరేబియా ప్రకటించిన అనంతరం గురువారం వారి కోసం మొట్టమొదటి కారు ప్రదర్శన ఏర్పాటు చేశారు.



అధ్యక్ష ఎన్నికలు
చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న అధ్యక్ష ఎన్నికలలో తన భార్య మెచెలా, కుమార్తె జూలీతో కలిసి ఓటు వేస్తున్న అధ్యక్ష అభ్యర్థి మైఖేల్ ఓరాసెక్

అమెరికా ఒత్తిడికి తలొగ్గేది లేదు

తెగేసి చెప్పిన ఇరాన్

టెహరాన్ : అమెరికా ఒత్తిడికి ఇరాన్ ఎన్నడూ లొంగిపోదని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం స్పష్టం చేసింది. 2015 నాటి అణు ఒప్పందంపై తిరిగి చర్చలు జరిపేది లేదని తేల్చి చెప్పింది. ఆరు ప్రపంచ దేశాలతో ఇరాన్‌కు కుదిరిన సంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక (జెసిపిఓఎ) కింద అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను సడలించాల్సి వుందని పేర్కొంది. ఈ ఒప్పందాన్ని మొత్తంగా రద్దు చేయాలని లేదా అందులో మార్పులు చేయాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోందని, కానీ ఈ ఒప్పందానికి అంతర్జాతీయంగా వున్న మద్దతు, ఇరాన్ దృఢంగా నిలబడడంతో వారి ప్రయత్నాలు వీగిపోతున్నాయని ఇరాన్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఒప్పందం కింద ఏదైతే ఆమోదించామో అవి తప్ప మరే రకమైన మార్పును అంగీకరించేది లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ ఒప్పందానికి ఇప్పుడు కానీ, సమీప భవిష్యత్తులో కానీ ఎలాంటి మార్పులు చేసినా సహించేది లేదని తెలిపింది. అలాగే ఈ ఒప్పందాన్ని మరే ఇతర అంశానికి ముడిపెట్టరాదని పేర్కొంది. ఈ ఒప్పందం కింద ప్రతి 120 రోజులకు ఇరాన్‌పై అమెరికా ఆంక్షలను నిలుపుచేస్తున్నట్లు అధ్యక్షుడు సంతకం చేయాల్సి వుంటుంది.

రెబెల్స్ అధీనంలోని పట్టణాలు సిరియా స్వాధీనం

డమాస్కస్ : సిరియా వాయవ్య ప్రాంతంలోని ఇడిలిబ్ ప్రావిన్స్‌లో రెబెల్స్, ఇతర తీవ్రవాద గ్రూపులు స్వాధీనం చేసుకున్న పట్టణాలన్నింటినీ సిరియా సైన్యం తిరిగి హస్తగతం చేసుకుందని పర్యవేక్షక గ్రూపు శుక్రవారం తెలిపింది. డిసెంబరు 25 నుండి సైన్యం ఇడిలిబ్, హమా ప్రాంతాల్లో తన కార్యకలాపాలను విస్తరించిందని, 120 పట్టణాలను తన అధీనంలోకి తెచ్చుకుందని సిరియా మానవ హక్కుల పర్యవేక్షణ కేంద్రం తెలిపింది. కాగా, సిరియా ఆర్మీ ముందుకు చొచ్చుకు రావడాన్ని భగ్నం చేసేందుకు గురువారం టర్కీ మద్దతు గల రెబెల్స్ గ్రూపులు, అల్‌ఖైదాతో సంబంధం వున్న లెవంట్ లిబరేషన్ కమిటీ (ఎల్‌ఎల్‌సి)లు పెద్ద ఎత్తున దాడులు చేశాయి. కానీ వాటినన్నింటినీ సైన్యం విజయవంతంగా తిప్పికొట్టింది.

బ్రేకుల్లేవు, స్టీరింగ్ వీల్ వుండదు

జనరల్ మోటార్స్ నుండి పూర్తి స్థాయి అటానమస్ కారు

డెట్రాయిట్ : పూర్తి స్థాయిలో అటానమస్ (దానంతట అదే నడిచే) కారును తయారు చేసేందుకు అమెరికా ప్రభుత్వ అనుమతిని జనరల్ మోటార్స్ కంపెనీ కోరుతోంది. ఈ కారుకు స్టీరింగ్ వీల్ వుండదు. బ్రేక్ పెడల్ లేదా యాక్సిలేటర్ పెడల్ వుండదు. 2019లో వాణిజ్యపరంగా 'క్రూయిజ్ ఎవి' తయారు చేయాలని కంపెనీ భావిస్తోందని అధికారులు తెలిపారు. ఇందులో కూర్చునే ప్రయాణికులు తలుపులు కూడా తెరవనవసరం లేదు. ఆ పని చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. అంధులు, బధిరులకు కూడా ప్రత్యేక సదుపాయాలు, ఏర్పాట్లు వుంటాయి. కమర్షియల్ పాసింజర్ల సర్వీసులో మొట్టమొదటి సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాల్లో ఇదొకటిగా వుండగలదని జిఎం కంపెనీ తెలిపింది.

కొత్త అణ్వాయుధాల అభివృద్ధి

- లీకైన ట్రంప్ ప్రభుత్వ ముసాయిదా విధానం
- ఆయుధ నియంత్రణ నిపుణుల ఆందోళన
- నోరు మెదపని పెంటగాన్



వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం రూపొందించే కొత్త విధానం అణ్వాయుధాల పాత్రను మరింత బలోపేతం చేయగలదని లీకైన ముసాయిదా విధాన పత్రం పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం కొత్త అణ్వాయుధాల అభివృద్ధిని చేపడుతుందని, అవసరమైతే శత్రు దేశాలపై ప్రతీకార అణు దాడులు చేపట్టే అవకాశాలు కూడా వున్నాయని ఆ పత్రం పేర్కొంది. కాగా ఈ పత్రంపై పెంటగన్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. వాషింగ్టన్ పోస్ట్ వెబ్‌సైట్ ఈ పత్రాన్ని ప్రచురించింది. వెంటనే ఆయుధ నియంత్రణ నిపుణుల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ట్రంప్ చర్యల వల్ల అణు యుద్ధం తలెత్తే ముప్పు పెరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "నిర్ణయం తీసుకోవడానికి ముందుగా వ్యూహాలు, సమీక్షలకు సంబంధించిన ముసాయిదా కాపీలపై తాము చర్చించలేదని రక్షణ శాఖ శుక్రవారం తెలిపింది. అణు దృక్పథంపై సమీక్ష ఇంకా పూర్తి కాలేదని, అంతిమంగా ట్రంప్, రక్షణ మంత్రి సమీక్షించి, ఆమోద ముద్ర వేస్తారని పెంటగన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ముసాయిదా విశ్వసనీయమైనదేనని సంబంధిత వర్గాలు చెప్పాయి. అయితే, ట్రంప్ ఆమోదం కోసం అందచేసే పత్రం ఇదేనా కాదా అనేది వెల్లడించలేదు. అణ్వాయుధాల ముప్పును తగ్గించే లక్ష్యంతో 2010లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ విధానంపై సమీక్ష చేశారు. అయితే ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా పత్రం మాత్రం ఆ పత్రాన్ని తప్పు పడుతోంది. ఒబామా హయాంలో ప్రపంచంలో అణ్వాయుధాలు తక్కువగా వున్నాయని, ఈనాటి పరిస్థితికి ఆ విధానం సరిపడదని పేర్కొంటోంది. ప్రస్తుతం ప్రపంచం చాలా ప్రమాదకరంగా వుందని ఆ పత్రం వ్యాఖ్యానించింది. శత్రువులను నిలువరించాలంటే అణ్వాయుధాలను ఉపయోగించడానికి ఇప్పుడు ప్రపంచం సిద్ధంగా వుంటోందని పేర్కొంది. రాబోయే 30ఏళ్ళలో అమెరికా అణ్వాయుధాలను ఆధునీకరించడానికి, వాటి నిర్వహణకు లక్షా 20వేల కోట్లు అవసరమవుతాయని అమెరికా కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం అంచనా వేసింది. రష్యా, చైనాలు కూడా తమ అణ్వాయుధాలను ఆధునీకరిస్తున్నాయని ముసాయిదా పేర్కొంది. ఉత్తర కొరియా చేపట్టే అణు కవ్వింపు చర్యలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతికి ముప్పు కలిగించేవిగా వున్నాయని ముసాయిదా పేర్కొంది. అన్ని ఒప్పందాలను గౌరవిస్తూనే అమెరికా కొత్త అణు క్రూయిజ్ క్షిపణిని అభివృద్ధిపరుస్తుందని తెలిపింది. జలాంతర్గామి నుండి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణిని ఆధునీకరించాలని కూడా భావిస్తోంది.

గ్రీక్‌లో సమ్మెపై ఆంక్షలు

- నిరసించిన కార్మిక లోకం

ఏథెన్స్ : సమ్మె చేసే హక్కుపై ఆంక్షలు విధించడంతో సహా కొత్తగా తీసుకువస్తున్న సంస్కరణలను వ్యతిరేకిస్తూ సెంట్రల్ ఏథెన్స్‌లో శుక్రవారం వేలాదిమంది నిరసనకారులు ప్రదర్శనలు నిర్వహించారు. బెయిలవుట్ నిధులు తీసుకున్నందుకు బదులుగా పార్లమెంట్ వచ్చే వారం ఈ సంస్కరణల బిల్లును ఆమోదించాల్సి వుంది. కొత్త సంవత్సరంలో తలెత్తిన ఈ మొట్టమొదటి పారిశ్రామిక తిరుగుబాటు సందర్భంగా ఏథెన్స్ మెట్రోను మూసివేశారు. రోజూ దాదాపు పది లక్షలమంది ప్రజలు ఉపయోగించే ఈ మెట్రోను నిలిపివేయడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. నావికులు కూడా సమ్మెలో వుండడంతో సముద్రంలో నౌకలు కూడా తిరగలేదు. డాక్టర్లు సమ్మెకు దిగడంతో రిజర్వ్ సిబ్బందితో ఆస్పత్రులు నడిచాయి. సోమవారం ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదించాల్సి వుంది. కుటుంబ ప్రయోజనాల పునర్వ్యవస్థీకరణ, రుణ బకాయిలపై కంపెనీలను మూసివేయాల్సి వస్తే అందుకు అనుసరించే కొత్త క్రమాన్ని ప్రవేశపెట్టడం వంటి పలు చర్యలను బిల్లు పేర్కొంటోంది. కమ్యూనిస్టుల అనుబంధ గ్రూపు పిఎఎంఇకి చెందిన ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టిగా నినాదాలు చేశారు. దాదాపు 20వేల మంది ప్రదర్శనలో పాల్గొన్నారు. 'ఆధునిక బానిసత్వం వద్దు' 'తిరుగుబాటు చేయండి' అనిరాసి వున్న ప్లకార్డులను చేబూని ప్రదర్శకులు ఆందోళనలో పాల్గొన్నారు.ఆందోళనకారులు కొంతమంది పార్లమెంట్ భవనం సమీపించడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ప్రభుత్వం తీసుకు వస్తున్న ముసాయిదా బిల్లు పట్ల ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. 2010 నుండి జీవన ప్రమాణాలు క్షీణించి, ఆదాయాలు పడిపోవడం వంటి పరిణామాలతో ప్రజలు విసుగుచెంది వున్నారు. 2010లో మొదటిసారిగా ప్రభుత్వం ఆర్థిక దివాలా నుండి బయటపడేందుకు బెయిలవుట్ తీసుకుంది. ఆ తర్వాత రెండుసార్లు తీసుకోవడంతో పరిస్థితులు మరింత దిగజారాయి. కార్మికుల సమ్మె హక్కును రద్దు చేస్తామనడం సరైంది కాదని, ఇటువంటి చర్యలు ఎక్కువగా జుంటా హయాంలోనే జరిగాయని విమర్శించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం మూడో వంతు మంది కార్మికుల మద్దతుతో కార్మిక సంఘాలు సమ్మెలకు పిలుపివ్వవచ్చు.

నిలకడగా చైనా వాణిజ్యాభివృద్ధి

బీజింగ్ : గతేడాది చైనా నిలకడైన వాణిజ్యాభివృద్ధిని సాధించింది. మారుతున్న వాణిజ్య ధోరణి, దేశీయంగా, అంతర్జాతీయంగా వాణిజ్య విస్తరణే ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. రెండేళ్ళపాటు క్షీణిస్తూ వచ్చిన చైనా విదేశీ వాణిజ్యం గతేడాది 14.2శాతం పెరిగి 27.8 లక్షల కోట్ల యువాన్లకు చేరుకుంది. ఎగుమతులు 10.8శాతం పెరిగి 15.3లక్షల కోట్ల యువాన్లకు చేరుకున్నాయి.. దిగుమతులు కూడా 18.7శాతం పెరిగి 12.5లక్షల కోట్ల యువాన్లకు చేరుకున్నాయని జిఎసి (జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్) పేర్కొంది. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం, నిలకడగల దేశీయ ఆర్థిక విస్తరణ, పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు అమలు జరిగే ప్రాంతాల పొడవునా ఆవిర్భవిస్తున్న మార్కెట్లు కారణంగా ఈ అభివృద్ధి సాధించగలిగామని జిఎసి ప్రతినిధి హుయాంగ్ సాంగ్‌పింగ్ తెలిపారు.

16 ఆసియా దేశాలకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి

చైనా తన పొరుగు దేశాలతో ఆర్థిక, వాణిజ్య కార్యాచరణను బలోపేతం చేసుకుంటూ 16 ఆసియా దేశాలకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా మారిందని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. గతేడాది మొదటి 11 మాసాల్లో చైనా, మరో 25 ఆసియన్ దేశాల మధ్య వాణిజ్యం లక్షా 17వేల కోట్ల డాలర్లకు చేరిందని వాణిజ్య శాఖ విడుదల చేసిన డేటా పేర్కొంటోంది. ప్రాంతీయ వాణిజ్యంలో మూడవ స్థానాన్ని ఆక్రమించింది. చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, మలేసియా వున్నాయి. 25 ఆసియన్‌దేశాల నుండి 1077కోట్ల డాలర్ల విలువైన పెట్టుబడులు చైనాకు వస్తున్నాయి. అంటే మొత్తం విదేశీ పెట్టుడుల్లో దాదాపు 9శాతం చైనాకే వస్తున్నాయి. చైనా కూడా దాదాపు ఇంతేమొత్తం ఆసియా దేశాల్లో పెట్టుబడి పెడుతోంది.

బురఖా వేసుకున్నందుకు విద్యార్థినిపై దాడి

కెనడాలో దారుణం

ఒట్టావా, కెనడా : బురఖా ధరించినందుకు పాఠశాలకు వెళ్ళే విద్యార్థినిపై దాడి జరిగిన సంఘటన కెనడాలో చోటు చేసుకుంది. టొరంటోలో శుక్రవారం బురఖా వేసుకుని వెళుతున్న విద్యార్థిని (11)పై ఒక వ్యక్తి దాడి చేశాడని పోలీసులు తెలిపారు. కత్తెరతో ఆమె బురఖా చించివేసేందుకు ఆ వ్యక్తి రెండుసార్లు ప్రయత్నించాడని, ఆ తర్వాత పారిపోయాడని చెప్పారు. తన తమ్ముడితో కలిసి స్కూలుకు వెళుతుండగా ఆ వ్యక్తి కత్తెరతో తన ముఖంపై గల బురఖాను లాగేందుకు యత్నించాడని, తాను చాలా భయపడ్డానని, ఏం జరుగుతుందో తెలియని అయోమయంలో పడ్డానని తెలిపింది. తలపై నల్ల టోపీతో, కళ్ళద్దాలతో వున్న ఆ వ్యక్తి ఆసియన్ జాతీయుడని, దాదాపు ఆరడుగులు వున్నాడని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ వ్యక్తి అంతలా మీదకు వస్తున్నా ఒక్కరు కూడా అడ్డగించడానికి ముందుకు రాలేదని కానిస్టేబుల్ జెనిఫర్జిత్ సిదూ పత్రికా సమావేశంలో తెలిపారు. ఆ బాలిక తన తమ్ముడితో కలిసి అరుస్తూ అక్కడ నుండి పారిపోయిందన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రావ్యాలీకి అంకురార్పణ

మాట్లాడుతూ.. చెన్నయ్, బెంగుళూరుకు సమీపంలోని తిరుపతి పారిశ్రామికంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే సెల్‌కాన్, కార్బన్, డిక్సన్ లాంటి కంపెనీలు వచ్చాయని తెలిపారు. ఐఐటి, ఐసర్, ఎస్వీయూ, వివిధ వర్సిటీల నేతృత్వంలో నాలెడ్జ్‌హబ్‌గా రూపుదిద్దుకుంటున్న తిరుపతి నగరానికి మరిన్ని ఐటి కంపెనీలు రానున్నాయని వెల్లడించారు. విద్యార్థులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణను ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జోహో ముందుకురావడం అభినందనీయమన్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక ఐటి టవర్‌ను ఏర్పాటు చేసే దిశగా జోహో యాజమాన్యం కృషి చేయాలని కోరారు. తాను 2017, మే 8న అమెరికా పర్యటనలో పలు కంపెనీలతో ఎన్ఎంఒలు చేసుకున్నానని, జోహో కూడా అందులో ఒకటని వెల్లడించారు. కోటి ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఆ దిశగా నవ్యాంధ్రకు మరిన్ని కంపెనీలను తీసుకురానున్నట్లు తెలిపారు. సైబరాబాద్‌ను హైటెక్ సిటీగా తీర్చిదిద్దినట్లే నవ్యాంధ్రలోనూ అమరావతి, విశాఖ, అనంతపురం, తిరుపతిని ఐటీ క్లస్టర్‌లుగా అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ- నెల్లూరు- తిరుపతి- చెన్నైలను కలుపుతూ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ఐటి, పంచాయతీరాజ్‌శాఖామంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ఆయన దూరదృష్టితోనే హైదరాబాద్ సైబర్‌సిటీగా మారిందని పొగడ్తలతో ముంచెత్తారు. రాష్ట్ర పరిశ్రమలశాఖామంత్రి ఎన్ అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. నారా చంద్రబాబు, నారా లోకేష్‌ల నేతృత్వంలో సింగిల్‌విండో విధానంతో పరిశ్రమలకు అన్ని అనుమతులను, సౌకర్యాలను, రాయితీలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మరో 7 కంపెనీలైన ఎజిఎస్ హెల్త్, పారికర్ సాఫ్ట్‌వేర్, ఎక్సాఫ్లఎన్స్, నేస్, ఎఎన్ఎస్, వైఐటి, ఇన్జెనిసిస్ లను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జోహో చీఫ్ రాజువిగేశ్న, సీఈవో శ్రీధర్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్, చిత్తూరు ఎంపి శివప్రసాద్, ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న పాల్గొన్నారు.

నారావారిపల్లెలో నారా,నందమూరి కుటుంబీకులు

ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో నిర్వహించే సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు నారా, నందమూరి కుటుంబీకులు హాజరయ్యారు. చంద్రబాబు, నారా లోకేష్‌లకంటే ముందుగానే శనివారం మధ్యాహ్నం నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, నందమూరి బాలకృష్ణ, వసుంధరలతోపాటు పలువురు కుటుంబ సభ్యులు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నారావారిపల్లెకు చేరుకుని సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

పక్కపక్కనే సిఎం, ప్రతిపక్షనేతల సంకాంత్రి సంబరాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షనేత జగన్ కుటుంబీకులు ఒకే నియోజక వర్గంలో, పక్కపక్క మండలాల్లోనే సంకాంత్రి వేడుకల్ని నిర్వహించుకోబోతున్నారు. చిత్తూరు జిల్లా, చంద్రగిరి మండలంలోని నారావారిపల్లెలో సంక్రాంతి పండుగ నిర్వహించుకునేందుకు స్వగ్రామానికి చంద్రబాబు కుటుంబీకులు శనివారం చేరుకున్నారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ప్రస్తుతం అదే నియోజవర్గం, రామచంద్రాపురం మండలం నెన్నూరులో పాదయాత్రను శనివారం నిర్వహించారు. అక్కడే గుడారం ఏర్పాటు చేసుకుని రాత్రికి అక్కడే బసచేయనున్నారు. సంక్రాంతి వేడుకనూ అక్కడే నిర్వహించుకోనున్నారు. ఈ నేపథ్యంలో జగన్ తల్లి విజయమ్మ, భార్య భారతితో పాటు కుటుంబీకులు శనివారం నెన్నూరుకు చేరుకున్నారు. అటు ముఖ్యమంత్రి, ఇటు ప్రతిపక్ష నేతల కుటుంబాలు పక్కపక్క మండలాల్లోనే సంక్రాంతి పండుగను నిర్వహించుకోవడం గమనార్హం.

ట్రంప్‌పై ఆఫ్రికా ఆగ్రహం

అమెరికన్లకు కృతజ్ఞతలు తెలియచేసింది. నాలుగు గంటల పాటు చర్చించిన మీదట ఆ సమావేశం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ఆమోదించడానికి ముందుగా ఆ రాయబారులెవరూ కూడా తమ తమ ప్రభుత్వాలను సంప్రదించలేదని ఒక రాయబారి తెలిపారు.

సంక్రాంతికి ఇళ్లు భ్రాంతే

పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వీటికోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 1679.44 కోట్లు వెచ్చించారు. 2.41 ఇళ్లు పూర్తి దశలో ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు వాటిని ఎవరికీ కేటాయించలేదు. పూర్తయినా కేటాయింపునకు సిద్ధం కాలేదని అధికారులు చెబుతున్నారు. ఏడాది కాలంగా 2018 సంక్రాంతి నాటికి 2.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చేస్తామని ప్రకటిస్తూ వచ్చినా దానికి సంబంధించి అక్కడ అడుగు కూడా ముందుకు పడలేదు. మంత్రి నారాయణ ప్రకటనలు మాత్రం పేపర్లకే పరిమితం అయ్యాయి.

'పశ్చిమ'లో కోడి పందేలపై ఉత్కంఠ

సై..సై.. అంటున్న పందెం రాయుళ్లు

నై..నై.. అంటున్న జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

కోడి పందేలపై పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతేడాది తీర్పే అమల్లో ఉంటుందని సుప్రీం కోర్టు తెలపడంతో పందెం రాయుళ్ల తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ హడావుడి చేస్తున్నారు. సుప్రీం కోర్టు పందేలకు అనుమతి ఇవ్వలేదని, హైకోర్టు ఆదేశాల ప్రకారం కోడి పందేలను అడ్డుకుని తీరతామని పోలీసులు గట్టిగా చెబుతున్నారు. అయినా పందెం రాయుళ్ల బరులను సిద్ధం చేసేందుకు సామగ్రిని తరలిస్తుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2016 డిసెంబర్ 26న కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సంయుక్త తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను ఆదేశించింది. దీనిపై ప్రముఖ పారిశ్రామికవేత్త రఘురామ కృష్ణంరాజు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కోళ్లకు కత్తులు కట్టకూడదని పేర్కొంటూనే సంయుక్త బృందాలు ఇళ్లలోకి వెళ్లి కోళ్లను స్వాధీనం చేసుకోకూడదని, కోళ్ల పెంచుకునే రైతులపై కేసులు పెట్టరాదని తెలిపింది. పైన పేర్కొన ఒక్క అంశంపైనే స్టే ఇచ్చి, హైకోర్టు పేర్కొన్న మిగిలిన అంశాలన్నీ అమల్లో ఉంటాయని తెలిపింది.

కోళ్లకు కత్తులు కట్టకూడదన్న సుప్రీం వ్యాఖ్యలను పందెం రాయుళ్ల వక్రీకరించి డింకీ పందేలు ఆడతామని హడావుడి చేసి పెద్దఎత్తున కత్తులు కట్టి పందేలు నిర్వహించారు. గత సంక్రాంతికి జిల్లావ్యాప్తంగా



పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో సిద్ధం చేస్తున్న బరి

400కుపైగా బరుల్లో పందేలు సాగాయి. దాదాపు రూ.వంద కోట్లకుపైగా చేతులు మారాయి. గుండాట, పేకాట, అశ్లీల కార్యక్రమాలు యథేచ్ఛగా కొనసాగాయి. దీనిపై కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో కలెక్టర్, ఎస్‌పిలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈసారి కోడి పందేలను అడ్డుకుని తీరాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను సైతం బాధ్యులను చేసింది. పోలీసు, రెవెన్యూ సంయుక్త బృందాలు పందేలను అడ్డుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. పెద్దఎత్తున బైండోవర్ కేసులు నమోదు చేశారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. శుక్రవారం సుప్రీం తీర్పును మరోసారి వక్రీకరించేందుకు పందెం రాయుళ్ల ప్రయత్నించారు. జిల్లాలో అతిపెద్ద బరులుగా చెప్పుకునే భీమవరం ప్రాంతంలోని వెంప, శ్రీరామవరం, పాలకొల్లు ఏరియాలో పూలపల్లి, జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని శ్రీనివాసపురం, భీమడోలు మండలంలోని గుండుగొలను, పెదవేగి మండలం దుగ్గిరాలలో బరుల ఏర్పాటుకు ప్రయత్నాలు శనివారం ముమ్మరంగా సాగాయి. బోగి పండుగకు ఒక్కరోజే గడువు ఉండటంతో కోడిపందేలపై సస్పెన్స్ నెలకొంది. కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేస్తారా.. చివరిలో చేతులెత్తేస్తారా.. అనే చర్చ కొనసాగుతోంది.

కోడి పందేలను అడ్డుకుని తీరతాం
- పశ్చిమగోదావరి ఎస్‌పి రవిప్రకాష్

కోడి పందేలు నిర్వహించేందుకు న్యాయస్థానం నుంచి ఎటువంటి అనుమతులూ లేవని, చట్టాన్ని ధిక్కరించి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ.. 2016 డిసెంబర్ 26న హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. ఎక్కడైతే కోడి పందేలు నిర్వహించే అవకాశం ఉందో అక్కడ ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో కోడిపందేలు నిర్వహించే వారికి నోటీసులు జారీ చేశామన్నారు. పందేలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంచామన్నారు.

వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రధానితో బాబు భేటీ

వైసిపి నేత బొత్స విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీతో వాస్తవంగా ఏపి అంశాలు చర్చించారో ముఖ్యమంత్రి వెంటనే ప్రజలకు తెలియజేయాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రధానితో భేటీ అనంతరం ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కలిశారనే అనుమానం కలుగుతోందన్నారు. శనివారం హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన దుగరాజపట్నం పోర్టుకు బదులుగా రెండు ఎకనామిక్ జోన్లు ఇవ్వాలని కోరే హక్కు చంద్రబాబుకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. హోదాను కూడా ఇలాగే తాకట్టుపెట్టి ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని చంద్రబాబు నాయుడు చెప్పారని, ఆ అంశాలన్నీ నాలుగేళ్లుగా అడుగుతున్నవేనని అన్నారు. కనీసం 20 అంశాల్లో ప్రధాని ఎన్ని అంశాలను అంగీకరించారనే దానిపైనా స్పష్టత ఇవ్వడం లేదని విమర్శిం చారు. దేశంలో అందరికంటే సీనియర్ ముఖ్య మంత్రిని అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల నుంచి కేంద్రం నుంచి ఏమి సాధించా రనేదైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు రూ.లక్షా 20 వేల కోట్లు అప్పుచేశా రన్నారు. కేవలం రూ.16 వేల కోట్లు ఇరిగేషన్‌కు ఖర్చుచేసి, మిగిలిన డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టా రనే లెక్కలు ఎందుకు చూపడం లేదని నిలదీశారు.

సుప్రీం వివాదంలో బార్ కౌన్సిల్ రంగ ప్రవేశం


మొదటి పేజీ తరువాయి

బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ మాట్లాడుతూ 'మొదటి ఐదు బెంచ్‌లకు పిల్‌ను ఇవ్వకపోవడాన్ని నిరోధించేందుకు ఒక వ్యవస్థను అభివృద్ధి చేయాలి' అని అన్నారు. అలాగే పెండింగ్ పిల్‌లను ఐదుగురు జడ్జీలకు ఇవ్వాలని బార్ అసోషియేషన్ కూడా కోరింది. అలాగే అందరు న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలని బార్ అసోషియేషన్ విజ్ఞప్తి చేసింది.

సోమవారానికి పరిష్కారం అవుతుంది : అటార్నీ జనరల్

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మధ్య వివాదం సోమవారానికి పరిష్కారం అవుతుం దని అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ తెలి పారు. 'సోమవారం ఉదయానికి సుప్రీంకోర్టు జడ్జీల మధ్య ఐక్యతను చూస్తాం' అని అన్నారు. 'ఈ వివాదం కొనసాగాలని మనం కోరుకో కూడదు. జడ్జీలుగా ఉన్న వారందరూ చాలా ప్రతిభ, అనుభవం ఉన్న వ్యక్తులు. సమస్యను మరింతగా క్లిష్టం చేయడానికి వారు అంగీక రించరు' అని వేణుగోపాల్ అన్నారు. కాగా, తనపై అసంతృప్తి వ్యక్తం చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో ఆదివారం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సమావేశం అవుతారని సమాచారం. ఈ నలుగురు జడ్జీల్లో ముగ్గురు ప్రస్తుతం ఢిల్లీలో లేరు. ఆదివారానికి వారు ఢిల్లీకి తిరిగి వస్తారని, సమావేశంలో పాల్గొంటారని తెలుస్తోంది.

బార్ కౌన్సిల్ జోక్యం అవసరం లేదు : జస్టిస్ జోసెఫ్



కొచ్చి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్క రించడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జోక్యం అవ సరం లేదని జస్టిస్ కురియన్ జోసెఫ్ స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ఇతరుల మధ్యవర్తిత్వం అవసరం లేదని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై శుక్రవారం అసంతృప్తి వ్యక్తం చేసిన నలుగురు సీనియర్ జడ్జీల్లో కురియన్ ఒకరు. సమస్యను లేవనెత్తిన తామే సమస్యను పరిష్కరించుకుంటా మనే విశ్వాసాన్ని కురియన్ వ్యక్తం చేశారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'ఒక సమస్య తలెత్తింది. దాన్ని వారు విన్నారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తుల్లో సంభవించవు. కాబట్టి ఈ సమస్య పరిష్కారమవుతుందని నేను నమ్ముతున్నాను' అని కురియన్ తెలిపారు. 'ఒక సంస్థలో ఈ సమస్య తలెత్తింది. పరిష్కారానికి బయట వ్యక్తుల జోక్యం అవసరం లేదు' అని కూడా ఆయన తెలిపారు. అలాగే, సుప్రీంకోర్టు పైనా, సుప్రీంకోర్టు న్యాయ మూర్తులపైనా భారత రాష్ట్రపతికి రాజ్యాంగ పరమైన బాధ్యత లేనందున ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లమని కూడా జోసెఫ్ తెలిపారు.

రాజకీయ దుమారం

మొదటి పేజీ తరువాయి

సమస్యాత్మకంగా మారింది. అక్కడ నిట్‌ను ఏర్పాటు చేస్తే బిజెపి మంత్రికి లాభిస్తుందని టిడిపికి ఉంది. ఈ నేపథ్యంలో స్థల కేటాయింపు వ్యవహారంపై కొద్దికాలంగా చర్చ సాగుతోంది. స్థలం కేటాయించేది తెలుగుదేశం పార్టీ, లబ్ధి పొందేది బిజెపి అని దీన్ని తాము ఏ మాత్రమూ సహించేది లేదని ఆ నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పార్టీ జిల్లా శాఖకు సమాచారం ఇచ్చారు. దీనిపై టిడిపి కూడా చూసీచూడనట్లు వ్యవహరించింది. ఇటీవల ఆ స్థల కేటాయింపుపై తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో చర్చ సాగుతుండగా స్వల్ప వాగ్వివాదం ఏర్పడింది.

ఈ క్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మంత్రిననే విషయాన్ని మరచి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని మాణిక్యాలరావు కూడా హెచ్చరించారు. ఆఫ్ట్రాల్ అనడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. అంతటితో ఆగకుండా తాను తలుచుకుంటే కట్ చేస్తానని హెచ్చరించారు. కట్ చేస్తాననే మాటను టిడిపి నాయకులు తీవ్రంగా పరిగణించారు. ఏం కట్ చేస్తారో చెప్పాలని నిరసనకు దిగారు. ఈ వ్యవహారం టిడిపి, బిజెపి మధ్య వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోడీని ఢిల్లీలో కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రానికి నిధులివ్వాలని కేంద్రంలో తమను కోరుతూ ఇక్కడ తిడతారా అంటూ మాణిక్యాలరావు మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వ్యవహారం కావడంతో రాజకీయంగా మరింత వేడెక్కింది. చివరికి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకున్నారు. వివాదాన్ని ఆపాలని, అనవసర వ్యాఖ్యలు, టిడిపి, బిజెపి మధ్య వివాదం రేపే వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంత్రి మున్సిపల్ ఛైర్మన్ వ్యాఖ్యలపై నిజానిజాలు తేల్చేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పశ్చిమగోదావరి జడ్పీ ఛైర్మన్ బాపిరాజు, ఎమ్మెల్యే వర్మ సభ్యులుగా ఉన్నారు. వెంటనే విచారించి వెంటనే నివేదిక ఇవ్వాలని సిఎం వారిని ఆదేశించారు. అనవసరంగా మాట్లాడితే పార్టీపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్‌ను హెచ్చరించారు. దీనిపై తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ స్పందించారు.

తమను ఆఫ్ట్రాల్ కౌన్సిలర్లని మంత్రి వ్యాఖ్యానించినందువల్లే తాను కూడా మాట్లాడాల్సి వచ్చిందని, అయితే ఆఫ్ట్రాల్ అనలేదని, ఆఫ్టర్ ఫొటోగ్రాఫర్ అని మాత్రమే అన్నానని.. చెప్పుకొచ్చారు. టిడిపికి ఎక్కువ మంది ఎమ్మెల్యేలను అందించిన పశ్చిమగోదావరి జిల్లాలో ఈ వ్యవహారం జరగడంతో రాజకీయంగానూ ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు.

అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక

'జువ్వ' మోషన్ పోస్టర్ ఆవిష్కరణలో చిరంజీవి



రంజిత్, భరత్, చిరంజీవి, పాలక్ లల్వానీ, త్రికోటి పేట తదితరులు

'ఈ రోజు 'జువ్వ' ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌లను విడుదల చేయడం ఆనందంగా ఉంది. హీరో రంజిత్, ప్రొడ్యూసర్ భరత్ అన్నదమ్ములు. వీళ్ల నాన్నతో నాకు మంచి పరిచయం ఉంది. స్వతహాగా భరత్ డాక్టర్. సాధారణంగా డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యామనే మాటలు వింటుంటాం. కానీ తమ్ముడి కోసం డాక్టర్ భరత్ ప్రొడ్యూసర్ అయ్యాడు. ఆ విధంగా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలబడింది" అని చిరంజీవి అన్నారు. రంజిత్, పాలక్ లల్వానీ జంటగా నటిస్తున్న సినిమా 'జువ్వ'. 'దిక్కులు చూడకు రామయ్య' ఫేమ్ త్రికోటి పేట దర్శకత్వం వహించారు. ఎస్.వి. రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్‌పై డా. భరత్ సోమి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌లను శనివారం చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ఆవరణలో మెగాస్టార్ విడుదల చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపించాడు. క్యారెక్టర్ పరంగా పక్కా మాస్ అని అర్థమవుతోంది. హీరోయిన్ పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపించింది. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ సినిమాను వీళ్లిద్దరి కోసం తప్పకుండా చూస్తా. 'దిక్కులు చూడకు రామయ్య' తర్వాత దర్శకుడు త్రికోటి మరో హిట్ అందుకోవాలని కోరుకుంటున్నా" అని అన్నారు.

హీరో రంజిత్ మాట్లాడుతూ "చిరంజీవి నటన అంటే నాకెంతో ఇష్టం. నా రోల్ మోడల్, స్ఫూర్తి కూడా చిరంజీవే. ఆయనతో ఒక్క ఫొటో దిగితే చాలు అనుకునేవాడిని. ఈరోజు నేను హీరోగా పరిచయమవుతున్న సినిమా టీజర్‌ను ఆయన విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు. ప్రేమకథతో రూపొందిన ఈ సినిమాలో అని చిన్న చిన్న థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయని త్రికోటి చెప్పారు. షూటింగ్ పూర్తయిందని ఈనెలాఖరున ఆడియో, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని వెల్లడించారు నిర్మాత భరత్.

అందుకే మీసాలు తీసేశా

మొన్నటి వరకు గుబురు మీసాలు, పెరిగిన గడ్డంతో కొత్తలుక్‌లో కన్పించిన చిరంజీవి ఒక్కసారిగా క్లీన్‌షేవ్‌తో కనిపించి అందరికీ షాక్ ఇచ్చాడు. ఆయన హీరోగా 'సైరా నరసింహారెడ్డి' తెరకెక్కుతోంది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని చరణ్ నిర్మిస్తున్నాడు. నయనతార, అమితాబ్ బచ్చన్, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్‌ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. సంక్రాంతి సందర్భంగా షూటింగ్‌కు విరామం ఇచ్చారు. ఇప్పుడు మీసాలు, గడ్డాలు చిరంజీవి తీసేయడంపై చాలా పుకార్లు షికారు చేశాయి. అసలు క్లీన్‌షేవ్‌కు కారణం ఏంటో స్వయంగా చిరునే ప్రకటించాడు. 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో ఒక గ్రాఫిక్ షాట్ ఉందట. ఆ షాట్ కోసం తప్పనిసరిగా మీసాలు, గడ్డం తీసేయ్యాల్సిందేనట. అవి తీస్తేనే షాట్‌కి అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఉందనీ అందుకే తీయాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు చిరంజీవి. వచ్చే షెడ్యూల్ ఫిబ్రవరిలో ఉంటుందని ఉంటుందని ఆయన తెలిపారు.



చిరంజీవి

ఛాయిస్ ఈజ్ యువర్స్



'గాయత్రి'లో మోహన్ బాబు

మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటించిన 'గాయత్రి' చిత్రం టీజర్ విడుదలైంది. హై ఇంటెన్సిటీతో కూడిన మోహన్ బాబు అప్పీరెన్స్, ఆయన నుంచి అభిమానులు కోరుకునే డైలాగ్స్ చిత్రంలో ఆశించవచ్చని టీజర్ చెప్పగనే చెబుతుంది. "రామాయణంలో రాముడికి, రావణాసురుడికి గొడవ. మహాభారతంలో పాండవులకు, కౌరవులకు మాత్రమే గొడవ. వాళ్ళు వాళ్ళు కొట్టుకుని ఎవరో ఒకరు చనిపోయుంటే బాగుండేది. కానీ వాళ్ళ మూలంగా జరిగిన యుద్ధంలో అటు ఇటు కొన్ని లక్షల మంది సైనికులు చనిపోయారు. పురాణాల్లో వాళ్ళు చేసింది తప్పయితే, ఇక్కడ నేను చేసింది కూడా తప్పే.. అక్కడ వాళ్ళు దేవుళ్లయితే ఇక్కడ నేనూ దేవుడినే. అర్థం చేసుకుంటారో అపార్థం చేసుకుంటారో..ఛాయస్ ఈజ్ యువర్స్." అని మోహన్ బాబు పలికిన డైలాగ్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఫిబ్రవరి 9న విడుదల కానున్న ఈ చిత్రంలో విష్ణుమంచు ఓ పాత్రలో కనిపించనున్నారు. శ్రియ ఆయన సరసన నటిస్తుంది. బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి, నిఖిల విమల్, అనసూయ భరద్వాజ్ ఇతర పాత్రలలో కనిపించనున్నారు. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పై మోహన్ బాబు నిర్మిస్తున్నారు.



శ్రియ

మురికివాడ...రేకుల షెడ్

శ్రియకు ఈ మధ్య అవకాశాలు పెరుగుతున్నాయి. గత ఏడాది 'గౌతమిపుత్ర శాతకర్ణి', 'పైసా వసూల్'లో కథానాయికగా చేసింది. ప్రస్తుతం 'గాయత్రి'లోనూ మంచు విష్ణుకు భార్యగా నటిస్తుంది. ఇవి కాకుండా తమిళ్, హిందీ చిత్రాల్లో చేస్తుంది. తాజాగా మరో తెలుగు సినిమా చిత్రం చేసేందుకు అంగీకరించింది. ఇందులో ఆమె ఇది వరకూ చేయని పాత్రలో మెప్పించబోతుంది. మురికి వాడలో.. రేకుల షెడ్‌లో నివసించే ఓ సాధారణ మహిళా పాత్రలోనూ, అందులోనూ అమాయకంగా ఉండే వ్యక్తిగా ఆమె కనిపించబోతుంది. ఈ సినిమా మొత్తం ఈమె పాత్ర ఆధారంగా నడుస్తుందట. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రంతో సుజన అనే వ్యక్తి దర్శకుడిగా పరిచయం కానున్నారు. "మేము ఇప్పటికే స్టోరీ బోర్డు సిద్ధం చేసేశాం. త్వరలో ప్రత్యేకంగా సెట్ వేసి మార్చిలో సినిమా షూటింగ్ ప్రారంభిస్తాం' అని దర్శకుడు చెప్పాడు. ఇళయరాజా ఈ చిత్రానికి బాణీలు సమకూర్చనున్నారు. విఎస్ జ్ఞాన శేఖర్ సినిమాటోగ్రాఫర్. సాయి మాధవ్ బుర్రా మాటలు అందిస్తున్నారు.

పండగ మాట

పాశ్చాత్య పోకడలు పెరిగాయి



"సంక్రాంతి పండగ అనగానే గుర్తుకొచ్చేది రైతులే. ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఇంటికి తీసుకువచ్చి కుటుంబంతో కలిసి ఆనందంగా ఉండే రోజు సంక్రాంతి. ఊరిలోని ఇళ్లన్నీ పేడలతో అలికి గొబ్బెమ్మలతో తీర్చిదిద్దుతారు. ఇంటి గుమ్మాలకు తోరణాలతో కళకళలాడుతాయి. పిల్లల కేరింతలకు అవధులుండవు. రకరకాల పిండివంటలను ఆరగించి, కొత్త అల్లుళ్ళను ఆహ్వానించి కొత్తబట్టలు పెట్టి, మరదల్లు సరదాలు ఆడే రోజే ఈ పండగ. హరిదాసుల పాటలతో కోయిల కూయలలో పక్షుల కిలకిలరావాలతో ఊరంతా పండగ వాతావరణం నెలకొనేది ఈనాడే. ఇక కుటుంబమంతా కాలక్షేపానికి సినిమాలు చూసే సమయం కూడా ఇదే. అందుకే రైతు కుటుంబం', 'పాడిపంటలు', 'సంక్రాంతి సంబరాలు', 'ఉమ్మడి కుటుంబం'... వంటి ఎన్నో చిత్రాలు వచ్చేవి. కానీ నేడు పాశ్చాత్య సంస్కృతితో సాంకేతిక పేరుతో వచ్చిన పోకడలతో అటువంటి సినిమాలకు ఆదరణ లభించడం లేదు. అందువల్ల యువత పేరుతో ప్రేమచిత్రాలతో పలకరించాల్సివస్తుంది.

– పరుచూరి గోపాలకృష్ణ

పబ్ సంస్కృతి సంప్రదాయమైంది



సంక్రాంతినాడు చక్కటి పల్లె వాతావరణంతో వచ్చే చిత్రాలు తగ్గిపోయాయి. ఒకవేళ అటువంటి చిత్రాలు వచ్చినా ఆదరణ చూరగొనలేకపోతున్నాయి. యూత్ చిత్రాల పేరుతో పబ్ కల్చర్ నేపథ్యంలో వస్తున్న సినిమాలకే పెద్ద పీట వేస్తున్నారు. రైతును గౌరవించే రోజులు సన్నగిల్లాయి. సినిమాల పోకడలు మారాయి. పబ్ కల్చర్ సంప్రదాయంగా వచ్చేసింది. అందుకే సంక్రాంతి తరహా చిత్రాలు తీసేవారు తగ్గారు. కొద్దికాలం వరకు పండగ నేపథ్యంలో ఒకటి అరా చిత్రాలు వచ్చేవి. 'సోగ్గాడే చిన్ని నాయనా', 'శతమానంభవతి' వంటి చిత్రాలు వచ్చాయి. ఈసారి అస్సలు లేనేలేవు. రానురాను అవి మృగ్యమైపోతున్నాయి."

– టి.సుబ్బరామిరెడ్డి

మా 'రంగులరాట్నం' సంక్రాంతి పొంగలి




శ్రీచరణ్, శ్రీ రంజని, నాగార్జున, సితార, రాజ్ తరుణ్, చిత్రా శుక్ల, ప్రియదర్శి

"రంగుల రాట్నం' మా అన్నపూర్ణ వాళ్ల వడ్డించే సంక్రాంతి పొంగలి అని మేం అనుకుంటున్నాం. నేను సినిమా చూశాను. మా సినిమా ఇది. బొబ్బట్టులాగా ఉంటుంది. చాలా తీపిగా బావుంటుంది. ఒక రియల్ ఫిల్మ్ ఇది. రియల్ అంశాలతో తీసిన సినిమా. తల్లీకొడుకుల మధ్య ఎమోషన్స్, ఒక కుర్రాడికి, అతనికి కాబోయే భార్యకు మధ్య వచ్చే సన్నివేశాలను చూస్తుంటే నా కళ్ల ముందే పాత్రలన్నీ కదులుతున్నట్టు అనిపించింది. లక్కీగా నాకు సంక్రాంతికి డేట్ దొరికింది" అని నాగార్జున అన్నారు. గత ఏడాది 'రారండోయ్ వేడుక చూద్దాం', 'హలో' వంటి హిట్ చిత్రాలను అందించింది సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్. తాజాగా రాజ్‌తరుణ్ హీరోగా, చిత్ర శుక్లా హీరోయిన్‌గా తెరకెక్కించిన చిత్రం 'రంగులరాట్నం'. శ్రీరంజని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఈ ఆదివారం ఈ చిత్రం విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.

నాగార్జున మాట్లాడుతూ "సినిమాను నెల రోజుల క్రితమే రెడీ చేసి పెట్టాం. సంక్రాంతికి లక్కీగా డేట్ దొరికేసరికి ఫ్రీజ్ చేశాం. ఫ్యామిలీస్ అందరూ కలిసి చూడదగ్గ సినిమా. నవ్వుకుంటూ, అప్పుడప్పుడూ కొంచెం కంటతడి పెడుతూ ప్రేక్షకులు చూస్తారు. నాకు ఈ సినిమా కథ ఏడాది క్రితం చెప్పారు. ఏడాదిలో ఇంకో వంద కథలు వినుంటాను. అప్పుడు విని బావుంది ఈ కథ అని మా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుప్రియకి చెప్పాను. చేయొచ్చు అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. అయితే ఆ తర్వాత కథని మర్చిపోయాను. రీసెంట్‌గా సినిమాను ప్రేక్షకుడిగానే చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. శ్రీరంజనికి దర్శకురాలిగా తొలి చిత్రమిది. సినిమాను అనుభవం గల డైరెక్టర్‌గా బాగా తెరకెక్కించింది. మేం రాజ్‌తరుణ్‌తో 'ఉయ్యాల జంపాల' చేశాం. తను నేచురల్ యాక్టర్. ఒక సీన్‌లో తల్లిని ప్రేమించే అబ్బాయిలాగా బిత్తరచూపులతో చేశాడు. నాకు రకరకాల విషయాలు గుర్తొచ్చాయి. అతని యాస ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. మా నాయిక చిత్ర సినిమాలోనూ చాలా అందంగా ఉంది. సినిమాలో అందరూ రియల్‌గా ఉన్నారు. అదే నాకు చాలా బాగా నచ్చింది. ఈ సంక్రాంతికి స్వీట్ లవ్లీ ఫిల్మ్ అవుతుంద'ని చెప్పారు.

రేపే ఫస్ట్‌లుక్



మహేష్ బాబు

మహేష్ బాబు ఫ్యాన్స్ ఒత్తిడితో 'భరత్ అనే నేను' చిత్రం టీమ్ తన నిర్ణయాన్ని మార్చుకున్నట్టు తెలిసింది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను చిత్రం రిలీజ్‌కు ముందే విడుదల చేయాలని మొదట భావించారు. కానీ పండక్కి ఫస్ట్‌లుక్ తీసుకురావాలని ఫ్యాన్స్ డిమాండ్ చేయడంతో సోమవారం మహేష్ బాబు లుక్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ప్రస్తుతం హైదరాబాద్‌లోని శంకరపల్లిలో చిత్రీకరణ జరుగుతోంది. కొరటాల శివ దర్శకత్వం. కైరా అద్వాని కథానాయిక. ప్రకాశ్ రాజ్, పోసాని కృష్ణమురళీ కీలకపాత్రలో నటిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.

అడివి శేష్ 'గూఢచారి'

నటుడు – రచయిత అడివి శేష్ హీరోగా చేస్తున్న కొత్త చిత్రం 'గూఢచారి'. సంక్రాంతిని పురస్కరించుకుని శనివారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'క్షణం', 'అమీ తుమీ' వంటి విభిన్న చిత్రాలతో విజయం అందుకున్న అడివి శేష్ ఈ సారి స్పై థ్రిల్లర్‌లో నటిస్తున్నాడు. శశికిరణ్ తిక్క ఈ చిత్రానికి దర్శకుడు. తుపాకులు, బులెట్ లతో అధునాతనంగా డిజైన్ చేయబడిన 'గూఢచారి' ఫస్ట్ లుక్ పోస్టర్ చిత్రంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇందులో అడివి శేష్ గూఢచారిగా కనిపిస్తారు. శోభిత ధూళిపాళ హీరోయిన్‌గా నటిస్తుంది. అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీం మర్చంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వేసవికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



'గూఢచారి'లో అడివి శేష్

27న కాకతీయ కళా వైభవ మహోత్సవం



పద్మజ, సుజాత, డి. సుబ్బరామిరెడ్డి, మోహన్ బాబు, పరిచూరి గోపాలకృష్ణ, విజయ్ కుమార్

కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే విధంగా 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' నిర్వహించనున్నట్టు టి. సుబ్బరామిరెడ్డి శనివారం తెలిపారు. టీఎస్సార్ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్‌లో ఈ వేడుక జరపనున్నట్టు ఆయన తెలిపారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ– "కాకతీయుల పరిపాలన స్వర్ణయుగం. 600 ఏళ్ల క్రితమే తెలుగు సంస్కృతి, నాగరికతలు ఘనంగా చాటారు. కళల్ని పోషించారు. ఎన్నో గొప్ప దేవాలయాలను శిల్పకళా నైపుణ్యం, చాతుర్యంతో నిర్మించారు. శ్రీకష్ణదేవరాయల కంటే ముందు నుంచి తెలుగుజాతికి వారసత్వాన్ని అందించారు. వరంగల్ రాజధానిగా 300 ఏళ్ల తెలుగువారిని పరిపాలించారు. వాళ్ల పేరు మీద 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ నెల 17న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈ వేడుక నిర్వహిస్తాం. మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు వేడుకను ప్రారంభిస్తారు. ఈ వేడుకలోనే సుమారు 560 చిత్రాల్లో నటించి, చిత్రపరిశ్రమలో 42 ఏళ్లు పూర్తి చేసుకున్న మోహన్ బాబును 'విశ్వ నట సార్వభౌమ' బిరుదుతో సత్కరిస్తున్నాం. పలువురు ఆధ్యాత్మిక, రాజకీయ, సినీ, సాంస్కృతిక ప్రముఖులు ఈ మహోత్సవానికి హాజరు కానున్నారు. తర్వాత తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో రెండు మూడు నెలలకు ఒకసారి కాకతీయ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహిస్తాం" అని అన్నారు.

మోహన్ బాబు మాట్లాడుతూ "కళాకారులను, కళలను గౌరవించే వ్యక్తుల్లో సుబ్బరామిరెడ్డి ముందుంటారు. కాకతీయుల కళా వైభోగాన్ని ప్రజలకు చాటి చెప్పాలనుకోవడం అభినందనీయం. నాకు ఇవ్వనున్న 'విశ్వ నట సార్వభౌమ' బిరుదు గురించి ముందు చెప్పగానే... 'బిరుదులు నాకు ఎందుకు?' అన్నాను. వద్దని విశాఖలో చెప్పాను. మళ్లీ ఇప్పుడు ఇస్తున్నట్టు చెప్పారు. దాంతో ఆయన అభీష్టాన్ని కాదనలేకపోయా" అని చెప్పారు. పరుచూరి గోపాలకృష్ణ, 'లయన్ క్లబ్' సభ్యులు, 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కూచిపూడి నత్య కళాకారిణిలు పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

బాలకృష్ణ అంటే భయపెట్టారు

– కె.ఎస్.రవికుమార్

'బాలకృష్ణతో సినిమా చేస్తానని చెప్పినప్పుడు కొందరు బాలకృష్ణకు కోపం ఎక్కువ అన్నారు. కానీ నేను సినిమా చేస్తున్నప్పుడు అలాంటి సందర్భాలు రాలేదు. చిత్రీకరణలో నేను ఎలా చెప్పానో అలాగా ఆయన చేసేవారు. ఇది ఎందుకు? మార్చండి అని ఏనాడూ చెప్పలేదు' అని దర్శకుడు కె.ఎస్. రవికుమార్ అన్నారు. బాలకృష్ణ హీరోగా చేసిన 'జై సింహా'కు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆదరణ పొందుతున్న దృష్ట్యా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు వేగంగా చిత్రాలు రూపొందించే దర్శకుడిగా పేరుందనీ, ఈ వేగాన్ని మరింతగా పెంచుతానని పేర్కొన్నారు. ఈ సినిమాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. "జైసింహా'కు మంచి స్పందన వస్తోంది. సంతోషంగా ఉంది. బాలకృష్ణకు ఇలాంటి విజయాలు రావాలి. ఇక నయనతార, ప్రకాష్‌రాజ్ తమ పాత్రలను చక్కగా పోషించారు. చిన్న పిల్లాడి పాత్ర కూడా ప్రేక్షకులకు బాగా నచ్చుతోంది. సంగీత దర్శకుడు చిరంతన్ భట్ మంచి స్వరాలు అందించారు. భవిష్యత్‌లో మరింత వేగంగా సినిమాలు చేస్తాను. త్వరలో కొత్త చిత్రం గురించి వివరిస్తాన'ని తెలిపారు.



కొత్త పంథాలో నిరసన స్వరం

సాధారణంగా యువతంతా కలిస్తే, ఏంచేస్తారూ? అంటే... ఎంతోమందికి రకరకాల ఊహాగానాలుంటాయి. చదువుల గురించి చర్చించుకుంటారు... భవిష్యత్తు ఆలోచనల్లో మునిగితేలుతారు... ఏ పార్టీలోనో ఎంజాయ్ చేస్తుంటారు... కాసేపలా సేదతీరి, ముచ్చట్లాడుకుంటారు... ఇలా ఎన్నెన్నో ఊహల్లో మునిగిపోయిన వారి అపోహలను ఈ యువత పటాపంచలు చేసింది. మధ్యప్రదేశ్ గ్వాలియార్ నుంచీ వీళ్లు పోరాటం చేస్తున్నారు. కోట్లాది మహిళల తరపున గొంతువిప్పి మాట్లాడుతున్నారు. ఆడపిల్ల కనీస అవసరాలకు ఖరీదు కట్టి, విలాసవస్తువులగా పరిగణిస్తున్న రాజ్యంపై వినూత్నంగా నిరసన ప్రకటించారు.

కాలం కొందరిని మౌనంగా ఉండనివ్వదు. సమస్యల తరపున వాళ్లని ప్రశ్నించమంటుంది. అన్యాయం ఎక్కడ జరిగినా, సరిగ్గా అక్కడే నిలబడి ప్రశ్నల బాణాలను రువ్వమంటుంది. పరిస్థితుల తీరు సాధారణంగా నడవనప్పుడు, తిరిగి దారిలో పెట్టేందుకూ, సరైన బాటలో నడిపించేందుకూ వాళ్లను సిద్ధం చేస్తుంది. ఎప్పుడైతే కొన్ని గొంతులు కావాలో, ఎప్పుడైతే కొన్ని నినాదాలు తప్పనిసరి అవుతాయో, అప్పుడు వారి అడుగులు సమస్యల వైపుగా సాగుతాయి. ఆ పోరాటం ఎవరి మీదైనా సరే, న్యాయం కోసం నడుస్తూనే ఉంటారు. అలా నడుస్తూ, నడుస్తూ వారిలో యువతే ఎక్కువ తారసపడుతుంటారు. అలానే వీళ్లొచ్చారు. తమ నిరసన స్వరాన్ని వినిపిస్తున్నారు. తామేం చేయగలరో వీళ్లకు తెలుసు, దానికోసం వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. వీరేంటో, వీరి కథేంటో చూసొద్దాం పదండి.

వినూత్న నిరసన

శానిటరీ ప్యాడ్ల మీద పన్నుకు ఇప్పటికే దేశం నలుమూలల నుంచీ ఎంతగానో నిరసన వ్యక్తమైంది. కనీస అవసరాన్ని విలాసవస్తువుగా పరిగణిస్తూ రాజ్యం తీసుకున్న నిర్ణయానికి, అన్నింటికీ అతీతంగా ఎందరో తమ నిరసన స్వరాన్ని వినిపించారు. అయినా ఎలాంటి మార్పూ జరగలేదు. అయితే వీళ్లు మాత్రం ఇంకాస్త కొత్తగా ఆలోచించారు. నేరుగా ప్రధానికి తమనిరసన తెలిపేందుకు కొత్తపంథాను ఎంచుకున్నారు. దీనికి అక్కడి ప్రజలదే కాకుండా, అశేషంగా నెటిజన్ల స్పందనా తోడైంది. మరింత మంది వీరికి మద్దతుగా నిలబడుతున్నారు. బహిరంగ ర్యాలీలలో పాల్గొంటున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్లలో మరింత మందికి షేర్ చేస్తున్నారు.

ఇప్పటివరకూ దీనికి నిరసనగా ర్యాలీలు నిర్వహించారు. వ్యతిరేకతను తెలుపుతూ అనేకానేక చోట్ల సభలను నిర్వహించారు. ప్లకార్డులతో రోడ్ల మీద బహిరంగ ప్రదర్శనలూ ఇచ్చారు. అయితే వీరు ఇంకాస్త వినూత్నంగా ఆలోచించారు. ఈ అసంతృప్తినీ, వ్యతిరేకతనూ నిరసిస్తూ శానిటరీ ప్యాడ్లమీద నినాదాలుగా రాసి నేరుగా ప్రధానమంత్రి వరకూ చేరవేసే పనిలో పడ్డారు. ఆలోచన వచ్చిన వెంటనే మరికొంత మంది యువతను కూడగట్టారు. వెంటనే తమ ఆలోచనను మరింతమందికి చేరవేశారు. అనూహ్య స్పందన లభించింది. అక్కడి తోటియువత సైతం మేముసైతమంటూ చేతులు కలిపారు.

వెయ్యికి పైగా లేఖలు

వెయ్యిమందికి పైగా గ్రామీణ మహిళల అభిప్రాయాలనూ, నిరసననూ తెలుసుకుని వారి తరపున ఈ యువతే ఉత్తరాలను రాస్తున్నారు. ఇవి నేరుగా ప్రధాని వద్దకూ చేరేలా ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అయితే ఈ లేఖలన్నింటినీ శానిటరీప్యాడ్ల మీదనే రాయడంతో వీరు మరింత మంది దృష్టిని ఆకర్షించారు. ముందుగానే కొంత ప్రాచుర్యం రావడంతో ఎంతోమంది మహిళలు స్వచ్ఛందంగా తమ గొంతుని వినిపించారు. ముఖ్యంగా ఎంతోమంది గ్రామీణ మహిళలు ఇబ్బందులను ప్రస్తావించారు.

జీఎస్టీ మినహాయించే వరకూ...

అంతేకాదు, జీఎస్టీ పరిధిలోంచి శానిటరీ ప్యాడ్లను తప్పించాలని ఈ యువత రాష్ట్రమంతా తిరిగి సంతకాలు సేకరిస్తోంది. దీనికి గ్రామీణప్రాంతాల మహిళల నుంచి మరింత స్పందన వస్తోంది. మహిళా ఆరోగ్యానికి అత్యంత అవసరమైన శానిటరీప్యాడ్లపై జీఎస్టీని మినహాయించే వరకూ తాము ఏదో ఒకరూపంలో ఇలా నిరసన తెలుపుతామంటున్నారు ఈ యువత. అందుకోసం ఆఫీసూ, కాలేజీ సెలవుదినాల్లో చుట్టుపక్కల గ్రామీణప్రాంతలకు వెళ్తున్నారు. దీంతోపాటు పరిశుభ్రత మీద అవగహనా, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించుకోవడంపై శిక్షణా ఇస్తున్నారు. ఎక్కడ మా అవసరముంటే అక్కడ ఆగిపోతామనీ, పరిస్థితి చక్కదిద్దేవరకూ ఆ ప్రాంతం వారికి నిత్యం అందుబాటులో ఉంటామనీ నవ్వుతూ చెప్తోంది ఈ యువత.

ఇలా ఎప్పటికీ కొందరుంటారు. అందరి అపోహల అంచనాలను గిరాటు వేసి, యువత ఎలా ఉన్నారో అద్దంపట్టి చూపిస్తారు. ఎంతోమంది మహిళల కోసం, వారి కనీస అవసరాల కోసం, ఆరోగ్యం కోసం ఈ యువత వేసిన అడుగులు మరింత ముందుకు వెళ్లి, వీరు విజయం సాధించాలని కోరుకుందాం. వినూత్నంగా నిరసన తెలుపుతూ ముందుకెళ్తున్న వీరి భుజం తట్ట, ముందస్తు అభినందనలు తెలుపుదామా మరి. ★





ఆ జ్ఞాపకం అపురూపం

ప్రతిఒక్కరికీ కొన్ని జ్ఞాపకాలుంటాయి. తరచి చూసుకుంటే వాటిలో మరిన్ని కాలేజీడేస్‌లోనే తచ్చాడుతూ ఉంటాయి. తిరిగి తలుచుకున్నప్పుడల్లా మధురానుభూతులు మిగులుస్తాయి. స్వాగతం పలికిన కొత్తస్నేహాలూ, నూతన ప్రపంచమూ ఎప్పటికీ భుజంమీద చేయివేసి మాట్లాడుతూనే ఉంటాయి. గతాన్ని తలుచుకున్నప్పుడల్లా కొండంత ధైర్యం వస్తుంది. బిజీ జీవితానికి కొంత స్వాంతనా చేకూరుతుంది. ఈ రోటీన్ జీవితంలోంచి ఒకసారి మీ జ్ఞాపకాల్లోకి వెళ్లండి. కాలేజీలో వేసిన మొదటి అడుగు వరకూ పదండి...

ఎప్పటికీ ఆరోజు

ఆరోజు ఎప్పటికీ గుర్తుంటుంది. అప్పటివరకూ గడిచిన జీవితానికి, అప్పటి నుంచీ జీవించబోయే రోజులకూ కొద్దిపాటి తేడా కనబడుతుంది.



అది ఆరోజు నుంచే మొదలవుతుంది. కాలేజీ జీవితం మొత్తాన్నీ తరచి చూసుకుంటే ఎప్పటికీ కళ్ల ముందు ఆ తొలిరోజు కదిలాడుతూనే ఉంటుంది. ఓ కొత్త స్మేహితుని ఆలింగనం దొరుకుతుంది. అది జీవితాంతం తోడుగా నిలుస్తుంది. కొత్త ఉపాధ్యాయులూ జీవితంలోకి వస్తారు. రాబోయే రోజులకూ, చేయాల్సిన మిగతా ప్రయాణానికీ వారో మార్గాన్ని సూచిస్తారు. ఎన్నో ఏళ్లపాటు మన జీవతంలో మనతో ప్రయాణం చేసే వాళ్లు సరిగ్గా ఆరోజు మనకు దర్శనమిస్తారు.

తొలి విహారయాత్ర

కాలేజీ జీవితమంటేనే రకరకాల అనుభూతులుంటాయి. ఎన్నెన్నో కొత్తగా పరిచయమవుతూనూ ఉంటాయి. సినిమాలూ, షికార్లూ, చిన్నచిన్న అల్లర్లూ, కంబైన్డ్ స్టడీలూ, అప్పుడప్పుడూ విహారయాత్రలూ ఇలా ఎప్పటికప్పుడు ఏదో ఒక హడావుడి నడుస్తూనే ఉంటుంది. ఇలా ఎన్ని ఉన్నా, కాలేజీ స్నేహితులతో వెళ్లిన మొదటి విహారయాత్ర మాత్రం ఎప్పటికీ అపురూపంగా మిగిలిపోతుంది. ఈ సందర్భాన్ని ప్రతిఒక్కరూ అనుభవించినవారే. ఒకసారి కొద్దిరోజులు వెనక్కొచ్చి, మీ జీవితంలో గడిచిన పేజీలను వెనక్కితిప్పి, మొదటి విహారుయాత్ర వద్దకు రండి.

తొలి ఏడాది అవడంతో పెద్దగా ఎకడిమిక్ ఒత్తిడిలూ ఉండవు. మీ స్నేహితులందరితో ప్రతిక్షణాన్నీ ఆస్వాదిస్తూ చేసిన ప్రయాణమది. భవిష్యత్తు గురించి పెద్దగా ఆందోళనలేమీ లేని ఆ అపురూప క్షణాల్లో ఎంతో ఆనందం నిండిపోయి ఉంటుంది. ఆ యాత్రలో మీరు కొనుక్కున్న వస్తువునో, స్నేహితులకు ఇచ్చిన బహుమతినో, గవ్వల మీద చెక్కించుకున్న పేర్లనో, సముద్రం పక్కన చెప్పుకున్న ముచ్చట్లనో, ఇసుక గూళ్లనో ప్రత్యేకంగా గుర్తుచేయాల్సిన పనేమీవుండదు. బిజీ జీవితంలో ఆనందాలకు ఏమాత్రం తెరపడినా, ఓసారిలా గతానికి రండి, మీ అపురూప క్షణాలను తలుచుకుని వాటిలోకి మళ్లీ ప్రయాణం చేయండి. మీ కాలేజీ మిత్రుడితో కాసేపు మాట్లాడి, కులాసా ప్రశ్నలడిగి, గతాన్ని ఓసారి గుర్తుచేసుకోండి. ★





రైజ్ యువ[ర్] వాయిస్



వ్యవస్థలో మార్పు రావాలి అనే ఆశయంతో యువత నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రజల వద్దకు చేర్చే ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. మీ వాయిస్ పంపవలసినది : జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా joshprajasakti@gmail.com కు మెయిల్ పంపగలరు.

నైపుణ్యాన్ని పెంచేలా

యువతలో నైపుణ్యాన్ని పెంచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నామమాత్రంగా కాకుండా అసలైన నిరుద్యోగులకు ఉపయోగపడేలా ఉండాలి. యువతకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసుతులేవీ వారి వద్దకు చేరడం లేదు. ఎంతోమందికి వారికంటూ కొన్ని వసతులుంటాయన్న విషయమే తెలియదు. నేటి సమాజంలో యువత విద్యాభ్యాసం పూర్తిచేసిన తర్వాత ఉద్యోగం కోసం వెతుకులాటలో పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణప్రాంత యువతకు కమ్యూనికేషన్, ఇంగ్లీష్ భాష లోపం కనిపిస్తున్నాయి. వీరికోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. శిక్షణా తరగతులను పెంచాలి. అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. ఈ పరిస్థితిని పోగొట్టేందుకు ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి. ఎప్పుడైతే నిరుద్యోగులు లేని సమాజం సాధ్యమవుతుందో అప్పుడే ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.



ఎన్ అవినాష్ కుమార్,
ఓబుళదేవరచెరువు,
అనంతపురం జిల్లా

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...

పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



చిన్నారి

జత చేయండి!



పిల్లలూ..! పైనున్న బొమ్మలో కొన్ని డైనోసార్లు, పక్కన వాటి భాగాలున్నాయి... అవి ఎక్కడ పెట్టాలో జత చేయండి!

పొడుపు కథ

దేశానికి తండ్రి వారు
పోర్‌బందరు ఊరు
శాంతికి మారుపేరు
స్వతంత్ర్యాన్నిప్పించారు..?

జోక్ :

టీచర్ : రాజూ! ఒకకోడి రోజూ రెండు గుడ్లు పెడితే వారానికి ఎన్ని అవుతాయి.
రాజు : 12 గుడ్లు టీచర్
టీచర్ : అదెలా..?
రాజు : ఆదివారం సెలవు కదా టీచర్!


కథలు చెప్పే చిన్నారి!

పిల్లలూ! మీకు కథలంటే బోలెడంత ఇష్టం కదా! అదే మీ వయసు పాపే కథలు చెబుతుంటే మరీ కళ్లూ చెవుళ్లూ అప్పగించేసి వింటారు కదా! అయితే మీలాంటి ఈ చిన్నారి గురించి మీరు తెలుసుకోవాల్సిందే. ఆమె ఎనిమిదేళ్ల చిన్నారి పేరు 'షీరా జోసెప్సన్'. చిన్నవయసులోనే పెద్ద ఆలోచనతో హాస్పిటల్‌లో దీర్ఘకాలంగా చికిత్స తీసుకుంటున్న పిల్లలకు యూట్యూబ్ ద్వారా కథలు చెపుతోంది. కథలు రాస్తోంది. వారి కోసం విరాళాలు సేకరిస్తోంది. బాధను మర్చిపోయేలా చేసి, వారి జీవితాల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది.




పిల్లలు, పెద్దలు సాధారణంగా ఆనందం కోసం యూట్యూబ్‌లో సినిమాలు, వీడియోలు చూస్తారు. ఈమె మాత్రం అనారోగ్యం బారినపడిన చిన్నారుల ఒంటరితనాన్ని పోగొట్టేందుకు యూట్యూబ్‌ను ఉపయోగిస్తోంది. షీరా ఓసారి హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు రోజంతా మంచాలపైనే ఉంటున్న పిల్లలను చూసింది. చిన్న వయసులోనే అనారోగ్యం బారినపడి మంచాలకు పరిమితమైన తన ఈడు పిల్లలను చూసి ఆ చిన్నారి హృదయం తల్లడిల్లింది. వారికోసం ఏమైనా చేయాలనిపించింది. వారికి కథలు చెప్పి, సంతోష పరచాలనే ఆలోచన వచ్చింది. దీంతో యూట్యూబ్ వీడియోలు చేయటం ప్రారంభించింది. ఇందులో షీరా తల్లి బ్రూక్‌జోసెఫెన్ సహకారమూ ఆమెకు తోడైంది.





తనకు ఇష్టమైన కథల పుస్తకం తీసుకొని, షీరా వారానికోసారి సోఫాలో కూర్చుని బయటకు వినపడేలా కథలు చదివేది. అదే సమయంలో వీడియో ద్వారా రికార్డ్ చేస్తుంది. వాటిని 'షీరాస్ స్టోరీ కార్నర్' పేరుతో యూట్యూబ్‌లోని తన పేజీలో పోస్ట్ చేస్తుంది. హాస్పిటల్లో బెడ్‌పై ఉన్న చిన్నారులు యూట్యూబ్‌లో షీరా చదివే కథలను చూస్తూ ఆనందిస్తున్నారు. వారికి ఇదో మంచి కాలక్షేపంగా మారింది. పిల్లలు త్వరగా కోలుకుంటున్నారు. అయితే షీరా మాత్రం కేవలం కథలు చదవడం మాత్రమే కాదు. సొంతంగానూ కథలు రాస్తోంది. లాస్ ఏంజెల్స్ చిల్డ్రన్ హాస్పిటల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటూ దాని కోసం విరాళాలు సేకరిస్తోంది. ★

రంగులు వేయండి!



పిల్లలూ..! పైనున్న ఎద్దుల బండికి రంగులు వేయండి!

స్పిన్ తిరిగింది

దక్షిణాఫ్రికా 269/6

మార్క్రమ్ సెంచరీ మిస్


రవిచంద్రన్ అశ్విన్ 31-8-90-3

సెంచూరియన్ : భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ పట్టు బిగించింది. శనివారం తొలిరోజు ఆట ముగిసే దక్షిణాఫ్రికా ఆరు వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తొలి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. లంచ్ విరామానికి ఆ జట్టు వికెట్లేమీ కోల్పోలేదు. మర్క్రామ్ 94 పరుగులు, ఆమ్లా 82 పరుగులు అత్యధికంగా చేశారు. భారత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మూడు వికెట్లతో రాణించాడు. భారీ స్కోర్ సాధిస్తుందనుకున్న సఫారీ జట్టును అశ్విన్ తన స్పిన్ మాయాజాలంతో బురిడీ కొట్టించి టాప్‌ఆర్డర్ వికెట్ల నేలకూల్చాడు. దీంతో తొలిరోజు ఇరుజట్ల ఆధిపత్యం పోటాపోటీగా సాగింది. ఇప్పటికే ఆరు వికెట్లు నేలకూలడంతో దక్షిణాఫ్రికా భారత్ పట్టు బిగించినట్లయ్యింది. వన్‌డౌన్‌లో వచ్చిన హషీమ్ ఆమ్లా సెంచూరియన్ మైదానంలో అర్ధసెంచరీతో అలరించాడు. రవిచంద్రన్ అశ్విన్ వేసిన 63.3వ బంతిని కవర్స్‌లో బౌండరీకి తరలించి అర్ధసెంచరీని పూర్తి చేశాడు. వ్యక్తిగతంగా సెంచూరియన్‌లో ఆడిన 12 టెస్టుల్లోనే 1245 పైగా పరుగులు చేసి ఈ వేదికపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ వేదికలో గత ఆరు ఇన్నింగ్సుల్లో ఆమ్లా వరుసగా 208, 109, 96, 58, 1, 82 సాధించాడు. అంతకు ముందు ప్రమాదకరంగా కనిపించిన ఏబీ డివిలియర్స్ (20) ఇషాంత్ శర్మ ఆఫ్ సైడ్ దూరంగా వేసిన 62.4వ బంతిని ఆడబోయి ఇన్‌సైడ్ ఎడ్జ్ రూపంలో వెనుదిరిగాడు. బ్యాట్‌ను తాకిన తర్వాత బంతి పిచ్ అయి నేరుగా బెయిల్స్‌ను తాకింది. బంతి ఏ మాత్రం పైకి లేచినా అతడు బతికిపోయే వాడే! 65 ఓవర్లు ముగిసే సరికి దక్షిణాఫ్రికా మూడు వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ 24, మహరాజ్ 10 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

టీ విరామానికి దక్షిణాఫ్రికా 182/2

టీ విరామానికి దక్షిణాఫ్రికా జట్టు రెండు వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నిలకడగా ఆడుతున్న హషీమ్ ఆమ్లా (35) (77 బంతుల్లో ఆరు ఫోర్ల సాయంతో), 'మిస్టర్ 360' ఏబీ డివిలియర్స్ (16) (26 బంతుల్లో రెండు ఫోర్ల సాయంతో) క్రీజ్‌లో ఉన్నారు.

మార్క్రమ్ సెంచరీ మిస్

దక్షిణాఫ్రికాతో ఓపెనర్ మర్క్రమ్ (94) వరుస బౌండరీలతో శతకానికి దగ్గరలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పెవిలియన్‌కు పంపించాడు. అశ్విన్ వేసిన ఇన్నింగ్స్ 47.3వ బంతిని సరిగ్గా అంచనా వేయని మార్క్రమ్ ఆఫ్‌సైడ్ డిఫెన్స్ చేయబోయాడు. బ్యాట్ అంచును తాకుతూ బంతి కీపర్ పార్థివ్ పటేల్ చేతుల్లో పడింది. బంతి ప్యాడ్లను తాకిందనుకున్న మార్క్రమ్ అంపైర్‌ను సమీక్ష కోరాడు. అందులో బ్యాటును తాకినట్లు తేలడంతో మైదానం వీడాడు.

పాండ్యా మ్యాజిక్


టీ విరామం అనంతరం దక్షిణాఫ్రికా జట్టు వెంట వెంటనే రెండు వికెట్లు చేజార్చుకుంది. శతకానికి చేరువైన హషీమ్ ఆమ్లా (82) (153 బంతుల్లో 14 ఫోర్ల సాయంతో) అనూహ్యంగా ఔటయ్యాడు. పాండ్యా వేసిన 80.5వ బంతిని ఆమ్లా ఆడుతూ క్రీజుకు దగ్గర్లోనే ఉన్నా లేని పరుగుకోసం ప్రయత్నించే క్రమంలోనే బాల్‌ను అందుకున్న పాండ్యా నాన్‌స్ట్రైకర్ వైపు అద్భుతంగా వికెట్లపైకి విసిరాడు. దీంతో ఆమ్లా వెనుతిరగక తప్పలేదు. ఆ తర్వాత ఓవర్ తొలి బంతికే వికెట్ కీపర్ డికాక్ (0) డకౌట్ అయ్యాడు. అశ్విన్ వేసిన బంతిని బంతికి స్లిప్‌లో కోహ్లీకి చిక్కాడు. 82 ఓవర్లు ముగిసే సరికి ఆతిథ్య జట్టు ఐదు వికెట్ల నష్టపోయి 250 పరుగులు చేసింది.

పార్థివ్ పటేల్ అరుదైన రికార్డు



దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియాలో అనూహ్యంగా చోటు దక్కించుకున్న కీపర్ పార్థివ్ పటేల్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లలో అత్యంత సీనియర్ పార్థివ్ పటేలే. ప్రస్తుతం పార్థివ్ వయసు 32 ఏళ్లు. 17 ఏళ్ల వయసులో 2002లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి 2004లో విదేశీ గడ్డపై తొలి టెస్ట్ ఆడాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లలో ఏ ఒక్కరూ అప్పటికి ఇంకా అరంగేట్రం చేయలేదు. ఫలితంగా ప్రస్తుత జట్టులో పార్థివ్ అత్యంత సీనియర్‌గా నిలిచాడు.

మూడు మార్పులు చేసిన కోహ్లి



భారత కెప్టెన్ విరాట్ కోహ్లి రెండో టెస్ట్‌కోసం మూడు మార్పులు చేశాడు. ఓపెనర్ శిఖర్ ధావన్ స్థానంలో కెఎల్ రాహుల్‌ను, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా స్థానంలో పార్థివ్ పటేల్‌ను, స్వింగ్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ స్థానంలో ఇషాంత్ శర్మలకు తుదిజట్టులో స్థానం లభించింది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో టీమిండియా ఓడిపోయిన అనంతరం తుది జట్టు ఎంపికపై మాజీ క్రికెటర్లు పెదవి విరిచారు. సఫారీ పిచ్‌లపై మంచి బ్యాటింగ్ రికార్డు ఉన్న అజింక్య రహానేకు ఈ మ్యాచ్‌లో మొండిచెయ్యి లభించింది. రోహిత్ శర్మను కొనసాగించడానికి కోహ్లి మొగ్గు చూపాడు. గత ఏడాది చివర్లో శ్రీలంకతో ముగిసిన సిరీస్‌లో రోహిత్ శర్మ మెరుగ్గా రాణించిన విషయం తెలిసిందే.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్

ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్	31
మార్క్రామ్ (సి) పార్థివ్ పటేల్ (బి) అశ్విన్	94
హషీమ్ ఆమ్లా (రనౌట్) పాండ్యా	82
డివిలియర్స్ (బి) ఇషాంత్	20
డుప్లెసిస్ (నాటౌట్)	24
డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్	0
ఫిలాండర్ (రనౌట్) పార్థివ్/పాండ్యా	0
మహరాజ్ (నాటౌట్)	10
అదనపు పరుగులు	8
మొత్తం (90 ఓవర్లలో) 6 వికెట్ల నష్టానికి	269


మార్క్రామ్


హషీమ్ ఆమ్లా

బౌలింగ్ :

బుమ్రా	18-4-57-0
షమి	11-2-46-0
ఇషాంత్ శర్మ	16-3-32-1
హార్దిక్ పాండ్యా	14-4-37-0
రవిచంద్రన్ అశ్విన్	31-8-90-3

నేడు పిబిఎల్ ఫైనల్

ఉత్కంఠపోరులో బెంగళూరు బ్లాస్టర్స్ గెలుపు



హైదరాబాద్ : గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ ఫైనల్ జరగనుంది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో బెంగళూరు బ్లాస్టర్స్ జట్టు 4-3 పాయింట్ల తేడాతో అహ్మదాబాద్ స్మాషర్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ను 15-2, 14-15, 15-10తో సమీర్ వర్మ(అహ్మదాబాద్) గెలిచి 1-0 ఆధిక్యతను చేకూర్చాడు. పురుషుల డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌ను బెంగళూరు 15-13, 15-12తో గెలిచి 2-1 ఆధిక్యతలో నిలిచింది. మహిళల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో అహ్మదాబాద్ 15-8, 13-15, 8-15తో విజయం సాధించి 3-2 ఆధిక్యతలో నిలిచింది. పురుషుల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ వన్ అక్సెల్‌సన్ (బెంగళూరు) 15-11, 15-14తో గెలిచి 3-3తో స్కోర్‌తో ఇరుజట్లు సమంగా నిలిచాయి. నిర్ణయాత్మకమైన మిక్స్‌డ్ డబుల్స్‌లో బెంగళూరు జోడీ 15-12, 13-15, 15-9తో అహ్మదాబాద్ బ్లాస్టర్స్ జోడీపై విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. ఆదివారం హైదరాబాద్ హంటర్స్‌తో బెంగళూరు బ్లాస్టర్స్ జట్టు టైటిల్‌పోరుకై తలపడనున్నాయి.

ఐపిఎల్ వేలానికి 1122 మంది క్రికెటర్లు..!



న్యూఢిల్లీ : ఈనెల 27, 28 తేదీలలో జరిగే ఐపీఎల్ వేలంలోకి టాప్ క్రికెటర్లు వచ్చేశారు. టోర్నీలోని ఎనిమిది ఫ్రాంఛైజీలు తమవద్ద నిలుపుకున్న ఆటగాళ్ల వివరాలను ఇప్పటికే బీసీసీఐకి సమర్పించగా.. మిగిలిన క్రికెటర్లతో కూడిన జాబితాను శనివారం బీసీసీఐ విడుదల చేసింది. ఇందులో యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, రవిచంద్రన్ అశ్విన్, అజింక్య రహానె, కుల్దీప్ యాదవ్, కేఎల్ రాహుల్, మురళీ విజయ్ తదితర భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు ఉన్నారు. మొత్తం 1122 మంది క్రికెటర్లు ఐపీఎల్ వేలానికి తమ సమ్మతి తెలుపుతూ పేర్లను నమోదు చేసుకున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. బెంగళూరు వేదికగా ఈ నెలాఖరులో వేలం జరగనుంది. జాబితాలో 281 మంది అంతర్జాతీయ ఆటగాళ్లు, 838 మంది ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి ఇంకా అరంగేట్రం చేయని క్రీడాకారులుండగా... మొత్తంగా భారత్ నుంచే 778 మంది వేలంలోకి రావడం విశేషం. ఆస్ట్రేలియా నుంచి 58 మంది, దక్షిణాఫ్రికా (57), శ్రీలంక, వెస్టిండీస్ నుంచి 39 మంది చొప్పున వేలంలోకి రానున్నారు. న్యూజిలాండ్ (30), ఇంగ్లాండ్ (26) ఆటగాళ్లు కూడా గతంతో పోలిస్తే.. ఈ ఏడాది ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నట్లు జాబితా స్పష్టం చేస్తోంది. క్రిస్‌గేల్, మాక్స్‌వెల్, ఆమ్లా, కేన్ విలియమ్సన్, కొలిన్ మన్రో, టామ్ లాథమ్, రబాడ తదితరులు వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

అండర్-19 వరల్డ్‌కప్

నేడు ఆసీస్‌తో యువభారత్ ఢీ

బే ఓవల్ (న్యూజిలాండ్) : అండర్-19 వరల్డ్‌కప్‌లో భాగంగా యువభారత్ జట్టు ఆదివారం పటిష్టమైన ఆస్ట్రేలియాతో తొలిమ్యాచ్ ఆడనుంది. మూడుసార్లు ట్రోఫీ విజేతలైన భారత్, ఆస్ట్రేలియా జట్లు గ్రూప్-బి నుండి తలపడనున్నాయి. పృథ్వీ షా సారథ్యంలోని భారత జట్టుకు రాహుల్ ద్రావిడ్ పర్యవేక్షణలో పటిష్టంగా ఉంది. ఆస్ట్రేలియా యువజట్టుకు జాసన్ సంఘా సారథ్యం వహిస్తున్నాడు.

పాకిస్తాన్‌కు షాక్...

తొలిమ్యాచ్‌లో పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ చేతిలో 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ యువజట్టు 47.3 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 194 పరుగులు మాత్రమే చేసింది. పాకిస్తాన్ ఆ లక్ష్యాన్ని చేరుకోలేక 188 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ డార్విష్ రసూలి (ఆఫ్ఘనిస్తాన్)కు లభించింది.

వర్షం కారణంగా (20 ఓవర్లకు కుదింపు)...
పపువానేనియా - 95 ఆలౌట్ (20 ఓవర్లలో)
జింబాబ్వే - 98/0 (14 ఓవర్లలో)
మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విశ్లే మధవేరా (జింబాబ్వే)

బంగ్లాదేశ్ - 190/4 (20 ఓవర్లలో)
నమీబియా - 103/6 (20 ఓవర్లలో)
మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సైఫ్ హసన్ (బంగ్లాదేశ్ 84 పరుగులు)

ఆదివారం జరిగే ఇతర పోటీలు...
శ్రీలంక × ఐర్లాండ్ (గ్రూప్-డి)
దక్షిణాఫ్రికా × కెన్యా (గ్రూప్-ఎ)

అంధుల ప్రపంచకప్ భారత్‌కు మరో విజయం

దుబాయ్ : ఐదవ అంధుల ప్రపంచకప్ క్రికెట్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. శనివారంనాడిక్కడ బంగ్లాదేశ్‌తో తలపడిన భారతజట్టు 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు 40 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని భారత అంధుల జట్టు వికెట్ నష్టపోకుండా 18.3 ఓవర్లలో సాధించింది. రెడ్డి 60 బంతుల్లో 101 పరుగులు, రమేష్ 57 బంతుల్లో 105 పరుగులతో అజేయంగా నిలిచారు. భారతజట్టు ఈ గ్రూప్‌లో ఇప్పటికే పాకిస్తాన్, శ్రీలంకపై విజయాలు సాధించి అగ్రస్థానంలో కొనసాగుతుంది.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు (ఎంఎల్ఎ కప్) శనివారం ఫ్లడ్‌లైట్ల కాంతుల్లో హోరాహోరీగా సాగాయి. మహిళల సెమీఫైనల్‌లో కర్నూలు జట్టు కృష్ణాజిల్లా జట్టుపై 25-22, 22-25, 15-13 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో విశాఖ - ఎస్ఎపి - ఎస్ఆర్ జట్టు (పశ్చిమగోదావరి జిల్లా)ల మధ్య హోరాహోరీగా మ్యాచ్ సాగింది. పురుషుల విభాగంలో ఉభయగోదావరి జిల్లాల జట్లు సెమీ ఫైనల్‌లో పోటీ పడుతుండగా, మరో సెమీ ఫైనల్‌లో ఆర్టిలరీ జట్టు (హైదరాబాద్) - ఇఎంఇ జట్టు (హైదరాబాద్)ల మధ్య జరుగనుంది. మ్యాచ్‌లను చూడడానికి పాలకొల్లు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున క్రీడాభిమానులు తరలివచ్చారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, మున్సిపల్ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి తిలకించారు.

కబడ్డీ విజేతలుగా చిత్తూరు, విశాఖ


మొదటి బహుమతిసాధించిన చిత్తూరు జిల్లా జట్టు

ప్రజాశక్తి-కందుకూరు

మూడు రోజుల పాటు ప్రకాశం జిల్లా కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిసాయి. పురుషుల విభాగంలో మొదటి బహుమతి చిత్తూరు జిల్లా జట్టు కైవశం చేసుకుంది. రెండవ బహుమతిని అనంతపురం జిల్లా జట్టు 7 పాయింట్ల ఆధిక్యతతో గెలుచుకుంది. మహిళా విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు 10 పాయింట్ల మొదటిస్థానంలో నిలిచింది. 8 పాయింట్లతో కృష్ణజిల్లా జట్టు 2వ స్థానంలో సాధించింది.


తలపడుతున్న తూర్పుగోదావరి, అమరావతి జట్లు

లీగ్ దశకు పిపిఆర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణాజిల్లా)

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఇఐఎల్) సౌజన్యంతో జరుగుతున్న పిపిఆర్ రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ లీగ్ పోటీల్లో భాగంగా శనివారం నాటికి ఎనిమిది జట్లు లీగ్ దశకు చేరకున్నాయి. కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, అనంతపురం, కడప, విశాఖపట్నం, ఉయ్యూరు, పుదుచ్చేరి జట్లతో రాష్ట్రంలోని కేంద్ర క్రీడల శాఖ పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) హాస్టల్స్ జట్లతో మొత్తం 31 జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో అమరావతి, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో తొలి నుంచి ఆధిక్యం సాధించిన అమరావతి జట్టు సునాయసంగా విజయం సాధించింది. భారత కబడ్డీ జట్టు క్రీడాకారిణులు మండలి మౌనిక, జాతీయ పతకం సాధించిన కెవి రమణ, జాతీయ జట్టులో ఆడిన నసీమా, తిరుపతమ్మలు ఈ పోటీల్లో పాల్గొనడంతో ఆసక్తికరంగా మారాయి. లీగ్ దశలో అత్యధిక విజయాలు సాధించిన జట్టు లీగ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

హైదరాబాద్ ఖాళీ

- నగరవాసుల పల్లెబాట
- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట
- జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్


హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగా టోల్ ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరం ఖాళీ అయింది. సంక్రాంతి పండుగకు నగరవాసులు పల్లెబాట పట్టడంతో భాగ్యనగరం బోసి పోతోంది. నిత్యం జనం రద్దీతో కిటకిటలాడే బస్తీ రహదారులు వెలవెలబోతున్నాయి. షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, హోటల్స్, పర్యాటక ప్రాంతాలన్నీ కళాహీనంగా కనిపిస్తున్నాయి. జనం లేకపోవడంతో కొన్ని రూట్లలో ఆర్టీసీ సర్వీసులను కుదించారు. లోకల్ రైళ్లలోనూ సందడి తగ్గింది. పండుగ సందర్భంగా తెలంగాణ పర్యాటక శాఖ పరేడ్ గ్రౌండ్‌లో తొలిసారిగా కైట్, స్వీట్ ఫెస్టివల్ ప్రారంభించినా జనం పలచగానే కనిపించారు. కూకట్‌పల్లి, మియాపూర్, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, కొండాపూర్, హైటెక్‌సిటీ, ఈసీఐఎల్, మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, నాగారం, జీడిమెట్ల, చింతల్ ప్రాంతాలు చాలావరకు ఖాళీ అయ్యాయి. సొంతూళ్ళకు వెళుతున్న వారు స్థానిక పోలీసు స్టేషన్లలో ఇంటి అడ్రస్‌తో సమాచారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు. దీనిపై బస్తీల్లో పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చోరీలను అదుపు చేసేందుకు సిసి టివిలతో పాటు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మొత్తంగా సంక్రాంతి ప్రభావం ఈ ఏడాది కూడా జంట నగరాలపై స్పష్టంగా కనిపిస్తోంది. పండుగకు సొంతూళ్ళకు పోయే వారితో మహాత్మాగాంధీ బస్ స్టేషన్, జూబ్లీ బస్టాండ్, కూకట్‌పల్లి బస్ స్టేషన్, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు ట్రావెల్స్ ప్రయాణికుల నుంచి రెండింతల ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రాంతానికి వెళ్ళే రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. రెండో శనివారం నుంచి వరుసగా నాలుగు రోజులు సెలవు రావడంతో శుక్రవారం రాత్రి నుంచి ప్రజలు పెద్దఎత్తున ప్రయాణమయ్యారు. ఎల్బీనగర్ చౌరస్తా వద్ద అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ట్రాఫిక్ జామ్ కావడంతో వివిధ వాహనాల వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగా టోల్‌ప్లాజా వద్ద శనివారం వేకువ జామున భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు రెండు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లో ఆరుగేట్ల నుంచి వాహనాలను అనుమతించే టోల్‌ప్లాజా నిర్వాహకులు మొత్తం పది గేట్లు తెరిచినా వాహనాల రద్దీ తగ్గలేదు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు రద్దీ తగ్గలేదు. టోల్‌గేట్‌కు నాలుగైదు కిలోమీటర్ల ముందు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాల రద్దీని నియంత్రిస్తున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68